ఆంధ్రసచిత్రవారపత్రిక

సంపుటి : 83 | విజయవాడ | వెల: రు.4/-

శక సం. 1912 పుష్య మాసం 14వ తేదీ

సంచిక : 20 | 4-1-1991 | పేజీలు: 76

## విషయాను క్రమణిక

### సీరియల్స్:


| | | |
|---|---|---|
| నేత్రధనుస్సు | శాతవాహన | 10 |
| మోహినీతాండవం | కొత్త రవీంద్రబాబు | 24 |
| ప్రణయవల్లరి | యర్రగుంట్ల వరలక్ష్మీదేవి | 44 |
| సాగరమథనం | అడివి సూర్యకుమారి | 53 |
| మణికంఠుడు | ప్రయాగ రామకృష్ణ | 60 |
| భారత మహాకవిత్రయం | భాగవతుల సుబ్రహ్మణ్యం | 66 |


### కథలు:


| | | |
|---|---|---|
| సర్పనీతి | పారుపూడి విశ్వేశ్వరరావు | 20 |
| మనసు నిండింది | ఉమాశివ | 30 |
| వాళ్లలో ఒకడ్ని | వచ్చిగోళ్ల సుధ | 57 |


### శీర్షికలు:


| | |
|---|---|
| సంపాదకీయం (అంధకారంలో 'ఆశాకిరణం' ఇండోపాక్ చర్చలు) | 4 |
| అభినవసీత శ్రీరంజని | 7 |
| మీకు తెలుసా? | 13 |
| ఈ వారంలో మీ యోగం | 18 |
| యువతా కవితా | 19 |
| హల్లో డాక్టర్ నేనేం చెయ్యాలి? | 23 |
| డెంటల్ హెల్త్ క్విజ్ | 26 |
| న్యాయచట్టం | 34 |
| ఎన్.టి.ఆర్.తో ఇంటర్వ్యూ | 36 |
| అలనాటి మేటి చిత్రాలు | 41 |
| సినిమా సినిమా | 42 |
| 1991లో మీ యోగం | 50 |
| వీక్లీ పోస్ట్ | 64 |
| డీజింగ్‌లో ప్రేమ వక్షులు | 65 |


ముఖచిత్రం . సబియ
(ఫొటో కె.ఆర్.వి. భక్త)

క్యాలెండర్ చిత్రం : 'పసిడి పంటలు'లో భానుప్రియ
(క్యాలెండర్ పంపినవారు : సి.హెచ్. వెంకటేశ్వరరావు, హైదరాబాద్)

Chairman. S RADHAKRISHNA, Editor VEERAJI,
Printed and Published by S. NAGESWARA RAO for Nageswararao Estates Ltd.,
at the Andhra Patrika Press, Gandhinagar, VIJAYAWADA-520 003,
Phones Editorial 75667, Business 61247, 61248

# సంపాదకీయం

## అంధకారంలో 'ఆశాకిరణం' ఇండోపాక్ చర్చలు

మనదేశంలో కేంద్ర, రాష్ట్ర సంబంధాలే బెడిసి కొట్టి తలనొప్పిగా ఉంటున్న సమయంలో- పొరుగునున్న అమిత్ర దేశం పాకిస్తాన్‌తో తెల్లారేసరికి సత్ సంబంధాలు సరస సల్లాపాలు యేర్పడిపోతాయి అనుకోడం అమాయకత్వమే అవుతుంది. అయితే భారత-పాకిస్తాన్‌ల మధ్య మూడు రోజులపాటు ఇస్లామాబాద్‌లో ప్రభుత్వ కార్యదర్శులు పాల్గొని-అధికారుల హోదాలో చేసిన ముమ్మరమైన చర్చలు కేవలం వేడిమిని మాత్రమే పుట్టించినవిగా ముగిసిపోలేదు. చిన్న పిసరు ఆశాకిరణం కూడా కనిపించింది-సరిహద్దుల వెంబడి సైన్యం పోరాటం జరిపి ఉభయ దేశాల మధ్య గల సమస్యలను పరిష్కరించుకోడం అధునిక ప్రపంచంలో సాధ్యం కాదన్నది పాకిస్తాన్‌లో యీ మధ్యనే ప్రధానమంత్రిగా అధికారం చేజిక్కించుకున్న పారిశ్రామికవేత్త నవాజ్ షరీఫ్‌కు కూడా బాగా తెల్సు కాని-పంజాబ్, కాశ్మీర్‌లలో పాకిస్తాన్ కొనసాగిస్తున్న దొంగ యుద్ధం అల్లర్లను చెలరేగింపజేసే క్రూరవ్యూహం కూడా ఉభయ తారకం యెంత మాత్రం కావు అన్న సత్యాన్ని పాకిస్తాన్ ఛాందసవాదులకు-జియావాదులకు అంత సులువుగా తల

### 1991 శుభాకాంక్షలు

పాఠకులకి, ప్రకటనకర్తలకు ఏజెంట్‌లకు, రచయితలకు అందరికీ మా నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు.

—ఎడిటర్

ఒరులేయవి యొనరించిన నరవర యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమ ధర్మపథములకెల్లన్!

# ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు: దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావుపంతులు సంపాదకులు: శివలెంక శంభుప్రసాద్(1938-1972)

ఛెయిర్మేన్: శివలెంక రాధాకృష్ణ ఎడిటర్: వీరాజీ ప్రింటర్ &పబ్లిషర్: శివలెంక నాగేశ్వరరావు

కెక్కదు- అయితే యీ దిక్కుగా మొన్న *19* డిసెంబర్‌తో ముగిసిన మూడు రోజుల చర్చలు-వెనుకటి చర్చలకన్నా స్పష్టంగా ముందుకుసాగాయి. పాకిస్తాన్ విదేశాంగ శాఖ కార్యదర్శి షెహయార్ ఖాన్, భారత విదేశాంగ కార్యదర్శి ముచికుంద్ దుబేలు చాలా స్పష్టంగా- నిర్మొహమాటంగా ఉభయ దేశాల వాదనలను చర్చల బల్లమీద చర్చించగలిగారూ అంటే- పాకిస్తాన్‌లోను భారత దేశంలోనూ కూడా ప్రధానమంత్రులు యిద్దరూ కొత్తగా 'గద్దె' యెక్కినవారు కావటం ఒక కారణం- ఇటీవల 'మాలె'లో జరిగిన 'సార్క్' సమావేశాలలో శ్రీయుతులు చంద్రశేఖర్, నవాజ్ షరీఫ్‌లు-కొత్తగా స్నేహానికి చేతులు కలపాలని నిర్ణయించుకున్న వెంటనే యీ చర్చలు సాగినందువల్ల-యివి "నకారాత్మక" దృక్పథాన్ని ప్రక్కకి నెట్టి కొంత ముందు చూపుతో కొనసాగటానికి ఆస్కారం యేర్పడ్డది. అందువల్లనే కేవలం కార్యదర్శుల హోదాలో జరిగిన చర్చలే అయినా వీటికి అత్యున్నత స్థాయిలో జరిగిన చర్చలకి యిచ్చినంత ప్రాధాన్యతని, ప్రచారాన్ని భారత ప్రభుత్వ ప్రచార యంత్రాంగం-పాకిస్తాన్ రేడియో టెలివిషన్‌లు కూడా యిచ్చాయి! భారత ప్రతినిధి ముచికుంద్ దుబే పాకిస్తాన్ అధ్యక్షుణ్ణే, ప్రధాన మంత్రినీ కూడా కలుసుకుని "కాశ్మీర్" విషయంలో భారత వైఖరి మారగల అవకాశాలు లేవు అని, నిష్కర్షగా తమ గవర్నమెంట్ తరఫున చెప్పగలిగారు-అదే మాదిరిగా పాకిస్తాన్ కూడా కాశ్మీర్‌లోకి తాము సాయుధ దుండగీండ్రను దొంగ చాటుగా పంపటం లేదని-నైతిక రాజకీయ మద్దత్తుని మాత్రమే యిస్తున్నామని మరోసారి బుకాయించింది

అయితే-రెండు సంవత్సరాలుగా సంతకాలు మాత్రం లాంఛనంగా జరిగి అమలుకు నోచుకోని "అణు కేంద్రాల మీద దాడుల నివారణ" వొప్పందం అమలు జరుగుతుందని పాకిస్తాన్ హామీ యిచ్చింది. సైనిక విన్యాసాలు-సైన్యాల కదలికలు సరిహద్దుల వెంబడి జరిగే కార్యకలాపాలకి సంబంధించి-రెండు దేశాల మధ్య- పరస్పరం సంభాషణలు-వారం వారం జరగాలని కూడ యీ చర్చలలో అంగీకారం కుదిరింది. ఉభయ దేశాల సైనిక డైరక్టర్ జెనరల్ హోదా గల అధికారులు వారానికోసారి టెలిఫోన్‌ల మీద సంభాషించుకోవాలన్న నిర్ణయం కూడా, యిప్పుడున్న ఎడముఖం-పెడముఖం పరిస్థితులలో గొప్ప నిర్ణయమే-

దీపావళి నుంచి మళ్లీ దీపావళికే దీపాలు అన్నట్లుగా తిరిగి చర్చలు మరో ఆర్నెల్లకి అనకుండా- ఫిబ్రవరిలోనే జరపాలని అంగీకరించడం కూడా- యీ రెండు దేశాల మధ్య కొత్త అవగాహన కుదిరే అవకాశాలను మెరుగుపరుస్తున్నది.

పాకిస్తాన్‌లో ప్రధానమంత్రి మారినా భారత్‌మీద కత్తులు నూరే వర్గాలు యింకా ప్రాబల్యంలోనే వున్నాయి. జియా అనుయాయులు- ఛాందస వాదులు కూడా వెనుకటి ప్రధానమంత్రి బేనజీర్ భుట్టో మెడలు వొంచి నట్లే-యీ కొత్త ప్రధాన మంత్రిని కూడా వెనుకటి "పాట"కి మళ్లించవచ్చును. ఈలోగానే రెండు దేశాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే ధోరణి కొంత మారి వాణిజ్య, రవాణా వొప్పందాలు అమలు జరిగే అవకాశాలు మెరుగుపడేలాగ చేసుకోవాలి-పాకిస్తాన్‌లో "గల్ఫ్" సంక్షోభ ప్రభావం యిప్పుడు ప్రత్యక్షంగా పరోక్షంగా కూడా అమితంగా వడ్డది ఆ దేశ ఆర్థిక పరిస్థితి నడ్డి విరిగి వుంది- అమెరికా సహాయ సంపత్తి లేకపోడం మరో దెబ్బ- వీటికి తోడు-"గల్ఫ్" సంక్షోభ నివారణకు "తగుదునమ్మా" అంటూ పాకిస్తాన్ సైన్యాలను కూడా పంపింది. ఇటువంటి పరిస్థితులలోనే భారతదేశం పాకిస్తాన్‌తో సంబంధాలను తన వాదం నొక్కి చెప్పి మెరుగు పరుచుకోవచ్చును. చర్చలు అధికారుల స్థాయిలోనా- మంత్రుల స్థాయిలోనా? అన్నది ప్రశ్న కాదు- అవి ఎట్లా జరిగాయి- యేంత ప్రయోజనం - ఎటువంటి అవగాహన వాటివల్ల లభించింది అన్నది ముఖ్యం-ఫిబ్రవరిలో చర్చలు జరిగేలోగా- మరింత "ప్రాతిపదిక"ను రూపొందించుకోవాలి- ఐక్యరాజ్య సమితి తీర్మానం పరిధిలోనని వారూ-సిమ్లా వొప్పందం పరిమితిలోనని మనమూ పట్టు పట్టి కూర్చున్నా అసలు సమస్య "కాశ్మీర్ వివాదం" మీద యేదో విధమైన చర్చల కదలిక రావటం ముఖ్యం-వారం వారం సైనికాధికారులు మాట్లాడుకున్నప్పుడు వాతావరణం మీద సినిమా టెలివిషన్ కార్యక్రమాల మీద మాట్లాడుకోరు కనుక- సరిహద్దుల వెంబడి జరిగే 'దొంగ ప్రవేశాలను' అరికట్టే మార్గంలో ప్రయత్నం ముమ్మరం చేయవచ్చును-పాకిస్తాన్ భారతదేశాల మధ్య గడచిన రెండు పర్యాయాలు జరిగిన "కార్యదర్శుల" హోదా చర్చలకన్నా యీసారి జరిగిన సంభాషణలు ఉపయోగకరంగా వున్నాయనే పరిశీలకులు అంచనా వేస్తున్నారు-శుభం!

***(22-12-'90)***

ఆంధ్రసచిత్రవారపత్రిక



అందరికీ 1991 శుభాకాంక్షలు!

| జనవరి | ఫిబ్రవరి | మార్చి | ఏప్రియల్ | మే | జూన్ | 1991 | | | | | జులై | ఆగస్టు | సెప్టెంబర్ | అక్టోబర్ | నవంబర్ | డిసెంబర్ |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| మంగ | శుక్ర | శుక్ర | సోమ | బుధ | శని | 1 | 8 | 15 | 22 | 29 | సోమ | గురు | ఆది | మంగ | శుక్ర | ఆది |
| బుధ | శని | శని | మంగ | గురు | ఆది | 2 | 9 | 16 | 23 | 30 | మంగ | శుక్ర | సోమ | బుధ | శని | సోమ |
| గురు | ఆది | ఆది | బుధ | శుక్ర | సోమ | 3 | 10 | 17 | 24 | 31 | బుధ | శని | మంగ | గురు | ఆది | మంగ |
| శుక్ర | సోమ | సోమ | గురు | శని | మంగ | 4 | 11 | 18 | 25 | | గురు | ఆది | బుధ | శుక్ర | సోమ | బుధ |
| శని | మంగ | మంగ | శుక్ర | ఆది | బుధ | 5 | 12 | 19 | 26 | | శుక్ర | సోమ | గురు | శని | మంగ | గురు |
| ఆది | బుధ | బుధ | శని | సోమ | గురు | 6 | 13 | 20 | 27 | | శని | మంగ | శుక్ర | ఆది | బుధ | శుక్ర |

మరపురాని కళానిధులు!

# అభినవ సీత 'శ్రీరంజని'



భారతీయులకు రామాయణ-భారతాలు పూజ్యనీయమే కాకుండా, వాటిలో భూమికలు, సంఘటనలు నిత్యం స్మరిస్తుంటారు . రామాయణంలో ప్రధానమైన నాల్గు భూమికలు మానవజీవితంలో ముడిపడి వున్నటువంటివి అవి రాముడు, సీత, ఆంజనేయుడు, రావణాసురుడు వీటి ప్రవృత్తులు అందరికీ తెలిసినవే కాబట్టి వాటి గురించి వివరించ నవసరం లేదు రామాయణ మహాకావ్యం ఈనాటి వరకు అనేక కళారూపాల్లో సంఘటనలుగా ప్రజలను అలరింపజేస్తున్నాయి

ప్రత్యేకించి భారతీయ సినిమాలో వివిధ భాషల్లో ఎన్నో పర్యాయాలు రామాయణ గాథ చిత్రాలుగా తీశారు ఇంకా తీస్తునే వున్నారు మధురాతి మధుర సంఘటనల మిళితం రామాయణం!

సినిమాల్లో రాముడు, సీత, ఆంజనేయుడు, రావణాసురుడు పాత్రలు సమర్థవంతంగా నటించిన వారి కీర్తి కూడా ప్రజల్లో నిలిచి వుంటుంది సీతా- రాములుగా నాల్గు చిత్రాల్లో శోభనా సమర్థ్,ప్రేమ్అదీబ్ నటించి గొప్ప కీర్తి గాంచారు వీరు ఎన్ని చిత్రాల్లో నటించినప్పటికీ సీతా- రాముల భూమికలే చిరస్మరణీయ మయ్యాయి ఆ రోజుల్లో అందరూ వారిని సీత-రాముడు అని పిలిచేవారు.

మన తెలుగులో చిత్తజల్లు పుల్లయ్య దర్శకత్వంలో ఈస్టిండియా ఫిలిం కంపెనీ (కలకత్తా) వారు లవకుశ (1934) తీయడం జరిగింది ఈ చిత్రంలో సీతగా శ్రీరంజని, రాముడిగా పారుపల్లి సుబ్బారావు నటించారు. ఈ చిత్రం ఆనాడు ఘనవిజయం సాధించింది ఇందులో నటించిన సీత పాత్ర ధారిణి శ్రీరంజనికి గొప్పపేరు వచ్చి, నాటి స్త్రీ ప్రేక్షక హృదయాల్లో నిలిచిపోయింది. శ్రీరంజని నివాసం తెలుసుకొని కొందరు ముత్తైదువలు పసుపు కుంకుమలు నూతన వస్త్రాలు సమర్పించుకొని వచ్చేవారు ఈ నిజాన్ని ఈనాడు నమ్మకపోవచ్చు!

తొలి చిత్రంతోనే అంతటి కీర్తి సంపాదించిన శ్రీరంజని 1906వ సం లో గుంటూరు జిల్లా మురికిపూడిలో జన్మించింది అదే వారి స్వగ్రామం.

శ్రీరంజని మేనత్తలు నాట్యం, సంగీతం బాగా అభ్యసించి, ప్రదర్శించి రాణించే వారు అందువల్ల శ్రీరంజనికి బాల్యంలోనే ఆట, పాటల యందు అభిరుచి కలిగింది కీ శే. బెజవాడ హనుమాన్‌దాసు వద్ద సంగీతం అభ్యసించింది అప్పుడే నాగుమణి అనే వ్యక్తి కూడా ఆయన వద్ద సంగీతం నేర్చుకుంటుండే వాడు.

1930 సం ప్రాంతాల్లో ఆంధ్రదేశంలో నాటకాలకు ప్రజాదరణ అధికంగా వుండేది పౌరాణిక నాటకాలైతే యిక చెప్పనక్కర లేదు. చుట్టుప్రక్కల గ్రామాల నుంచి కూడా ఎడ్లబళ్ల మీద వచ్చి నాటకాలు చూచేవారు నాటి కళాభిమానులు... శ్రీరంజని బాగా పాడుతుందని తెలుసుకొని నాటక సంస్థవారు తమ నాటకాల్లో వేయమని కోరడం, అందుకు అంగీకరించడం జరిగింది. హై స్థాయిలో వివిధ రాగాలతో పద్యాలు, పాటలు మధురంగా గానం చేసేది శ్రీరంజని. పాత్ర పరంగా చక్కగా అభినయించేది. నాటకాల్లో స్త్రీ-పురుష పాత్రలు కూడా ధరించేది. సావిత్రి, ఉషా పరిణయం, రాధాకృష్ణ, శశిరేఖా పరిణయం, కనకతార నాటకాల్లో పాత్రలు ఈమెకు నటిగా ఖ్యాతిని తెచ్చిపెట్టాయి. రాధాకృష్ణ నాటకంలో రాధ వేసేది, కృష్ణుడు వేసేది. అలాగే శశిరేఖా పరిణయంలో శశిరేఖ,అభిమన్యుడి పాత్రలు ధరించేది ప్రేక్షకుల హర్షధ్వానాలు అందుకునేది!

ఈ నాటకాలకు హార్మోనీ వాయించే నాగుమణితో శ్రీరంజని వివాహం జరిగింది గృహస్థ జీవితం గడుపుతూ నాటకాలు వృత్తిగా భార్యాభర్తలు పని చేస్తుండేవారు..

శ్రీరంజని కంఠస్వరం గురించి తెలుసుకున్న హెచ్. ఎం. వి గ్రామఫోను కంపెనీ వారు రికార్డులు ఇవ్వడానికిగాను

ఆమెతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆ రోజుల్లో తెలుగు పౌరాణిక నాటకాలు పూర్తిగా గ్రామఫోన్ రికార్డుల్లో వచ్చేవి. అలా వచ్చిన చాలా నాటక రికార్డుల్లో శ్రీరంజని పాల్గొన్నది

అప్పుడే 'లవకుశ' చిత్రం తీయడానికి ఉపక్రమిస్తున్నారు పుల్లయ్యగారు. బెజవాడలో పుల్లయ్య మకాం పెట్టి నటీనటుల ఎంపిక ఆరంభించారు. మధుర గాయకుడు పారుపల్లి సత్యనారాయణ- శ్రీరంజని గురించి పుల్లయ్యకు చెప్పడం జరిగింది అప్పుడు శ్రీరంజని బెజవాడలో వుంది పుల్లయ్య గారు ఆమెను చూశారు నచ్చింది సీత పాత్రకు ఒప్పందం కుదుర్చుకున్నారు అయితే

## శ్రీరంజని

బెంగుళూరులో గ్రామఫోన్ రికార్డింగ్ అయిన తర్వాత కలకత్తా వచ్చి 'లవకుశ' చిత్రీకరణలో పాల్గొంటానని శ్రీరంజని ముందే చెప్పింది.

అదృష్టం వరించి శ్రమ లేకుండా సినిమాలో నాయకి పాత్ర లభించింది 'లవకుశ'లో చక్కగా నటించి, మధురంగా పాడింది లవకుశ తర్వాత కొన్ని అవకాశాలు వచ్చాయి

మాయాబజార్ లేక శశిరేఖా పరిణయం (36) సతీతులసి (36) సారంగధర (37) చిత్రనళీయం (38) కృష్ణ లీలలు (35) నరనారాయణ (37) మార్కండేయ (36) వరవిక్రయం (39)

ఈమె ఆఖరి చిత్రం పుల్లయ్య దర్శకత్వంలో విడుదలయిన 'వరవిక్రయం' ఈమె నటించిన సాంఘిక చిత్రమిదొక్కటే.

ఆరేళ్ల కాలంలో మొత్తం 9 చిత్రాల్లో ప్రధాన పాత్రలు ధరించి నాటి మేటి తారగా కీర్తింపబడింది.

గానము, నటన, రూపం ఉండటం వల్ల శ్రీరంజని ప్రేక్షకుల ఆదరాభిమానాలు బాగా చూరగొంది.

లవకుశ చిత్రం ఆంధ్రదేశమంతటా దిగ్విజయంగా ప్రదర్శింపబడడంతో శ్రీరంజనికి పలుచోట్ల సన్మానాలు జరిగాయి. మద్రాసు క్రౌన్ టాకీసులో 'లవకుశ' నూరు రోజులు ప్రదర్శింపబడింది ఈ సందర్భంగా జరిపిన ఉత్సవ కార్యక్రమంలో శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు గారు, జైపూర్ మహారాజా శ్రీ విక్రందేవ్‌వర్మ గారు, నాటి మద్రాసు గవర్నరూ పాల్గొన్నారు. సీత పాత్ర ధరించిన శ్రీరంజనికి బంగారు పతకం బహూకరించారు హర్షధ్వానుల మధ్య.

నాటకాల్లో, సినిమాల్లో ఎన్ని పాత్రలు ధరించినా 'సీత'గా ఆమె పేరు చిరస్థాయిగా నిలిచిపోయింది.

ఆమెకు ముగ్గురు కుమారులు- పెద్ద కుమారుడు ఎమ్ మల్లిఖార్జునరావు దర్శకుడిగా చిరపరిచితులు. నాగుమణి నిర్మాతగా కొన్ని చిత్రాలు తీశారు. మిగతా ఇద్దరు కుమారులు ఎస్. ఆర్. మూవీస్ సంస్థ భాగస్వాములుగా వున్నారు.

1939 సం.లో తన 33 వ ఏట శ్రీరంజని క్యాన్సర్ వ్యాధితో బాధపడి తమ స్వగ్రామంలో నే మరణించింది.

ఆమె మరణించే ముందు తన భర్తతో ఆవేదనతో పిల్లల సంరక్షణ కొరకు తన చెల్లెలు మహాలక్ష్మిని పెళ్ళి చేసుకోమని కోరింది ఆయన అలాగే చేశారు. ఆ మహాలక్ష్మే జూ.శ్రీరంజనిగా చిత్రాల్లో నటించింది. తక్కువ చిత్రాల్లో నటించినా ఎక్కువ కీర్తి నార్జించింది శ్రీరంజని.

—అరిపాక సూరిబాబు

సీరియల్



# నేత్రధనుస్సు

## సాతవాహన

**ఇంతవరకూ సాగినకథ- 8 :** డేగర్ మురా సి.బి.ఐ. ఆఫీసర్ యశ్వంత్ కుమార్ కూతురు మనోజను కాల్చి చంపి అతన్ని కిడ్నాప్ చేస్తుంది. ఈ సంఘటనపై ఇన్‌స్పెక్టర్ కార్తికేయ దర్యాప్తు ప్రారంభిస్తాడు. గతంలోని సి.బి.ఐ. ఆఫీసర్ల ఆచూకీపై దర్యాప్తు చేస్తున్న ఫైలును అందజేయమని మురా నాయకుడు చిదానందం యశ్వంత్‌ను బలవంతపెడతాడు. నయనతారకు ధైర్యం చెప్పేందుకు ఫ్లాగ్మెడమ్ రాగా అనాధ శరణాలయంలో తాను గడిపిన రోజులు జ్ఞప్తికి వస్తాయి.

*[గత సంచిక తరువాయి]*

కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా గడిచిపోయాయి.

"మీ...మీకు నిజంగా కళ్లు లేవంటే నమ్మశక్యం కావడం లేదు." అన్నాడతను.

"మిమ్మల్ని నమ్మమని నేనేం కోరలేదు." చురుగ్గా సమాధానం చెప్పిందామె. అంతే అప్పటికామె గొంతులో ఆవేశం చాలావరకూ శాంతించింది.

ఆ మాటను కూడా అతను పట్టించుకోలేదు.

"కొలనులో ఈదే చేపల్లా ఎంత అద్భుతమైన కళ్ళు!" విభ్రపాటు తనను తానే మర్చిపోయినవాడిలా అన్నాడు. "ఈ కళ్ళలో చూపు లేదంటే .. "

నయనతార అతని మాటకు అసహనంగా అడ్డొచ్చింది

"నా కళ్ళగురించి మీరేమీ వాపోనక్కర్లేదు. మీ పనేదిలో మీరు చూసుకోవచ్చు."

ఆ మాటతోఅతను మళ్ళీ మామూలుగా మారిపోయాడు. అతని పెదవుల మీద సన్నని చిరునవ్వు మెదిలింది.

"మీకభ్యంతర లేకపోతే కొద్ది నిమిషాలు నేనిక్కడ కూచుంటాను."

"అభ్యంతరం వుంది. అయితే ఈ సిమెంటు బెంచీ నే కట్టించింది కాదు," అందామె.

అతను నవ్వుతూ ఆమె పక్కన కూర్చున్నాడు.

"థాంక్స్."

"దేనికి?"

"మీ పక్కన కూచునేందుకు అనుమతించినందుకు."

"నేనేమీ అనుమతించలేదు. మీ అంతట మీరు కూర్చున్నారు."

"సరే, అలాగే అనుకుందాం. నా పరధ్యానం మూలంగా ఆ పాప ప్రమాదంలోకి పరిగెత్తడం గమనించలేక పోయాను. అందుకు సారీ చెప్పకుంటున్నాను."

"సారీ చెప్పడం వల్ల ఏమౌతుంది? ఆ పాప ప్రాణాలు పోయివుంటే ఏంచేసేవారు?"

"ఒప్పేసుకుంటున్నాగా! అయినా మీరనవసరంగా నన్ను కోప్పడుతున్నారేమో గమనించారా? ఆ పాప మంచి చెడ్డలు గమనించవలసింది తన తల్లిదండ్రులు. జాగ్రత్త తీసుకోకుండా నిర్లక్ష్యంగా వదిలేసినందుకు మీరు వాళ్ళని కోప్పడాలి," అన్నాడు.

"అవును, వాళ్ళననాల్సిందే. కానీ, అందువల్ల మనుషులుగా మన బాధ్యత తీరిపోవడం లేదు. మానవతా ధర్మం అనేది ప్రతి ఒక్కరికీ వుంటుంది" చెప్పింది నయనతార.

"నిజమే ననుకోండి. అయినా సంధ్యా సమయం అంటే నాకు చాలా ఇష్టం. అస్తమిస్తున్న సూర్యుడివైపు చూస్తూ అలా పరధ్యానంలో పడిపోయాను."

"సంధ్యాసమయం అంటే నాకూ ఇష్టమే. అందుకే ఈ సమయంలో ఇక్కడున్నాను అయినా అంతమాత్రం చేత అంత తన్మయత్వంలో పడిపోనవసరం లేదు. ఎంత సౌందర్యారాధన వున్నా మనిషి తన చుట్టుపక్కలేం జరుగుతుందో తెలుసుకోలేనంత అజ్ఞానంలోకి వెళ్లిపోనక్కర్లేదు."

"భలే మాటన్నారు మీ మాట తప్పకుండా నేను డైరీలో నోట్ చేసుకుంటాను. ఒక విషయం చెప్పండి నేనంటే సరే. కానీ, మీరు కూడా సంధ్యా సౌందర్యాన్ని...." మాట పూర్తి చేయబోతూ అతను మధ్యలోనే ఆగిపోయాడు.

"సారీ, మిమ్మల్ని కించపర్చాలన్న వుద్దేశంతో నేనా మాటన్లేదు," అన్నాడు.

నయనతార మొట్టమొదటిసారిగా నవ్వింది

"ఫర్వాలేదు. ఈ విషయంలో మాత్రం మీరు నాకు సారీ చెప్పనవసరం లేదు. కళ్ళులేవన్న ఆత్మన్యూనత నాకెంత మాత్రమూ లేదు," అని క్షణమాగి, "మీ ప్రశ్న నాకర్థమైంది సంధ్యా సౌందర్యాన్ని చూసి ఆనందించడానికి మీకంటే కళ్ళు

న్నాయి. కానీ, కళ్ళులేని నేనెలా ఆ సౌంద ర్యాన్ని చూసి ఆనందించగలననే కదూ మీ ప్రశ్న?" అంది.

"స్టుపిడ్‌లా అడిగాను, క్షమించండి. అయినా మీకు కళ్ళులేవని ఎవరన్నారు? పొగుడుతున్నాననుకోకండి - ఇంతందమైన కళ్ళు ఇంతవరకూ నేనెక్కడా చూడలేదు. నిజం చెబుతున్నాను సుమండీ."

"మీరేం మాట మార్చనక్కర్లేదు. మీ ప్రశ్నకు జవాబు చెబుతాను. సంధ్యా సౌందర్యాన్ని కళ్ళున్నవాళ్ళే కాదు కళ్ళు లేని వాళ్ళుకూడా దర్శించగలరు. మీరు కళ్ళతో దర్శించిన సౌందర్యాన్ని నేను మన సుతో దర్శిస్తాను. కావలిస్తే మీరు కళ్ళు మూసుకోండి. సౌందర్యాన్ని కళ్ళతోనే చూడక్కర్లేదని మీకే తెలుస్తుంది."

"మీకు కోపగించుకోవడమే కాదు, అందంగా మాట్లాడ్డంకూడా బాగా చేతనౌతుందే! మీ పేరు తెలుసుకోవచ్చా?"

"నయనతార."

"నయనతార! బ్యూటిఫుల్ నేమ్! ఇంతకీ మీరెవరికి నయనతార?"

"మా పూర్ణా మాడమ్‌కు. మా అమ్మానాన్నా ఎవరోకూడా నాకు తెలీదు. అనాధశరణాలయంలో పెరిగాను. పూర్ణా మాడమ్ ఆ పేరు నాకు పెట్టింది."

"మీ పూర్ణా మాడమ్‌కు మీరు నయన తార కావడం సంగతేమోగానీ, మీ నయనాలు మాత్రం నిజంగా తారల్లాగే వున్నాయి."

"అవును తాగలే. తారలు కూడా



చూడలేవుగా," నవ్వేసింది.

"అంతమాటనకండి.చూడలేకపోయినా తారలు లోకానికే వెలుగునిస్తాయి."

"పోన్లెండి, ఆ టాపిక్ ఇంక మర్చి పోదాం. ఇంతకీ మీ పేరు మాత్రం చెప్ప నేలేదు."

"యశ్వంత్! యశ్వంత్ నా పేరు."

"ఏం చేస్తుంటారు?"

"చదువు పూర్తైపోయింది - ఇక మీద ఏంచేయాలా అని ఆలోచిస్తుంటాను."

"ఓహో!" అందంగా నవ్వింది.

"మీరేమీ అనుకోకపోతే ఓ మాటడ గాలనుంది." అన్నాడు యశ్వంత్.

"అడగండి."

"కళ్ళుండి, స్పష్టంగా అంతా చూడ గలిగి వుండి నేను చూడకపోయిన విష యాన్ని మీరెలా గమనించగలిగారు? సమ యానికి వెళ్లి ఆ పాపను మీరెలా కాపా డగలిగారు? నాకు చాలా ఆశ్చర్యంగా వుంది."

"టైమింగ్," అంది నయనతార.

"అంటే?"

"నాలాంటి గుడ్డివాళ్లు టైమింగ్‌మీద ఎంతగా ఆధారపడతారో చెబితే బహుశా మీకాశ్చర్యం కలుగుతుందనుకుంటాను. ఆ పాప కాళ్ళకు మ్యూజికల్ షూస్ తొడు క్కుంది-మీరు గమనించారా? ఆ శబ్దాన్ని బట్టి, ఆ పాప ఏ దిక్కుకు పరిగెడు తోందో ఎంతసేపట్లో రోడ్డుమీదికి చేరుకుం టుందో అంచనా వేయగలిగాను. అలాగే ఇంజన్ శబ్దాన్నిబట్టి ఆ కారు ఎంతవేగంలో వస్తోందో ఎంతసేపట్లో ఆ పాపను చేరు కుంటుందో గ్రహించగలిగాను. ఈ లోపలే ఆ పాపను వెనక్కిలాగేయడానికి ప్రయ త్నించాను. అదృష్టవశాత్తు నా ప్రయత్నం ఫలించింది," చెప్పిందామె.


"మార్వలెస్. కానీ, ఒక విషయం మీరు గుర్తించారా?"

"ఏమిటది?"

"ఆ పాపను రక్షించడంలో మీ ప్రాణాలు ప్రమాదానికి గురైవుండేవి."

"తెలుసు. తెలిసే చేశాను."

అతను కొద్ది క్షణాలు ఆమెకేసే చూస్తుండిపోయాడు




"మీరు సంతకం పెట్టగలరనుకుం టాను?" అడిగాడు.

ఆమె మొహంలో కొద్దిగా ఆశ్చర్యం కనిపించింది.

"లక్ష సంతకాలు పెట్టగలను. ఎందుకో చెప్పండి".

అతను జేబులోంచి ఓ ఆటోగ్రాఫ్ పుస్తకం బయటికి తీశాడు.

"మీ ఆటోగ్రాఫ్ కావాలి."

"ఆటోగ్రాఫా! ఆటోగ్రాఫు లివ్వడా నికి నేనేమీ గొప్పదాన్నికానే. కనీసం మీ ఫ్రెండుని కూడా కాను," అంది.

"అలా అనకండి. మీ వ్యక్తిత్వం నాకు చాలా నచ్చింది. మీరో అపురూపమైన వ్యక్తి నయనతారగారూ. అంతేకాదు, ఈ క్షణంనుంచీ మీరు నా ఫ్రెండ్ కూడా, ఆటోగ్రాఫ్ ప్లీజ్."

ఆమె మాట్లాడకుండా అతని చేతి లోంచి ఆటోగ్రాఫ్ పుస్తకం తీసుకుంది. ఆటోగ్రాఫ్ పెట్టబోతూ ఆ పుస్తకాన్నోసారి తడిమింది.

"ఇందులో నాదే మొదటి ఆటోగ్రాఫ్ వుందే?" అడిగింది.

"అరె, ఆ సంగతి మీకెలా తెలి సింది?"

"భలేవారే! మీరు నాకు తీసిచ్చింది మొదటిపేజీ. దాన్నిబట్టే చెప్పాను."

అతను నవ్వేశాడు.

"యు వారె జీనియస్ నయనతార గారూ! అవును, ఈ పుస్తకంలో మీదే మొట్టమొదటి ఆటోగ్రాఫ్. చివరి ఆటో గ్రాఫ్ కూడా మీదే. మీకు తెలుసోలేదో, నాకు ఆటోగ్రాఫ్స్ కలెక్ట్‌చేసే అలవాటు లేదు."

"అదేమిటి?"

"ఈ ఆటోగ్రాఫ్ పుస్తకం నా హృద యంలాంటిది నయనతారగారూ. ఇందులో ఒకేఒక్క వ్యక్తికి సంతకం పెట్టే అవకాశం వుంది."

"మాటల్తో మీరు బాగా పల్టీకొట్టించ గలరు."

"లేదు నయనతారగారూ, నిజం చెబు తున్నాను. మీలాంటి అపురూపమైన వ్యక్తిని నేనింత వరకూ చూడలేదు."

"ఇప్పుడు చూస్తున్నారా?"

"అవును. మిమ్మల్ని చూస్తూనే ఎందుకనో ఈ పుస్తకంలో ఆటోగ్రాఫ్ పెట్టగల వ్యక్తి మీరేననిపించింది."

"ఏసీ! అయితే ఈ ఆటోగ్రాఫ్ పుస్తకం తీసుకోండి," సంతకం పెట్టకుం డానే ఆ పుస్తకం అతనికి తిరిగిచ్చేసిందామె.

"ఇదేమిటి ఆటోగ్రాఫ్ ఇవ్వరా?" అడిగాడతను.

"ఇవ్వదల్చుకోలేదు."

"అదేం?"

"ఆ ఆటోగ్రాఫ్ పుస్తకం మీ హృదయ మంత గొప్పదైనప్పుడు అందులో సంతకం పెట్టి చెడగొట్టడం నాకిష్టంలేదు. ఆటో గ్రాఫ్‌కోసం మరొకర్ని వెతుక్కోండి.''

"నయనతారగారూ!" వెనక నుంచి పిలిచా డతను.

నయనతార వినిపించుకోలేదు.

నేరుగా ముందుకెళ్లిపోయింది.

ఆమె వెళ్తున్నవైపే చూస్తూ కూర్చుండి పోయాడతను.

** ** ** ** **

నయనతార అక్కడ్నుంచి తిన్నగా శరణాలయానికి వెళ్లింది.

ఆ రోజు శరణాలయ వార్షికోత్సవం. ఆమె వెళ్లేసరికి పూర్ణిమా డం ఆమెకోసం ఆత్రంగా ఎదురుచూస్తోంది.

"నయనా! ప్రోగ్రాం ప్రారంభం కాబోతుంటే నువ్వెక్కడికి వెళ్ళావ్? ఈ రోజు ప్రోగ్రాంలో నీ పాటకూడా వుందని మర్చిపోయావా?" నిష్ఠూరంగా అడిగిందావిడ.

నయనతార చిన్నగా నవ్వింది.

"లేదు మా డం, మర్చిపోలేదు. నిజానికి పాటగురించే నేను బయటికి వెళ్లాను. టాంక్‌బండ్ మీద చల్లగాలిలో ప్రశాంతంగా కూర్చొని ఆ పాట మరోసారి మననం చేసుకున్నాను," చెప్పింది.

"చల్లగాలిలో కూర్చున్నావా! గొంతు చెడిపోతే?" మండలించింది పూర్ణిమా డమ్

"మీకా భయం అక్కర్లేదు. ప్రోగ్రాం సక్సెస్ చేసే పూచీనాది."

"సరేసరే. చిదానందంగారు ఏ క్షణంలోనైనా రావచ్చు. అవతల బోలెడు పనులున్నాయి," అంటూ హడావుడిగా అవతలికి వెళ్లిపోయిందావిడ.

నయనతార తనలోతనే చిన్నగా నవ్వుకుంది. పూర్ణిమా డం స్థానంలో మరొక మేట్రన్ వుండి వుంటే ఇలా చెప్పకుండా బయటికి వెళ్లినందుకు చాలా గొడవచేసి వుండేది. కానీ, పూర్ణిమా డం అలా ఎన్నటికీ చెయ్యదు. నయనతార మనసు పూర్ణిమా డం పట్ల కృతజ్ఞతతో నిండిపోయింది.

ఆమె అలా నిలబడివుండగానే పూర్ణిమా డం మళ్ళీ హడావుడిగా వచ్చింది.

"ఇదేమిటి ఇంకా ఇక్కడే నిలబడి వున్నావు? వెళ్లు వెళ్లు. వెళ్లి ప్రోగ్రాంకు రెడీకా," ఆమెను తొందరపెడుతూ ఎంత హడావుడిగా వచ్చిందో అంత హడావుడిగానే వెళ్లిపోయింది.

నయనతార తన గదిలోకి వెళ్లింది.

"వసంతా! లోపలున్నావా?" లోపలికి వెళ్తూనే ప్రశ్నించింది.

వసంత ఆమెతోపాటు ఆ గదిలో వుంటోంది. నయనతారలా ఆమె కూడా వికలాంగురాలే. అయితే నయనతార అంధురాలైతే వసంతకు పోలియోమూలంగా కాళ్లులేకుండా పోయాయి. చేతికర్రల సాయంతో అతి కష్టం మీద నడవగలుగు

# మీకు తెలుసా?

## ఉత్తమ బాక్సర్

లైట్ వెయిట్ బాక్సర్ పాదం బహదూర్‌మాల్ ఉత్తమ బాక్సర్ అవార్డును గెలుపొందాడు. 1962లో జకర్తా ఏషియన్ గేమ్స్‌లో బహదూర్‌కు ఈ అవార్డు లభించింది

### ఎక్కువ టీం టైటిల్స్

బాక్సింగ్‌లో ఎక్కువ టీం టైటిల్స్ గెలుచుకున్న ప్రతిభ సర్వీసెస్‌కు దక్కుతుంది 1950 నుంచి 1988 వరకు జరిగిన 34 చాంపియన్‌షిప్ పోటీలలో 31 సార్లు రికార్డు స్థాయిలో సర్వీసెస్‌కు టీం టైటిల్ లభించింది

## స్వర్ణ పతకం పొందిన తొలి జూనియర్ బాక్సర్

జూనియర్ ఏషియన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం పొందిన



తొలి జూనియర్ బాక్సర్ 17 ఏళ్ల మనోజ్ పింగ్లే. మహారాష్ట్రకు చెందిన ఈ బాక్సర్‌కు 1985లో ఖాట్మండులో జరిగిన పోటీల్లో ఛాంపియన్‌షిప్ లభించింది.

## మొదటి అంతర్జాతీయ రిఫరీ

తొలి అంతర్జాతీయ రిఫరీగా ఖుర్షీద్ పి. కువా పనిచేశారు ఈయన వరుసగా ఐదేళ్లు ఒలింపిక్స్ రిఫరీగా వున్నారు

## చెస్‌లో రికార్డ్స్

మనదేశంలో చెస్‌లో అధిక అవార్డులు సాధించిన ఘనత 19 సంవత్సరాల గ్రాండ్ మాస్టర్ విశ్వనాథ్ ఆనంద్‌కు



దక్కుతుంది. అనేక రికార్డులు సాధించి చెస్ ఆటలో చరిత్రను సృష్టించాడు. 1988లో బ్రసెల్స్‌లో జరిగిన పోటీలో గ్రాండ్ మాస్టర్ టైటిల్ సంపాదించాడు.

### ఒలింపిక్ జ్యూరీలో తొలి భారతీయుడు

బాక్సింగ్‌కు సంబంధించి జరిగిన ఒలింపిక్ గేమ్స్‌లో జ్యూరీగా పని చేసిన తొలి భారతీయుడు ఆస్పీ డి. అదజానియా 1984 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో యీయన జ్యూరీగా వున్నారు.

### అంతర్జాతీయ పోటీలో గెలిచిన తొలి భారతీయుడు

చెస్‌కు సంబంధించి జరిగిన అనేక అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని గెలుపొందిన తొలి భారతీయుడు పంజాబ్‌కు చెందిన మీర్ సుల్తాన్ ఖాన్. ఇతను 1930 ప్రాంతాల్లో ప్రపంచంలోని 10 మంది ఉత్తమ ఆటగాళ్లలో ఒకడిగా గుర్తింప బడినాడు.

సేకరణ : **తిలక్**

తుందామె.

నయనతార ఆ గదిలో ప్రవేశించే సమయానికి వసంత అక్కడే మంచం మీద బోర్లా పడుకుంది. నయనతార పిలుపుకు ఆమె సమాధానం చెప్పలేదు.

“వసంతా! గదిలో లేవా?” నేరుగా మంచం దగ్గరికివెళ్లి మంచం మీద చేతుల్తో తడుముతూ అడిగింది.

ఆమె చేతులకు వసంత భుజాలు తగిలాయి.

“వసంతా! ఏమిటిలా పడుకున్నావ్?” ఆమె తన పిలుపుకు సమాధానం చెప్పకపోవడంతో కొంచెం ఆందోళనగా అడిగింది నయనతార.

వసంత వెంటనే ఏడుస్తూ నయనతారను చుట్టేసుకుంది.

“నయనా!” అంది వెక్కుతూ.

“ఏమైంది వసంతా?” మరింత ఆందోళనగా అడిగింది నయనతార.

వసంత కొద్ది క్షణాలు ఏమీ మాట్లాడకుండా అలా ఏడుస్తూనే వుండిపోయింది.

“చెప్పు వసంతా, ఏమైంది?” ఆమె తలనిమురుతూ అనునయంగా ప్రశ్నించింది నయనతార.

“నయనా..., ఆ ముద్దు...”

ముద్దు!

ఆ పేరు వింటూనే నయనతార మొహం కఠినంగా మారిపోయింది.

“ముద్దు ఏం చేశాడు? చెప్పు వసంతా, నిన్నల్లరి పట్టించాడా?” అడిగింది.

“అల్లరి పట్టించి వూరుకొని వుంటే భరించేదాన్ని. కానీ, వాడు...” వెక్కిళ్ళ మధ్య ఆగిపోయింది వసంత.

“ఏం చేశాడు? చెప్పు వసంతా, ఏంచేశాడు?”

వసంత అలా వెక్కుతూనే చెప్పనారంభించింది.

ఆ రోజు మిగతా వాళ్లతో పాటు వసంత కూడా శరణాలయం వార్షికోత్సవానికి ప్రోగ్రాం ఎరేంజ్ చేయడంలో వుత్సాహంగా పాల్గొంది. పూర్ణామా డమ్ ఆమెకు డయాస్ అలంకరించేపని అప్పజెప్పింది. చేతికర్రల సాయంతో నడుస్తూనే ఆ పని చకచకా పూర్తిచేసింది వసంత. ఆ తర్వాత ప్రోగ్రాంకు తయారవడానికి గదిలోకి వెళ్లి పెట్టె తెరిచింది. సూట్ కేస్ తెరిచిన వెంటనే అందులో కనిపించిన దృశ్యానికి ఆమె మొహం అసహ్యంతో వంకర్లు తిరిగిపోయింది.



పెట్టె తెరుస్తూనే దుస్తులన్నింటిపైనా పోర్నోగ్రఫీ పుస్తకం ఒకటి కనిపించిందామెకు. తళ తళలాడే ఆర్ట్ పేపర్‌మీద అత్యంత అసహ్యకరమైన ఫొటోలు ముద్రించిన ఫారిన్ పుస్తకం అది. ఆ పుస్తకం అట్టమీద కనిపించిన బొమ్మకే ఆమెకు కడుపులో దేవినట్టయ్యి వళ్లంతా ఒక్కసారిగా తేళ్ళూ జెర్రులూ పాకినట్టుగా అనిపించింది.

ఏదో మండ్రగబ్బను పట్టుకున్నట్టుగా ఆ పుస్తకాన్ని తీసి గదిలో ఓ మూలకు విసిరికొట్టింది. అసహ్యంతో క్రోధంతో అవమానంతో ఆమె శరీరం కంపించిపోయింది.

తన పెట్టెలో ఆ పుస్తకం ఎవరు తెచ్చి పెట్టివుంటారో ఆమెకు బాగా తెలుసు.

ముద్దు.

శరణాలయాన్ని నడిపే చిదానందం గారి కొడుకు కాబట్టి అచ్చోసిన ఆంబోతులా శరణాలయంలోకి దూరి ఇష్టం వచ్చినట్టు ప్రవర్తిస్తుంటాడు. అక్కడుంటున్న అమ్మాయిల్ని అల్లరిపెట్టడం, గోల చెయ్యడం, వెకిలి చేష్టల్తో అసహ్యంగా ప్రవర్తించడం అతని హాబీ. ఎప్పుడు పడితే అప్పుడు అడ్డూ అపూ లేకుండా శరణాలయంలోకి వచ్చేస్తాడు. ఆ తర్వాత అతని వెకిలి చేష్టల్ని అవగలగడం ఎవరి తరమూ కాదు.

శరణాలయంలోకి అమ్మాయిలందరూ అతని మీద పూర్ణామా డమ్‌తో చాలాసార్లు కంప్లైంట్ చేశారు. రోజు రోజుకీ అతని ఆగడాలు మితిమీరిపోతున్నాయని కన్నీళ్ళతో మొరపెట్టుకున్నారు.

పాపం పూర్ణామా డం ఏం చేయగలదు? ఆమె నిస్సహాయురాలు. ముద్దు సాగిస్తున్న అసహ్యకరమైన పనుల్ని చిదానందం దృష్టికి చాలాసార్లు తెచ్చింది.

“వెధవ, అలా చేశాడా! నేను మందలిస్తాలే”, అంటాడు చిదానందం. అంటాడేగానీ ఎలాంటి చర్య తీసుకోడు. ముద్దుమీద పోలీసు కంప్లైంట్ ఇవ్వడానికి తను స్వాక్షాత్తూ చిదానందంగారబ్బాయైపోయాడాయె!

పూర్ణామా డం అంతకంటే మరేం చేయలేక సాధ్యమైనంతవరకూ అతన్ని పట్టించుకోవద్దని అమ్మాయిలకు సలహా ఇచ్చింది. అప్పట్నుంచీ అతని ఆగడాలను అలాగే భరిస్తూ వస్తున్నారు వాళ్లు. భరించకపోతే ఆ వికలాంగులు ఎక్కడికి వెళ్లగలరు?

ఆ పోర్నోగ్రఫీ పుస్తకాన్ని తన పెట్టెలో చూసినందువల్ల కలిగిన క్రోధాన్ని అదుపులో పెట్టుకుంటూ కొద్దిక్షణాలు అలాగే నిలబడిపోయింది. ఆ ప్రయత్నంలో అకస్మాత్తుగా కన్నీళ్లు పొంగివచ్చాయామెకు.

“ఏం? ఆ పుస్తకం అంతబాగోలేదా విసిరికొట్టేశావ్?” అన్నమాటలు వినిపిస్తూనే అదిరిపడి ఆ వైపు చూసింది.

ఎదురుగా ముద్దుని చూస్తూనే ఆమె పైప్రాణాలు పైనే ఎగిరిపోయాయి.

అంతవరకూ ఆ గదిలోనే వున్నాడతను. వసంత లోనికొస్తుండగా చప్పున తలుపు చాటున దాక్కున్నాడు. గదిలో కొచ్చిన వసంత అతన్ని గమనించనేలేదు. ఇప్పుడు హఠాత్తుగా తలుపు చాటునుంచి బయటికొచ్చాడు.

“నువ్వా!” అతన్ని చూసి మొహం పాలిపోతుండగా కంగారుగా అంది. హఠాత్తుగా తనగదిలో అతనలా ప్రత్యక్షమై పోవడంతో ఆమెకు వెన్నులోంచి చలిపుట్టుకొచ్చినట్టై ఆపాదమస్తకం గజగజా వణికిపోయింది.

“భయపడకు! ఇక్కడెవరూ లేరు”, ముందుకొస్తూ అన్నాడతను.

“ఆగు, ముందుకు రావద్దు”, కర్రల

# నేత్రధనుస్సు

సాయంతో అప్రయత్నంగా వెనక్కి జరుగుతూ అందామె.

భయం వల్ల ఆమె వళ్లంతా చెమటలో తడిసి ముద్దై పోతోంది.

ముద్దు వెకిలిగా నవ్వాడు.

"ఆ పుస్తకం నిండా భలే బొమ్మలుంటాయి. చూస్తే మజాగా వుంటుంది. నీకు తెలీదుగా. అందుకే పాపం విసిరిపారేశావు", అంటూ మరో అడుగు ముందుకేశాడు.

"వద్దు... రావద్దు..." హీనస్వరంతో అంది వసంత.

"కుంటిదానివైనా నీ ఫేసు నాకు నచ్చింది. నీ షేపు నాకు నచ్చింది. రా, మజా చేసుకుందాం. ఎవరూ రార్లే-అందరూ బయట ప్రోగ్రాం సెటప్ చేయడంలో వున్నారు. మనం లోపల ప్రోగ్రాం సెటప్ చేసుకుందాం" అన్నాడు ముద్దు.

"రావద్దు.. ! దగ్గరకొచ్చావా అరుస్తాను."

ముద్దు పకపకా నవ్వాడు.

"నువ్వరిచినా ఎవరూ రారు. వూరికే ఎందుకు బెట్టుచేస్తావ్? రా," అంటూ ఆమెను పట్టుకోబోయాడు.

వసంత ఓ చేతికర్ర పైకెత్తి అతన్ని కొట్టబోయింది.

అయితే అలా చేయడంలో బ్యాలెన్స్ తప్పి కుప్పలా నేలకూలిపోయింది.

"కుంటిదానివి, నీకెంత బెట్టే!" అంటూ ముద్దు డేగలా ఆమె మీదికొచ్చేశాడు.

వసంత కెవ్వున కేకేసింది. కానీ ఆమె కేక బయటున్న వారెవరికీ వినిపించలేదు. కాళ్ళలో ముందె శక్తిలేదు. చేతుల్తోనే బలహీనంగా అతన్ని అవతలికి తోసేయడానికి విఫలయత్నం చేస్తోందామె.

ఆమె ఎదురు తిరిగేకొద్దీ ముద్దు రెచ్చిపోయాడు.

మొహం ముందుకు వంచి ఆమెను గట్టిగా ముద్దు పెట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. వసంత చేతిగోళ్లు అతని చెంపల్లో దిగబడుతున్నాయి.

అయిపోయింది. తనచేతుల్లో శక్తిపూర్తిగా హరించుకుపోతోంది. ముద్దు ఇక తనను నాశనం చేసి తీరతాడు. వసంత హిస్టీరిక్‌గా ఏడుస్తోంది.

రెండు నిమిషాలు ఆలస్యం జరిగి వుంటే ముద్దు అంతపనీ చేసివుండేవాడేమో.

అయితే అంతలోనే బయటినుంచి పూర్ణామా డం గొంతు వినిపించింది-

"వసంతా!"

ఆ గొంతు వింటూనే ముద్దు చటుక్కున దూరంగా జరిగిపోయాడు.

"ఛ! ఈ ముసల్ది ఇప్పుడే తగలడాలా!" అంటూ అతను వసంతకేసి బెదిరిస్తున్నవాడిలా చూశాడు. "చూడు, ఇక్కడ జరిగిన సంగతి ఆ ముసల్దానితో చెప్పావో నిన్నేం చేస్తానో చూడు," అంటూ పరిగెత్తుకెళ్లి తలుపుఛాటున నిలబడ్డాడు.

సరిగ్గా అదే సమయంలో పూర్ణామా డమ్ ఆ గదిలో అడుగుపెట్టింది. ఆమె గదిలోకి ప్రవేశిస్తూనే ముద్దు ఆమె తనని గమనించకుండా చల్లగా ఆ గదిలోంచి బైటికి జారుకున్నాడు. పూర్ణామా డం అతన్ని గమనించనేలేదు.

గది మధ్యన పడున్న వసంతకేసి అవాక్కుగా చూస్తుండిపోయిందల్లా కంగారుగా ముందుకు పరిగెత్తింది.

"వసంతా ఏమైంది తల్లీ?"

"ఏ... ఏం లేదు మేడం. కర్ర జారింది" కన్నీళ్లుదాచుకోవడానికి విఫలయత్నం చేస్తూ నెమ్మదిగా లేచికూర్చుంది వసంత.

పూర్ణామా డం ఆమెను ఆందోళనగా చూసింది.

"దెబ్బ తగల్లేదుగా తల్లీ."

"లేదు మేడం."

"నా తల్లీ, రామ్మా!" అంటూ పూర్ణామా డమ్ ఆమెను మంచం దగ్గరికి తీసుకెళ్లి పడుకోబెట్టింది.


"నయనతార ఎక్కడికెళ్లింది తల్లీ?" అడిగింది పూర్ణామా డం.

ఎక్కడికెళ్లిందో తనకు తెలీదన్నట్టు తల అడ్డంగా వూపింది వసంత.

"సరే, నయనతార వచ్చేంతవరకూ నువ్వు విశ్రాంతి తీసుకో" అంటుండగానే బయటినుంచి, "మా డం, ఏర్పాట్లు పూర్తయ్యాయి," అనే పిలుపు వినిపించింది.

"ఆ వస్తున్నా!" అంటూ వసంతకేసి చూసింది పూర్ణామా డం "నువ్వు పడుకో తల్లీ, నేనిప్పుడే వస్తాను," అంటూ బయటికెళ్లిపోయింది.

అయితే బయట హడావుడిగా వూపిరి



# నేత్రధనుస్సు

సలవని పనిలో పడిపోవడంతో ఆవిడ వసంత సంగతే మర్చిపోయింది.

పూర్ణిమా డం బయటికెళ్ళగానే వసంత అంతవరకూ బలవంతంగా వుగ్గబెట్టుకున్న ఏడుపు ఒక్కసారిగా పొంగివచ్చింది. దిండులో మొహం దాచుకుని ఏడుస్తూ నయనతార వచ్చేంత వరకూ ఆమె అలాగే పడుకుండిపోయింది.

వసంత చెప్పిందంతా వింటూనే నయనతారకు రక్తం కుతకుతా వుడికిపోనారంభించింది.

"రాస్కెల్! వాడి సంగతి నేను చూస్తాను," అంటూ విసురుగా బయటికి వెళ్లబోయింది.

వసంత చప్పున ఆమె చెయ్యి పట్టుకుంది.

"ఎక్కడికి?"

"పూర్ణిమా డంతో ఆ రాస్కెల్ సంగతంతా చెప్పేస్తాను."

వసంత కంగారుగా చూసింది.

"వద్దు నయనా! నేనల్లరైపోతాను," భయంగా అంది.

"నీకు తెలీదు వసంతా! నీలాంటి వాళ్లంతా వూరుకోబట్టే మగజాతి ఆడవాళ్లమీద ఇన్ని అత్యాచారాలు సాగించగలుగుతోంది. ఈ విషయం పూర్ణిమా డంతో చెప్పి తీరాలి," అంటోంది నయనతార.

సరిగ్గా అప్పుడే మరో ఇద్దరాడపిల్లలు ఆ గదిలో అడుగుపెట్టారు. వాళ్లిద్దరూ వసంతలా వికలాంగులే.

"ఏం చేస్తున్నావు నయనా?" అంటూ ఎదురుగా వసంత ఏడుస్తుండడం చూసి గుమ్మంలోనే ఆగిపోయారు.

"ఏమిటి? ఏం జరిగింది?" కంగారుగా అడిగిందో అమ్మాయి.

నయనతార గబగబా ఏం జరిగిందో వాళ్లకు చెప్పింది.

వాళ్లిద్దరి మొహాలు కూడా క్రోధంతో ఎర్రబడ్డాయి.

"ఈ రోజు వసంతమీద అత్యాచారం చేయబోయాడు. రేపు మనలో ఎవరిమీదైనా వాడు అత్యాచారం తలపెట్టొచ్చు. వాడికి తగిన బుద్ధి చెప్పాల్సిందే," అందో అమ్మాయి.

"కానీ, ఎలా?" రెండో అమ్మాయి అడిగింది.

"పూర్ణిమా డంతో వాడి సంగతి చెప్పేద్దాం," అంది నయనతార.

" కానీ, అందువల్ల ప్రయోజనమేమిటి? పూర్ణిమా డం మాత్రం ఏం చేయగలదు. వాడు చిదానందం కొడుకు."

నయనతార ఆలోచనలో పడింది.

"అవును. మీరు చెప్పింది నిజమే. వాడికి మనమే బుద్ధి చెప్పాలి. జీవితంలో మర్చిపోలేని విధంగా గుణపాఠం నేర్పించాలి," అంది.

"ఎలా?"

"నాకో అయిడియా తట్టింది. చెప్తాను వినండి," అంటూ నయనతార వాళ్లకు గబగబా ఏదో చెప్పసాగింది.

ఆమె చెప్పిన ప్లాన్ విన్నాక ఆ అమ్మాయిలిద్దరి మొహాలూ వికసించాయి.

"కానీ.. కానీ... అలా చేయడం వల్ల గొడవలవుతాయి," భయంగా అంది వసంత.

"అలా అనుకుని వూరుకుంటే ముద్దు మనల్ని శరణాలయంలో ప్రశాంతంగా వుండనివ్వడు. వాడికి బుద్ధి రావాలంటే మనమీ ప్లాన్ ప్రకారమే చెయ్యాలి. నలుగుర్లో వాడికుండబద్దలుకొట్టాలి," పిడికిళ్లు బిగిస్తూ అంది నయనతార.

ఆమాట అంటుండగా ఆమె మొహం దివిటీలా ఎర్రగా ప్రకాశిస్తోంది.

ఆ రోజు ఆమె తీసుకున్న ఆ నిర్ణయం ఆమె భవిష్యత్తునే రూపురేఖల్లేకుండా మార్చేయబోతోంది.

(ఇంకా వుంది)


# వెండితెర-బుల్లితెర

## పూర్ సల్మా!

సల్మా అఘాకి గుర్తింపు తెచ్చిన చిత్రం "నిఖా". ఆ తర్వాత ఈ నటికి ప్రాముఖ్యం గల పాత్రలు దొరకలేదు. మిథున్‌తో నటించిన చిత్రాలే కాస్త గుర్తింపు తెచ్చినా, అవి కూడా వాంప్ పాత్రలు కావటం విచారకరం. సంగీత దర్శకులతో, నిర్మాతలతో, పంపిణీదారులతో సన్నిహిత సంబంధాలు అధికంగా ఉన్న సల్మా తన వృత్తి విషయంలో మాత్రం పాత్రలపరంగా ప్రేక్షకులకు దగ్గర కాలేకపోతున్నందుకు ఆమె అభిమానులు నిరాశ చెందుతున్నారని బొంబాయి పత్రికలు వ్రాస్తున్నాయి

## భోజనప్రియురాలు నీతా!

చైనీస్ ఫుడ్ అంటే నీతాపురికి చాలా ఇష్టమట! బాంద్రాలోని ఒక రెస్టారెంట్‌కు డ్రాగన్‌ఫుడ్ కోసం నీతా క్రమం తప్పకుండా వెళ్తుందని, ఇదంతా శరీర అవయవాల పెరుగుదల కోసమే అని సినీజనం అంటున్నారు. జీనత్ అమన్ లోటును పూరించే నిమిత్తం అవయవ సంపదను




అవధుల మేరకు చూపించాలని భావిస్తున్నది మనోరంజన్ చిత్రంలో జీనత్ ప్రదర్శించిన అందాలను పోటీ పడి మరీ ప్రదర్శిస్తుందట నీతా రాబోవు ఒక హిందీ చిత్రంలో ఈ సెక్స్ కామెడి చిత్రం పేరు "మస్తి".

## సినీరంగంపై సీరియల్

టి.వి. సీరియల్స్‌కు ఈ మధ్య కాలంలో విభిన్న కథావస్తువులు లభించటం వల్ల ప్రేక్షకులు చక్కని కార్యక్రమాల్ని చూడగల్గుతున్నారు. హిందీ చిత్ర దర్శకుడు అశోక్ త్యాగి స్వీయ దర్శకత్వంలో ఓ సీరియల్ తయారు కాబోతోంది మార్చి 91కి హిందీ సినిమాకు అరవై సంవత్సరాలు నిండుతున్న సందర్భంగా ఈ అరవై సంవత్సరాల కాలం నుండి హిందీ సినిమారంగంలోని విశేషాలను, ఆనాటి ప్రముఖుల గురించిన వివరణలతో ఈకార్యక్రమం ఉంటుంది

—పి. గణపతిరావు



...అంచేత మీరంతా ఈ ఏడాది చేపల చెరువుల్లో వచ్చిన లాభాల్ని నాగార్జున యూరియా కంపెనీలో షేర్లు కొనండి
ఓయ్
Nagarjuna Fertilizers and Chemicals Limited
NFCL
Nagarjuna Hills Hyderabad-500 482 Phone 37207/8/9
MAM/NFCL/8/91

# ఈ వారంలో మీ యోగం

4-1-1991 శుక్రవారం మొదలు 10-1-1991 గురువారం వరకు

**మేషం:** ఆదాయమందు లోపంలేదు పాడి పంటల రీత్యా అనుకూలం కుటుంబ పెద్దలు మిత్రులు యింటికి రానున్నారు నాట్య నాటక పోటీలందు కొందరు జోక్యం కలుగజేసికొంటారు సభా మర్యాద, కార్యసిద్ధి, వృత్తియందు ప్రసిద్ధి. స్త్రీలకు ఉద్యోగమందు అభివృద్ధికర మార్పులు

**వృషభం:** చాల దూరంగా వెళ్ళవలసిన అగత్యమున్నది మీ వృత్తియందు చెప్పదగిన అనుకూలమార్పు చెప్పవచ్చు వ్యవహారం లాభదాయకం కళా సాహితీ రంగాన సదవకాశాలు, ఆట పాటలందు ప్రవీణులకు సదవకాశాలు, గాయకులకు, రచయితలకు అనుకూలత. స్త్రీలకు. బంధువుల రాక, ఆట పాటల ప్రావీణ్యత, వృత్తిలో నూతన మార్పు

**మిధునం:** వ్యవహారరీత్యా అనుకూలత గలదని చెప్పనక్కరలేదు. గురు, కేతు, రవి, బుధులు అనుకూలురు గాన, వృత్తి వ్యాపారం, వ్యవహారం, పదిమందిలో ప్రసిద్ధి, నూతన మిత్ర కలయిక యిత్యాదులకు ఆస్కారం. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవలసిన అగత్యమున్నది ప్రభుత్వపరంగా రావలసిన సొమ్ము అందుతుంది స్త్రీలకు కార్యసిద్ధి, వృత్తిలో ప్రసిద్ధి, యాత్రానుకూలత, క్షీరంగానుకూలత

**కర్కాటకం:** ఈ వారమంతా ధన, వృత్తి, విద్య, పిలాసాలకు యోగం మరి ఆరోగ్యమో జాగరూకతతో, మంత్ర తంత్రాదులతో, యంత్రాదులతో సరి పెట్టుకోవాలి గురు, కేతు, గ్రహాలకు గ్రహ శాంతి అవసరం సభా మర్యాద యున్నది స్త్రీలకు వృత్తి పెంపు, ఉద్యోగమందు వృద్ధి, ధనలబ్ధి, కొందరకు అప్రయత్నాదాయం

**సింహం:** ఆకాశ గమన గ్రహ మార్పులు ముఖ్యంగా శని, రవి, బుధ గ్రహాలవి మీకు అనుకూలం కార్యాచరణకు అనుకూలం ప్రభుత్వ పరంగా ఏదో మార్పు రాగలదు శుభదాయకం, కృషి లోపం లేకుంటే సర్వదా వారమంతా ఆదాయం, వృత్తిలో మేలు స్త్రీలకు ప్రమోషన్ కొందరకు, వ్యాపారాను కూల్యత కొందరకు

**కన్య:** త్యాగశీలురన్న పేరు తెచ్చు కొంటారు నలుగురలో పేరు, ప్రతిష్ఠలు ఆదాయవృద్ధి పత్రికా రంగాభివృద్ధి, రాజకీయముల జోలికి మాత్రం వెళ్ళ కుండుట శ్రేయస్కరం ఆదాయవృద్ధి, అధిక వ్యయం స్త్రీలకు. పుట్టింటి గౌరవాదులు, ఉద్యోగవృద్ధి, మిత్రాను కూలత

**తుల:** ఆదాయమున్నది అయితేనేం? ఖర్చులు అధికం ఆరోగ్యరీత్యా జాగ్రత్త అవసరం 'అర్ధాష్టమ' శనిబాధ వేధ వెన్నాడుతుంది జపహోమాదులు అవసరం. కార్యసిద్ధికి లోపం, స్త్రీలకు: శతృవుల మూలమున, కీటకములవలన యిబ్బంది

**వృశ్చికం:** రాజకీయంగా మేలులేదు పదిమందిలో గౌరవం, వ్యాపారమందు అనుకూలం, శిష్టజనులవలన లాభం, సభా మర్యాద, ఒక్క 'టెమిటి' వారాంతం వరకు, ఏ వ్యవహారమంతైనా మీదే పయిచేయి. సజ్జన సాంగత్యం, కార్యసిద్ధి, ఆరోగ్యవృద్ధి స్త్రీలకు ఉద్యోగమందు పెంపు, 'ప్రమోషన్' రావచ్చు

**ధనుస్సు** రాజకీయంగా అనుకూలం దూర ప్రాంతాలనుండి, ఒకవేళ విదేశాల నుండి బంధువులుగాని మిత్రులుగాని రానున్నారు విద్యావేత్తల సహాయమున్నది కృషిలోపం రానీయకండి సర్వానుకూల సమయం రచయితలకు, విక్రేతలకు, పత్రికా రంగాన శ్రమించు వారికిస్త్రీలకు సర్వోపయోగ సమయం.

**మకరం:** ఉపకారులున్నారు మేలు చేయాలనుకొంటారు కాని ప్రయోజనం? రాశియందున్న శని, రాహు గ్రహాలు ఏవిధంగా మేలు చేకూరనీయరు అభివృద్ధికరమైన మార్పులు వృత్తిలో సంభవించుటకు కొంతకాలం పడు తుంది స్త్రీలకు ఆదాయ వృద్ధి, అధికవ్యయం

**కుంభం:** సభా మర్యాద యున్నది గ్రంథ రచయితలకు, నాటకములందు, సినిమాలందు ప్రావీణ్యత గలవారికి అనుకూలం పాత్రికేయులకు, పంపిణీ దారులకు అనుకూలం సజ్జనమైత్రి, ఆదాయవృద్ధి, స్త్రీలకు వారమంతా మేలని కృషిలోపం లేకుంటే సర్వ విధాలా మేలున్నది

**మీనం:** సజ్జనమైత్రి, సత్కార్యాచరణం, అతిధి అభ్యాగతులను ఆదరించుట, ఆశించిన విధంగా ధనలబ్ధి, కార్యసిద్ధి, గురు గ్రహానుకూలత, ఒక్క టేమిటి? సర్వ విధాలా మేలున్నది స్త్రీలకు వారపూర్వార్ధం లాభదాయకం.

- విద్వాన్ కోటసత్యారంగయ్యశాస్త్రి

## దేవుడు

దేవుడు- వున్నాడూ<br>
అనుకునే వాడికి<br>
ముందునే- వున్నాడు!

దేవుడు- లేడూ<br>
అనుకునే వాడికి<br>
వెనుకనే- వున్నాడు!

వున్నాడో - లేడో<br>
అనుకునే వాడికి<br>
పైననే- వున్నాడు!

దేవుడు-ఎప్పుడూ<br>
శ్రమించే వాడికి<br>
ప్రక్కనే- వున్నాడు!

కష్టాలలో - వున్నవాడికి<br>
అధః పాతాళానికి<br>
అడుగునే వున్నాడు!

- పట్నం పరశురామ్

# యువతా! కవితా!!

## మననైజం

దైవాన్ని కొలుస్తాము
దానాలెన్నో ఇస్తాము
ధర్మాలను వింటాము
    దగాలు మాత్రం చేస్తాము!

వేదాలను చదువుతాము
వాదాలను చేస్తాము
భేదాలు లేవంటూనే
    పరుల బాధిస్తుంటాము!

శాంతిని స్మరిస్తాము
కాంతిని కోరుతాము
క్రాంతి కై కలవరిస్తూ
    భ్రాంతిలో నే బ్రతుకుతాము!

నీతిగ వుండాలంటాము
నిజాయితీగ నడవాలంటాము
నిజానికి వీలైతే వాటినే
    నిలువునా పాతిపెడతాము!

గీతాలను రాస్తాము
గేయాలను చదువుతాము
గాయపడిన గుండెలను
    గమనించక నుంటాము!

-ఇ. రామ్‌కిషన్‌రావు

## శూన్యం!

అక్షరం కల్పన!
పదం కల్పన!

కవిత కల్పన!
కావ్యం కల్పన!

పల్లవి కల్పన!
పాట కల్పన!

లయ కల్పన!
రాగం కల్పన!

మనిషి కల్పన!
మనుగడ కల్పన!

మనసు కల్పన!
మమత కల్పన!

బంధం కల్పన!
అనుబంధం కల్పన!

ధరిత్రి కల్పన!
చరిత్ర కల్పన!

లేమి కల్పన!
భోగం కల్పన!

దైవం కల్పన!
ధ్యానం కల్పన!

నీవు కల్పన!
నేను కల్పన!

సృష్టి కల్పన!
సృష్టికర్త కల్పన!

-యరమాస శ్రీనివాసరావు

# సర్వనీతి

### పారుపూడి విశ్వేశ్వరరావు

ఆ ఆఫీసులో అందరికీ గోపాలరావు గారిని చూస్తే హడల్ ఆయన ఏ టైముకి ఆఫీసుకి వస్తారో ఎవరికీ తెలియదు గానీ, స్టాఫ్ మాత్రం పది గంటలు కొట్టేసరికి రంచనుగా హాజరవుతారు

అటెండరు వీరాస్వామి దగ్గర నుంచీ, హెడ్ క్లర్కు స్వామినాథం వరకూ ఆయనంటే వణికిపోతూ ఉంటారు ఆ రోజు ఆఫీసు వాతావరణం మరీ కామ్‌గా ఉంది కారణం జ్వరమని లీవు పెట్టిన టైపిస్టు రాఘవ ఆఫీసరు గారికి సినిమా హాల్లో కనబడ్డాడు రాఘవ భయంతో వణికి పోతున్నాడు నిజానికి ఆ టైములో ఆయన మాత్రం అక్కడెందు కున్నాడు? కానీ ఆయన్ని అడిగే ధైర్య మెవరికుంది? స్టాఫంతా రాఘవ వంక జాలిగా చూస్తున్నారు అయిదు నిమిషాల్లో లోపల్నుంచి పిలుపు వచ్చింది సరిగ్గా పది నిమిషాల తరువాత ఏడుపు మొహం వేసుకుని బయటి కొచ్చాడు రాఘవ తిన్నగా తన సీటు దగ్గరికి వెళ్ళి ఏదో లెటరు టైపు చేసి లోపలికి వెళ్ళి మళ్ళీ వచ్చి హెడ్‌క్లర్కు చేతికిచ్చాడు ఆ కాగితం చూసిన స్వామినాదం నిశ్చేష్టు డయ్యాడు

ఎంత దారుణం! రాఘవకి మెమో ఇచ్చి అది అతని చేతే టైప్ చేయించాడన్న మాట!

కాసేపట్లో ఈ విషయం అందరికీ తెలిసిపోయింది అందరూ సానుభూతిగా మాట్లాడసాగారు ఇంతలో గోపాలరావు గారు బయటికి రావడంతో అందరూ సైలెంటయి పోయారు ఆయన అందరివైపూ ఓ సారి హెచ్చరికగా చూసి బయటికెళ్ళి పోయారు ఆయన స్కూటరు శబ్దం దూరమవ్వగానే అందరికీ ధైర్యం వచ్చేసింది

'అయినా లీవున్నది ఎందుకంట? మనకి ఇష్టమైనప్పుడు, కావాల్సినప్పుడు వాడుకోవడానికే కదా?'' కోపంగా అన్నాడు ఎక్కౌంటెంట్ మూర్తి

'రోజు రోజుకీ ఈయన బి పి ఎక్కువై పోతోంది మరి ఆయనగారు సినిమాకెళ్ళొచ్చు తప్పులేదా? గుమాస్తా కొక న్యాయం ఆఫీసరయితే ఒక న్యాయమా?'' ఆవేశంగా అరిచాడు స్వామినాథం

'మిమ్మల్నేనండీ! గోపాలరావు గారు ఎక్కడుంటారు?'

ఎవరో అపరిచిత స్వరం పిలుపు విని ఉలిక్కిపడి వెనక్కి తిరిగి చూశాడు స్వామినాథం- కొంపదీసి ఈయనెవరో తను అన్న మాటలన్నీ వినలేదు కదా! అసలే బాస్ కోసం అంటున్నాడు ఒకవేళ ఫ్రెండేమో?

ఆ ఊహకే అతను బిక్కచచ్చి పోయాడు చుట్టూ చూశాడు అప్పటికే ఎవరికి వారు ఏమీ ఎరగనట్లు సర్దుకున్నారు

ఇక తప్పనిసరి పరిస్థితుల్లో ముఖాన చిరునవ్వు పులుముకుంటూ అన్నాడు.

'రండి సార్! కూర్చోండి! మీరు సందేహంగా అడిగాడు.

నమస్తే! నా పేరు అనంతరామయ్య నేను హైదరాబాదు నుండి వస్తున్నాను గోపాలరావు నా ఫ్రెండ్ ''

స్వామినాథం గుండెల్లో బండరాయి పడింది. తను అనుకున్నది నిజమైందన్నమాట కొంపదీసి ఈయన తను అన్న మాటలన్నీ బాస్‌కి చెప్పేస్తే! రేపు తనకిచ్చే చార్జిషీట్ తనే టైపు చేసుకోవాలి ఇక చేసేదేమీ లేక దేవుడిమీద భారం వేసి ఆయనతో మాట్లాడ సాగాడు


ఇంతలో గోపాలరావు గారు వచ్చారు రాగానే ఎదురుగా అనంతరామయ్యని చూడగానే ఆశ్చర్య పోయారు

'హల్లో! అనంతం! ఎప్పుడు రావడం' అంతా బావున్నారా?

'ఇప్పుడే సార్! మీ ఫ్రెండని చెప్తే కూర్చోపెట్టాను ఇంతలో మీరొచ్చారు.'

''సర్లే! ఇంటికి వెళ్దాం పదరా! ఇదిగో స్వామినాథం! నేను వెళ్తున్నాను అర్జంటు మేటర్స్ ఏమైనా ఉంటే ఫోన్ చెయ్!' అని అందరివైపూ ఓసారి చూసి బయటికి వెళ్ళిపోయాడు

ఆ చూపుకి అర్థం అందరికీ తెలుసు



నేను వెళ్ళిపోతున్నాను కదాని మీ ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తే ఖబడ్దార్! అన్న హెచ్చరిక అది.

★ ★ ★ ★ ★ ★

సాయంత్రం ఫ్రెండ్‌కి హోటల్లో ఘనంగా పార్టీ ఇచ్చాడు గోపాలరావు. మాటల మధ్యలో అనంతరామయ్య అన్నాడు.

ఒరేయ్! నువ్వేమీ అనుకోనంటే నీతో ఓ విషయం చెప్తానురా!

అదేమిట్రా! మనలో మనకి ఈ పర్మిషన్లేమిటీ! చెప్పు!'

'అది కాదురా! నువ్వు మీ ఆఫీసులో మరీ అంత చండశాసనుడిలా' ప్రవర్తించడం ఏమీ బాలేదురా?'' అతని మాట పూర్తవకుండానే మధ్యలో నే అడ్డు పడ్డాడు గోపాలరావు.

'ఏమిట్రా నే లేనప్పుడు ఎవడైనా నీతో ఏమైనా చెప్పాడా''

చెప్పు ఎవరు? తీవ్రంగా అడిగాడు.

'అదిగో అదే వద్దు! నాతో ఎవరూ ఏమీ చెప్పలేదు నేనే గమనించి చెబుతున్నాను. పాపం నీకంటే పదిహేనేళ్ళు పెద్దవాడైన ఆ స్వామినాథం గారిని అలా అమర్యాదగా 'నువ్వు!నువ్వు!' అని సంబోధిస్తే ఆయన హర్టు అవడురా! ఆయనే కాదు. నీ దురుసు ప్రవర్తనకి ఎవరైనా బాధపడతారు. ఆయన స్థానంలో నువ్వున్నా అంతేరా!

'అది కాదురా! ఆయన గుమాస్తా! నేను పై అధికారిని! చనువిస్తే ఇంకేమయినా ఉందా? టాపు లేపేస్తారు! ఇంకా ఏదో అనబోయాడు.



'నువ్వు చెప్పేది కరెక్టే! కాదనను కానీ ఒక్కసారి అయిదేళ్ళ క్రితం నీ పరిస్థితి ఆలోచించుకో అప్పుడు నువ్వు మాత్రం గుమాస్తావి కాదా! ఆఫీసరవ్వగానే నీ పాత జీవితం మర్చిపోయావా?మనుషులకి వారి వ్యక్తిత్వం బట్టి విలువ నివ్వాలిరా!హోదా బట్టి కాదు నేను చెప్పేది అర్థం చేసుకోవడానికి ప్రయత్నించు

గోపాలరావు ఆలోచనలో పడ్డాడు. నిజమే ఆఫీసరవగానే తను మరీ దురుసుగా ప్రవర్తిస్తున్నాడు గుమాస్తాగా చాలా కాలం బాసిజమ్‌తో అణగద్రొక్క బడిన బాధంతా ఈ రకమైన మనస్తత్వం ఏర్పడ డానికి కారణ మయ్యిందేమో! కాలేజీల్లో జరిగే ర్యాగింగ్‌కీ దీనికీ తేడా ఏముంది ఇంక? వాళ్ళు చేశారని వీళ్ళు, వీళ్ళని చూసి తరవాత వాళ్ళు, ఇంక దీనికి అంత మెప్పుడు? ఎదురుగా ఏమీ మాట్లాడలేని నిస్సహాయంతో వెనకాల ఎంత తిట్టుకుంటున్నారో?

అతనిలో పశ్చాత్తాపం కలిగింది కాసేపటికి నెమ్మదిగా అన్నాడు

–నిజమేరా! అధికారం ఉంది కదానీ ఇన్నాళ్ళూ ఎంత దురహంకారంగా ప్రవర్తించానో తలుచుకుంటే సిగ్గేస్తోంది ఈ రోజు నువ్వు రావడం చాలా మంచిదయింది ఇకపై నా ప్రవర్తన మార్చుకుంటానురా' మనస్ఫూర్తిగా అన్నాడు గోపాలరావు.

★ ★ ★ ★ ★ ★

భయం భయంగా బాస్ గదిలోకి



## ప్రపంచ సుందరి

**ఈ** ఏడాది ప్రపంచ సుందరిగా అమెరికాకు చెందిన జినామేరీ టాలెసన్ ఎన్నికయింది. లండన్‌లో యిటీవల జరిగిన మిస్ వరల్డ్ పోటీలో అమెరికా దక్షిణ కరోలినా రాష్ట్రంలోని స్పార్టన్‌బర్గ్‌కు చెందిన 21 సంవత్సరాల టాలెసన్‌ను 40వ ప్రపంచ సుందరిగా న్యాయ నిర్ణేతలు ఎంపిక చేశారు. గుర్రపుస్వారీ, తోటపని అంటే ఆసక్తి కనబరిచే టాలెసన్ జార్జియా యూనివర్శిటీలో బ్రాడ్‌కాస్టింగ్ కోర్సు చదువుతోంది.

అడుగు పెట్టాడు స్వామినాథం. అనంత రామయ్య గారు అంతా చెప్పేసి ఉంటారేమో నన్న భయంతో అతని గుండెలు పీచుపీచు మంటున్నాయి.

"కూర్చోండి స్వామినాథం గారూ."

అదిరిపడ్డాడు స్వామినాథం!

తననేనా! పేరు పెట్టి మరీ పిలిచాడంటే తననే అయి ఉంటుంది. కానీ ఇదేమిటి? ఈయన ఆఫీసరుగా వచ్చినప్పటి నుంచీ ఆయన ముఖంలో చిరునవ్వు చూసిన వారెవ్వరూ లేరు. కూర్చుని మాట్లాడిన వాళ్ళు అసలే లేరు. అలాంటిది ఈ రోజు.....

'మిమ్మల్నే నండీ! కూర్చోండి! ఏమిటి విషయం?'

అదీ! మరీ! సార్! ఫైలు! సంతకం... తడబడి పోయాడు.

'అలాగేనండి! అక్కడ పెట్టేసి వెళ్ళండి.' అనడంతో బయటికి వచ్చే-శాడు.

అరగంట తరువాత లోపలికి వెళ్ళిన రాఘవ ఆశ్చర్యంతో మూర్ఛ పోయాడు, ముందు రోజిచ్చిన మెమో విత్‌డ్రా చేసుకుంటున్నానన్న బాస్ మాట వినగానే.

# సర్పనీతి

రెండు రోజులు గడిచే సరికి ఆఫీసు వాతావరణం పూర్తిగా మారిపోయింది. అకౌంటెంటు మూర్తి రెండేళ్ళ క్రితం పెట్టుకున్న హోమ్ లోన్ శాంక్షన్ అయిపోయింది. వీరాస్వామికి బయట అప్పచెప్పిన ప్రతీ పనికీ అదనపు బేటాలు మంజూరయ్యాయి! స్వామినాథం కూతురి పెళ్ళికి లోను గ్రాంటయ్యింది. స్టెనో సరోజకి మూడో నెలకే మెటర్నిటీ లీవు గ్రాంటయి పోయింది.

మారిపోయిన బాస్ ప్రవర్తనకి ఆఫీసులో అందరికీ మతులు పోయాయి. క్రమంగా ఆ ఆశ్చర్యం అలవాటులోకీ, అలవాటు విచ్చలవిడి తనానికీ దారి తీశాయి. రాఘవ ఇప్పుడు శెలవ పెట్ట కుండానే సినిమాలకి వెళ్ళిపోతున్నాడు. వీరాస్వామి అయిపే లేడు. గోపాలరావు మంచితనం ఆ విధంగా ఏటి పాలయ్యింది.

ఒకరోజు ఏవో అర్జంటు కాగితాలు పై ఆఫీసుకి పంపవలసి వచ్చింది. కాలింగ్ బెల్ నొక్కాడు. వీరాస్వామి జాడలేదు. సెక్షనులోకి వచ్చి అక్కడి దృశ్యం చూడగానే అతనికి మతిపోయింది. దూరంగా ఒకే టేబిల్ దగ్గర నలుగురుచేరి క్రికెట్ కామెంటరీ వింటున్నారు. వీరా స్వామి గోడకి జార్లబడి సిగరెట్ కాల్చు కుంటున్నాడు. ఏం చేయాలో అర్థంకాక వెనక్కి తిరిగి తన ఛాంబర్‌లోకి వెళ్ళి పోయాడు. ఇప్పుడు దీనిని ఎలా పరిష్కరించాలో అర్థం కావడం లేదత నికి. అయిదు నిముషాల తరువాత గుమ్మంలో ఏదో అలికిడి అయితే తలెత్తి చూశాడు.

"ఎదురుగా అనంతరామయ్య!" ఆయన్ని చూడగానే గోపాలరావులో ఆవేశం పెరిగింది.

"ఒరేయ్! ఎప్పటికైనా సబార్డినేట్సుని అణిచి ఉంచాలంటే అది తప్పని వాదించావు కదరా! పైగా వాళ్ళతో మంచిగా, స్నేహంగా ఉండాలని బోధించావు. ఇప్పుడు చూడరా! మా అటెండరు గాడికి నేనే కాఫీ తెచ్చి పెట్టాల్సిన పరిస్థితి వచ్చింది. ఇదంతా నీ మాటలు వినడం వలనేరా!"

అంతా శాంతంగా విని చిరునవ్వు నవ్వాడు అనంతరామయ్య.

"ఒరేయ్! నీలో ఈ అతిగా రియాక్టవడం అనే లక్షణం ఉంది చూశావూ, అదిరా అన్నిటికీ కారణం! క్రింది ఉద్యోగుల్ని అణిచిపెట్టినా అతిగానే చేశావు, చనువిచ్చినా అతిగానే ఇచ్చావు. వాళ్ళతో మంచిగా, గౌరవంగా ఉండమన్నాను కానీ ఇలా చనువిచ్చి నెత్తి కెక్కించుకోమని చెప్పలేదే! వాళ్ళు చక్కగా పని చేస్తున్నప్పుడు ఆదరించాలి. అదుపు తప్పితే నీ అధికారాన్ని ఉపయోగించి చక్కదిద్దాలి. ఇకనైనా గుర్తుపెట్టుకో!

గోపాలరావు ఆవేశమంతా చల్లారి పోయింది. నెమ్మదిగా ఆలోచించడం మొదలు పెట్టాడు. క్రమంగా సిసలైన అధికారి ఎలా ప్రవర్తించాలో అర్థమయింది అతనికి. ఇప్పుడతను సక్రమంగా పనిచేసేవాళ్ళను గౌరవిస్తాడు. దారితప్పితే దండిస్తాడు. అనవసరంగా ఎవరిజోలికీ వెళ్ళడు. కానీ అవసరమైతే బుసకొట్టడం మాత్రం మానడు. ○

# హలో! డాక్టర్ నేనేం చేయాలి?



డా. కొత్త రవీంద్రబాబు

**కొత్త మాసు రాము, గుంటూరు.**

ప్ర బియ్యం తింటాను పొట్ట లావుగా వుంటుంది నీరసం, రొప్పు.

జ మీ బాధలకు రక్తహీనత కారణం కావచ్చు మెబెక్స్ బిళ్ళ భోజనం తర్వాత ఉదయం, సాయంత్రం మూడు రోజులు వాడండి జింకోఫర్ గొట్టాం రాత్రి పడుకోబోయేముందు (భోజనం తర్వాత) రెండునెలలపాటువాడండి

**డి. జగన్నాధరావు, నర్సీపట్నం.**

ప్ర సైటు ఎక్కువగా వుంది నోటినుండి దుర్వాసన నలుగురిలో తిరుగలేకుండావున్నాను

జ కాంటాక్టు లెన్సులు వాడండి భోంచేసాక డెటోలిన్ మవుత్ వాష్‌తో పుక్కిలించివూస్తూవుండండి

**అభిమాని, నారాయణపూర్.**

ప్ర నాకు పిరికితనం ఎక్కువ ఎడ్రినల్ లోపమా?

జ పిరికితనం ప్రయత్న పూర్వకంగా పోగొట్టుకోవచ్చు ఎవరైనా వ్యక్తి అంటే భయం వున్నపుడు ఆ వ్యక్తితో పరిచయం క్రమేపి పెంచుకున్నందువలన భయం పోతుంది లేదా ఆ వ్యక్తికి పూర్తిగా దూరంగావున్నాభయంవుండదు ఏదో ఒక మార్గంఎంచుకోండి.

డెప్సోడైజ్ రాత్రి పడుకోబోయేముందు నెలపాటువాడిచూడండి

**ఆర్. గోపాలరావు, విజయవాడ.**

ప్ర అల్సరు వ్యాధి రానిటిడిన్ వాడినందువలన తగ్గింది ఇప్పుడు ఆహారం జీర్ణంకాక మలబద్ధకంగా వుంది. బ్రాందీ తాగమన్నారు

జ బ్రాందీ తాగవద్దు పాలు, ఏపిల్, అరటిపళ్ళు తినండి. బెస్టోజైం బిళ్ళలు ఉదయం, సాయంత్రం భోజనం తర్వాత వాడండి రెండు నెలలపాటు అల్సరుకు ఆపరేషన్ నిర్భయంగా చేయించుకోవచ్చు

**నారాయణరావు, నెల్లూరు.**

ప్ర వయస్సు 40 సంవత్సరములు గంటకొకసారి విరోచనాలవుతున్నవి

జ ఇమోడియం గొట్టాలు మూడు పూటలూ వేసుకోండి నెలపాటు, తడవకు రెండుచొప్పున

**ఎ. సత్యప్రసాద్, పాలకొల్లు.**

ప్ర ఆలోచనలెక్కువ ఎవరినైనా చూస్తే నవ్వువస్తున్నది

జ కొన్ని రోజులపాటు ఏకాంతంగా వుండి నవ్వును కంట్రోలు చేసుకోగలిగాక బయటకురండి

**పి. రాజశేఖరరెడ్డి, అనంతపురం.**

ప్ర · వయసు 17 సంవత్సరములు సన్నగా వుంటాను మొటిమలు, అమ్మవారు మచ్చలు

జ జింకోవిరాన్ గొట్టాం వొకటి స్టాంబా బిళ్ళ వొకటి రాత్రి భోజనం తర్వాత రెండు నెలలపాటు వాడండి పళ్ళు, గుడ్లు, పాలు ఎక్కువగాతీసుకోండి

**ఎస్. నాగరాజు, రేపల్లె.**

ప్ర : ఒక అమ్మాయితో కలిసాను. అప్పటి నుండి భార్యతో సంసారం చేయలేకుండా వున్నాను

జ : పై మెరుగులకు భ్రమ పడవద్దు క్షణికానందం కంటే దీర్ఘకాల మానసిక ప్రశాంతతకుఎక్కువవిలువయివ్వాలి

**ఎం. ప్రసాద్, పామిడి.**

ప్ర : పొట్టతగ్గాలి. మాపిన్నికిఉబ్బసం.

జ : పొట్ట తగ్గాలంటే వ్యాయామం చేయాలి ఉబ్బసంలో అనేక రకాలున్నాయి. డాక్టరుగారికి చూపించుకుని మందు తినమనండి బిళ్ళలు, యింజక్షన్ల కంటిఏరోసాల్‌స్ప్రే ఉత్తమం

**జి ప్రసాద్, ప్రొద్దుటూరు.**


ప్ర బి.ఎస్ సి చదూతున్నాను. నలుగురిలో కివస్తే వణుకుతడబాటు

జ విబోట్రిప్ రాత్రి పడుకోబోయే ముందు ఒకటి చొప్పున రెండు నెలలు వాడి నిర్భయంగా నలుగురిలో తిరుగుతుండండి

**కె. నాగరాజు, కదిరి.**

ప్ర · స్వరతివలన కల్గు అనర్థాలు తెలపండి

జ . మనసును ఉదాత్త విషయాలమీద కేంద్రీకరించండి తగినంత పని లేదా వ్యాయామం చెయ్యండి బూతు పుస్తకాలు చదవకండి ○



సీరియల్

# మోహినీ తాండవం

డా. కొత్త రవీంద్రబాబు

<u>ఇంతవరకూ సాగినకథ-18 :</u> ప్రణవనాథ్‌ను హత్య చేసిన మోహిని గురించి వివరాలు ఆరాతీయాలనుకున్న నందికేశ్వర చావుదెబ్బ తింటాడు. ప్లూటోగా పిలువబడే రవితేజను కలుసుకునేందుకు వెళ్ళిన రేఖ తండ్రికి సహాయ పడేందుకు రవి తన గురూజీ అయిన నానాసాహెబ్ అనుమతితో పయనమవుతాడు. రోజర్, భీంల సహాయంతో ఆపిరి విడిపించుకువచ్చిన మిల్క్ వైట్ కంపెనీ సైంటిస్టు హూవర్ హత్య కావింపబడతాడు. ద్రాక్షారామ ప్రసాద్‌ను రణధీర్ చంపుతాడు. జైన విహారంలో వున్న డేవిడ్‌ను రవి, భీంలు కలుసుకుంటారు. అనర్థాలకు కారణమైన మోహినిని మట్టు పెట్టాలన్న ఉద్దేశ్యంతో రవి, రేఖ, భీం ఉదయ్‌పూర్ వెళ్లారు.

(గత సంచిక తరువాయి)

దేవకీ ఎపార్ట్‌మెంట్స్ మూడో అంతస్తులోని ఫ్లాట్ తలుపు తట్టింది రేఖ

"ఎవరు? ఎవరంటే? ఎవరోయ్?" తలుపు వోరగా తీసి చూసిన నడివయసు వ్యక్తి రేఖను చూచి -

"ఎవరమ్మా? ఎవరు కావాలి?" అని అడిగాడు



రేఖ తన పర్స్‌లోంచి కార్డు తీసి యిచ్చింది.

లక్ష్మీరేఖ,

పత్రికా విలేఖరి,

సదరన్ టైమ్స్,

మద్రాస్.

కార్డు చదువుకుని "రామ్మా లోపలకురా!" అన్నాడు.

గది అంతా అస్తవ్యస్తంగా వుంది దినపత్రికలు, వార పత్రికలు, పుస్తకాలు, కాళీ కాఫీకప్పులు, విస్కీ సీసాలు, ఎండిపోయి బూజుపట్టిన బ్రెడ్, పొటాటో చిప్స్ పాకెట్, గోడలనిండా బూజు, నేలమీద దుమ్ము - మాసిన బట్టలు గుట్టలు గుట్టలుగా పడివున్నాయి

గదినిండా ప్రముఖంగా కాళీ స్టార్ నట్‌పౌడర్ ప్యాకెట్‌లు పడివున్నాయి

సోఫాలో కూర్చుని కాళ్ళు టీపాయ్ మీదుంచుతూ "ఏమ్మా యిలా వచ్చావు ఎనివే· వెల్‌కం టు ఉదయపూర్" అన్నాడు

"శరత్చంద్రసాబ్ - నేను జర్నలిస్టుగా జేరిన దగ్గర్నుండీ మిమ్మల్ని చూద్దామని అనుకుంటున్నాను. నా ఆశయం యిప్పటికి నెరవేరింది."

శరత్చంద్ర ముఖంలో సంతోషం కానవచ్చింది జేబులో చేయిపెట్టి చూచాడు. వక్కపొడి పొట్లాం తగుల లేదు. చుట్టూరా చూస్తున్న సమయంలో పెద్ద స్టార్ నట్ పౌడర్ ప్యాకెట్లు అరడజను హేండ్‌బ్యాగ్ నుంచి తీసి టీపాయ్ మీదుంచింది రేఖ

"ఓ థాంక్యూ - సోమచ్" పొట్లాం తీసుకుని చించి వక్కపొడి నోటినిండా వుంచుకుని మర ఆడించినట్లు నములుతూ అన్నాడు శరత్చంద్ర.

బ్యాగ్‌లోంచి స్కాచ్ సీసా తీసి టీపాయ్ మీదుంచింది రేఖ

శరత్చంద్ర కళ్ళు మెరిసాయి

"భారతదేశంలోని జర్నలిస్టు లందర్లో తలమానికం లాంటి మీరు దయతో నేను మీతో మాట్లాడటానికి అవకాశం యిచ్చినందుకు సంతోషం"

"ఆగ్రా, ఢిల్లీ చూద్దామని వచ్చాను. తీరా యింతదూరం వచ్చాక ఉదయ్‌పూర్‌లో శరత్చంద్రగార్ని చూడకుండా ఎలా వెళ్ళేది? మద్రాస్ వెళ్ళాక శరత్చంద్రగార్ని చూడకుండా ఎలా వచ్చావ్ అని స్నేహితులడిగితే ఏం చెప్పేది అనిపించింది."

"మద్రాస్‌లో కూడా నా గురించి చెప్పుకుంటారన్నమాట!" కొంచెం గర్వంగా పలికాడు శరత్చంద్ర.

"ఎప్పటికీ మీగురించే చెప్పుకుంటాం సార్."

ఎంద్రవేసి పాటలు గుర్తు తెచ్చుకుంది రేఖ.

"ఏదినా శరత్చంద్రకు యిగో ఎక్కువ వక్కపొడి నములుతూ స్కాచ్‌విస్కీ తాగుతూ ఉంటాడు నీ అంతవాడు లేడంటే చాలు ఉబ్బిపోతాడు అడిగినపని చేస్తాడు."

"జీవితమంతా జర్నలిజానికి ధారపోసాను! ఫ్రీలాన్స్ జర్నలిస్ట్‌గా దేశభక్తి నిరూపించుకున్నాను ఎంతటివారి మీదనైనా ప్రాణాలను లెక్కచెయ్యక పరిశోధన జరిపి వ్యాసాలు రాసాను."

"తిండి తిప్పలు నిద్ర చూసుకోకుండా శ్రమించాను. పదవీ వ్యామోహంతో బధిరాంధులైన కుటిల రాజకీయనాయకుల



# డెంటల్ హెల్త్ క్విజ్ -[11]

1. 'ఎట్రోపిన్' మందు -
(ఎ) కేంద్ర నాడీమండలాన్ని ప్రేరేపిస్తుంది (బి) కేంద్ర నాడీమండలంపై పనిచేయదు (సి) కేంద్ర నాడీమండలంతో సంబంధం లేదు.

2. ఈ మందు 'పల్స్‌రేట్'ను పెంచుతుంది.
(ఎ) ఎ. పి. సి. (బి) నోవాల్జిన్ (సి) అట్రోపిన్.

3. 'అట్రోపిన్' మందు లాలాజల స్రావాన్ని -
(ఎ) పెంచుతుంది (బి) తగ్గిస్తుంది (సి) పనిచేయదు.

4. 'అమిలోబ్లాస్టోమా' అనే కంతి (ట్యూమర్) -
(ఎ) పై దవుడలోమాత్రమే వస్తుంది (బి) క్రింది దవుడలోమాత్రమే వస్తుంది (సి) రెండు దవుడలలోను వస్తుంది.

5. 'అమిలో బ్లాస్టోమా' అనే దవుడ కంతి -
(ఎ) పై దవుడలో ఎక్కువ వస్తుంది (బి) క్రింది దవుడలో ఎక్కువ వస్తుంది (సి) రెండు దవుడలలోను సమాన స్థాయిలో వస్తుంది .

6. ముఖానికి వచ్చే పక్షవాతాన్ని యిలా పిలుస్తారు.
(ఎ) బెల్స్‌పాల్సి (బి) ఫేషియల్ పెరాలసిస్ (సి) మౌత్ పెరాలసిస్.

7. వ్యాధి నిర్ధారణలో, సంబంధిత కణజాలముక్కను, సూక్ష్మ దర్శినిద్వారా పరీక్షించడాన్ని యిలా పిలుస్తారు.
(ఎ) బయాప్సి (బి) ఆటోప్సి (సి) పోస్ట్‌మార్టమ్.

8. ఈ వ్యాధివస్తే నోటి లోపలి బుగ్గలు తోలుమాదిరిగా యేర్పడి మంట పుట్టిస్తాయి.
(ఎ) ల్యూకోప్లేకియా (బి) కేండిడియాసిస్ (సి) ఓరల్ సబ్‌మ్యూకస్ ఫయిబ్రోసిస్.

9. చిన్నపిల్లల నోటిలోపలి బుగ్గలపై తెల్లని పాలమీగడవలె కన్పించే ఫంగసు వ్యాధి -
(ఎ) లైకన్‌ప్లానస్ (బి) కాండిడియాసిస్ (సి) ల్యూకో ప్లేకియా.

10. 'సుద్దపళ్లు' వుంటే, యీ 'వ్యాధి' అని నిర్ధారిస్తారు.
(ఎ) ఫ్లోరోసిస్ (బి) సిఫిలిస్ (సి) మొనీలియాసిస్.

## జవాబులు

| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ఎ | సి | బి | సి | బి | ఎ | ఎ | సి | బి | ఎ |

- డా॥ కె. ఎల్. వి. ప్రసాద్

కుట్రలు ప్రజల ముందుంచాను."

"అవినీతికి వ్యతిరేకంగా అవిశ్రాంతంగా శ్రమించాను!" శరత్చంద్ర కళ్ళు మాటి మాటికీ స్కాచ్‌సీసా మీదకు వెళ్ళడం గమనించింది రేఖ.

"చూడమ్మాయ్ నీ కభ్యంతరం లేకపోతే......"

"నా కేం అభ్యంతరం లేదు సర్. మీరు నా తండ్రిలాటివారు."

శరత్చంద్ర స్కాచ్ గ్లాసులోకి వంపుకుని నీట్‌గా సిప్‌చేస్తూ "నా సంగతి చెబుతూ, నీ విషయాలేం తె లుసుకోలేదు. నువ్వు చూడబోతే చిన్నపిల్లవు. జర్నలిస్టుగా ఎన్నో వొడిదుడుకుల నెదుర్కోవాలి" అన్నాడు.

"మనసుంటే మార్గముండదా సార్?"

"ఉదయపూర్‌లో చూడవలసినవన్నీ చూసావా?"

"ఊహు. ముందు మిమ్మల్ని చూచి ఆ తర్వాత సైట్‌సీయింగ్ ప్రోగ్రాంకు వెళదామనుకున్నాను!"

"సో నైస్ ఆఫ్ యు! పోయిన నెలలో వ్లూజ్వరం వచ్చి నీరసంగా వుంది. లేకపోతే నేను నిన్ను వెంటబెట్టుకుని ఉదయపూర్‌లో చూడవలసినప్రదేశాలన్నీ చూపేవాడిని! టూరిస్ట్ గైడ్ యిస్తాను. తెలిసిన టాక్సీ అతన్ని పిలిపిస్తాను. నింపాదిగా ఒక్కో టూరిస్ట్ స్పాట్ చూచివద్దూగాని!"

"గైడ్‌లో వుండే ప్రదేశాలను చూడడంలో థ్రిల్ ఏముంటుంది సార్?!"

"మరింకేం చూడాలనుకుంటున్నావ్?"

"సర్దార్ కపర్దిని చూడాలనుకుంటున్నాను."

ఉలికిపడి చూసాడు శరత్చంద్ర.

"నా చిన్నతనంలో అందరూ ఆయనను మహానాయకుడిగా కీర్తించేవాళ్ళు. దేశంకోసం సర్వం త్యాగం చేసిన మహానుభావుడు.

ఇప్పటి కొచ్చేసరికీ ఆయనను దేవుడని పొగిడేవాళ్ళున్నారు. మోసకారి అని తిట్టేవాళ్ళూ వున్నారు!" అన్నాడు శరత్చంద్ర.

"సర్దార్ కపర్దిని తిట్టేవాళ్ళా సార్?"

"చంద్రుడిలో మచ్చవున్నట్లు ఆయన జీవితంలో ఆ ఒక్క కళంకమూ లేకపోతే ఆయన భారతదేశ రాజకీయాలలో మకుటంలేని మహారాజులా వెలిగి వుండేవాడు."

"ఏమిటి సార్ ఆ కళంకం?"

"దీపం కింద చీకటిలా పెద్ద

వారి జీవితాలలో లొసుగులను పట్టించుకో గూడదు. అయినా ఆయనంత దురదృష్టవంతు ఉండరు!"

"సర్దార్ కపర్ది రాజకీయాలు వదిలేసిన తర్వాత వ్యాపార రంగంలో ప్రవేశించి గొప్ప పారిశ్రామికవేత్తగా రూపాంతరం చెందారని విన్నానే?"

"పారిశ్రామికవేత్తగా ఆయనను దురదృష్టం వెంటాడుతున్నది! ఆయనతో భాగస్వాములుగా చేరాలనుకున్నవారంతా చచ్చిపోతున్నారు. ఆయన నీడ పడినచోట యముని మహిషపు రంకె వినపడుతున్నది!"

"ఈ మధ్య ఆయన కొన్ని పెద్ద కంపెనీలను విలీనం చేసి కైలాసగిరి ఎంటర్‌ప్రైజెస్‌గా ఏర్పాటు చేసాడని విన్నానే!"

"అవును. కష్టా లెదురైనంత మాత్రాన భయపడి పారిపోయే రకంగాడు సర్దార్. భారతదేశం పేదరికం పోవాలంటే ఆయిల్ నిల్వలు ఎక్కడుందీ తెలుసుకునే పరిశోధన అవసరం అని గుర్తించి అందుకోసం తన యావచ్ఛక్తినీ వెచ్చిస్తున్నాడాయన."

"సర్దార్ దేశభక్తిని శంకించడం మహాపాపం అని నా ఉద్దేశం."

"సర్దార్ కైలాసగిరి ఎంటర్‌ప్రైజెస్ హెడ్ ఆఫీస్ యిక్కడ వుంచడంలో వుద్దేశం ఏమిటో?"

"ఉద్దేశం ఏముంటుంది? ఎక్కడో ఒకచోట పెట్టాలిగా అందుకని ఇక్కడ పెట్టాడు. ఆయనకు ఉదయపూర్ అంటే యిష్టం. ఇక్కడ వాతావరణం అనువుగా వుంటుంది - ఆయన ఆరోగ్యానికి."

"ఇక్కడకు రెండుమైళ్ళ దూరంలో అహర్ అనే కుగ్రామం వుంది. ఆ గ్రామం పక్కన వున్న కొండమీద ఒక దుర్గం వుంది. శత్రు దుర్భేద్యంగా ఆ దుర్గాన్ని నిర్మించారు పూర్వం రాజులు. రాజాభరణాలు రద్దయ్యాక కారుచౌకగా ఆ దుర్గాన్ని కొనుక్కుని బాగుచేయించి ఎలక్ట్రిసిటీ, వాటర్ సప్లయి, అప్రోచ్ రోడ్ ఏర్పాటుచేసుకుని కావలసిన వసతులన్నీ అమర్చుకున్నాడు."

కపర్ది అనుమతి లేనిదే కైలాసగిరి దుర్గంలోకి కాదుగదా, ఆ పరిసరాలలోకి కూడా ఎవరూ అడుగుపెట్టే వీలులేదు.

"మరిచాను రేఖా - థార్ ఎడారిలో ఆయిల్ నిల్వలున్నాయని పరిశోధనలో తేలిందిగదా - ఆ విషయం మీద

## మోహినీతాండవం


తన దృష్టి కేంద్రీకరించాడు సర్దార్."

రేఖకు హూవర్ డైరీలో రాసిన వాక్యం గుర్తొచ్చింది. భస్మాసుర లోఘవార్ కన్నా ఎక్కువ ఆయిల్ నిల్వలున్నాయన్నదే ఆ వాక్యం!

"సార్ ఘవార్ అంటే ఏమిటి సార్?!"

"ఘవార్ - ఆ పేరు విన్నట్లే వుంది!" గుర్తు తెచ్చుకోటానికి ప్రయత్నిస్తూ అన్నాడు శరత్చంద్ర.

"ఘవార్ అన్నది ప్రపంచంలో కెల్లా పెద్ద ఆయిల్ ఫీల్డ్. సౌదీ అరేబియాలో వుందా ఆయిల్ ఫీల్డ్."



ఆశ్చర్యంతో నివ్వెరబోయింది రేఖ.

"సార్ మీతో మాట్లాడి ఎన్నో విషయాలు తెలుసుకున్నాను. ఇక వెళ్తా." లేచి నిలబడింది రేఖ.

"అప్పుడే వెళ్తున్నావా?!"

"వెళ్ళబోయేలోపున మళ్ళీ వోసారి వస్తాను సార్ -" చేతులు జోడించి నమస్కరిస్తూ అంది రేఖ.

వాకిలిదాకా వెళ్ళి వెనక్కుతిరిగి "సార్ - మోహిని గురించి మీకేమైనా తెలుసా?"

శరత్చంద్ర ముఖం వివర్ణమై మరలా మామూలవడం గమనించింది రేఖ.

"మోహిని?! తెలీదమ్మా - ఆడవాళ్ళ విషయం పట్టించుకోన్నేను!"

ఇక అక్కడవుండి ప్రయోజనంలేదని పించి వచ్చేసింది రేఖ.

* * * * * *

"గురూజీ."

"దీర్ఘాయుష్మాన్‌భవ."

"గురూజీ మీ ఆశీస్సులతో సురేష్ బాబు అప్పజెప్పిన పని చాలావరకు పూర్తి చెయ్యగలిగాను. స్వార్థప్రయోజనాలకోసం ప్రత్యర్థులను చంపించే మురా సభ్యులను గురించి కొంత అవగాహన కల్గింది."

"మంచిది రవీ - జాగ్రత్త - దుర్మార్గులు, క్రూరులు తమకు హాని తలపెట్టేవారిని వూరికే వదలరు. ఇప్పుడు నీకు పరీక్షా సమయం! ఇన్నేళ్ళుగా నీకు నేనిచ్చిన శిక్షణను నువ్వెలా ఉపయోగించుకుంటావనే దాన్నిబట్టి ఫలితం ఆధారపడి వుంటుంది!"

"గురూజీ ఏ పరిస్థితులలోను మీకూ, మీరిచ్చిన శిక్షణకు అగౌరవం తీసుకురానని ధైర్యంగా చెప్పగలను" రవి కంఠం నిశ్చలంగా వుంది.

అతనికి కొంతకాలం క్రితం గురూజీ చెప్పిన మాటలు గుర్తొచ్చాయి.

"రవీ - మన కష్టాలను మనమే భరించాలి. మన సుఖాలను మాత్రం మిత్రులతో పంచుకోవాలి" ఆయన మాటలు ఉలితో చెక్కినట్లు రవి హృదయంలో నాటుకున్నాయి.

అందుకే మోహిని గురించి గురూజీని అడుగుదామని అనుకుని వూరుకున్నాడు.

జరుగుతున్న మారణకాండకు కీలకం మోహిని! గురూజీతో ఆ విషయం గురించి

సంప్రదించి నందువలన ఆయనకు యీ వృద్ధాప్యంలో అనవసరపు చిక్కులు, ప్రమాదాలు తెచ్చిపెట్టినట్లవుతుంది!

ఈ వయసులో ఆయన కేమైనా జరిగితే బిందు, చంద్ర దిక్కులేని వారవుతారు.

నే నెంత తెలివి తక్కువగా ఆలోచిస్తున్నాను! భీష్మాచార్యుల వంటి గురుదేవునికి ఎవరు హాని చేయగలరు? చంద్ర కూడా మార్షల్ ఆర్ట్సులో పరిపూర్ణత సాధించటానికి సిద్ధమవుతున్నాడు. ఇక మిగిలింది బిందు. జాత్యంధురాలు బిందు మోహినికి టార్గెట్ అవుతుంది.

అదృష్టవశాత్తు లభించిన అపురూప వరం సోదరి బిందు. ఆమెకేమైనా జరిగితే నేను సహించలేను!

"ఏమిటి రవీ - దీర్ఘాలోచనలో వున్నావు?"

"మనసులోని ఆలోచనలను అదుపు చేస్తున్నాను గురూజీ!"

"రవీ - నువ్వు నా అంత వాడివయ్యావు. నాకు తెలిసిన విద్యలన్నీ నీకు నేర్పాను. కాని వయసునేర్పే గుణపాఠం ఒకటుంటుందయ్యా."

"చెప్పండి గురూజీ!"

"మెరిసేదంతా బంగారం కాదని సామెత వుంది. ఒకోసారి మిత్రులు శత్రువులుగానూ, శత్రువులు మిత్రులుగానూ కనపడుతుంటారు. భ్రాంతి పొరలు కప్పబడి నిజం కనపడకుండా పోయే ప్రమాదం వుంటుంది!"

"జాగ్రత్తగా వుంటాను గురూజీ"

"రవీ - రేఖ పంచెపల్లె నిన్ను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నది!"

## మోహినీతాండవం

"గురూజీ - రేఖకు కోపం ముక్కు మీదే వుంటుంది!"

"నువ్వామె మెడలో మూడుముళ్ళు వేసిన క్షణానే ఆ కోపం మాయమవుతుంది!"

"గురూజీ!"

"నువ్వామె ప్రేమను మన్నించవేమో నన్న భయంతో ఆమె తత్తర పడిపోతున్నది! ఆ తత్తరపాటు నీకు కోపంగా కనపడుతున్నది"

"గుర్తుంచుకుంటాను గురూజీ"

"రవీ - మాట"

"చెప్పండి గురూజీ."

"ఏ పరిస్థితులలోనూ మిత్రుల మీద దాడిచేయనని - చేయివేసి నాకు వాగ్దానం చెయ్యి."

"అలాగే గురూజీ" ఆశ్చర్యపోతూ బదులు పలికాడు రవి. గురూజీ అలాంటి కోరిక కోరడం అదే మొదటిసారి.

రవి గురూజీ దగ్గర్నుండి బయలుదేరి ఉదయపూర్‌కు ఉత్తరంగావున్న ఫతేసాగర్ సరసు వొడ్డున చిన్న బంగళా దగ్గరకు వెళ్ళాడు. ప్రతాప్‌సింగ్ రిటైర్డ్ ఎస్.పి అని బోర్డు రాసివుంది గేటు మీద.

గేటు తెరుచుకుని లోపలకు వెళ్తుంటే "ఎవరు?" అంటూ తోటలో నుండి వచ్చాడు ప్రతాప్‌సింగ్

"నే నంకుల్"

"నువ్వా రవీ - నీ కంఠస్వరాన్నిబట్టి పోల్చుకోగలిగానుగాని లేకపోతే ఇన్నీ వేషంలో గుర్తుపట్టేవాడిని కాదు సుమా! ముప్పై ఏళ్ళు పోలీసాఫీసరుగా చేసి రిటైరైన నన్ను ఏమరచగలిగావంటే యు ఆర్ ఎ వండర్!" లంగళాలోకి దారి తీస్తూ అన్నాడు ప్రతాప్‌సింగ్

లోపల గదిలో కూర్చుంటూ "రవీ - నిన్నుచూచి చాలా కాలమైంది. గూఢచారి విభాగంలో పనిచేస్తున్నప్పుడు నీ సాహసకృత్యాలు కథలు కథలుగా మా ఆఫీసర్స్ క్లబ్‌లో చెప్పుకుంటుంటే విని ఆనందించేవాడిని.

అకస్మికంగా ఉద్యోగం మానుకుని అంతర్ధానమైపోయావని విన్నాను!

"ఐ యాం ప్రౌడ్ ఆఫ్ యు మై బాయ్. మీ నాన్న బతికివుంటే..."

"అలజడి తగ్గేదాకా అజ్ఞాతంలో వుండమని మా బాస్ చెప్పాడంకుల్!"

"దటీజ్ గుడ్ ఇన్నాళ్ళనుండి ఏం చేస్తున్నావ్ - ఎక్కడున్నావ్? వద్దులే చెప్పొద్దు. అనవసరం! ఒక రిటైర్డ్ పోలీసాఫీసరుగా అడుగ గూడని దా ప్రశ్న!"

"మార్షల్ ఆర్ట్సులో ప్రావీణ్యం పెంచుకుంటున్నానంకుల్. మారువేషాలు వేయడంలోనూ నేర్పు పెంచుకుంటున్నాను."

'దటీజ్ ఎవిడెంట్ - లేకపోతే ప్రాణాలతో నాకు నువ్వు కనపడి వుండేవాడివి కాదు!"

"అంకుల్ నాకు కొన్ని వివరాలు కావాలి."

"అడుగు?"

"మోహిని గురించి నీ కేమైనా తెలుసా?"


"బందిపోటు. మోహిని గురించేనా నువ్వడిగేది?"

రవి మాట్లాడలేదు హత్యలు చేసి, చేయించే మోహిని దోపిడీలు చెయ్యగూడదని ఏముంది అనుకుని వూరుకున్నాడు.

"రవీ నా సర్వీసంతా మోహిని ఆగడాలను ఎదుర్కోటానికే సరిపోయింది! చంబల్‌లోయనుండి తరలివచ్చిన మోహిని అహోర్ గ్రామం పక్కనున్న కైలాసగిరి కొండమీద స్థావరం ఏర్పరచుకుని రాజస్థాన్ మొత్తి మాట్లాడితే ఉత్తర భారతమంతా దోపిడీలు కొనసాగించింది.

పంజాబ్, కాశ్మీర్, అస్సాం, బెంగాల్ ఎక్కడకు పడితే అక్కడకు వెళ్ళి దోపిడీలుచేసి వచ్చేది."

"మోహినిని మీరు అరెస్ట్ చేయ



లేదా?"

"ఎంత ప్రయత్నించినా మోహినిని పట్టుకోలేకపోయాం! కైలాసగిరి కొండ మీద, చుట్టుపక్కలవున్న అడవిలో మరుగు ఎక్కువ. ఆ అడవిలోవుండే కొండజాతి సంచార ప్రజలకు మోహిని వాక్కు వేదవాక్కు."

"దేశం మీదపడి దోచుకొచ్చిన డబ్బుతో వాళ్ళను మేపుతుండేది."

"దాంతో పోలీసు రెయిడ్ మొదలవగానే రహస్య సంకేతాల ద్వారా ఆ విషయం మోహినికి తెలియజేసేవాళ్ళు. క్షణాలలో బిచాణా ఎత్తివేసేది! మోహిని ఆచూకీ చెప్పమని ఎన్నోరకాలుగా భయపెట్టాం, ప్రలోభపెట్టాంకాని ఎవరూ ముందుకువచ్చేవాళ్ళుగాదు!"

"అయితే మోహిని జోలికి వెళ్ళకుండా వూరికే వుండిపోయారా?"

"లేదు మా ప్రయత్నాలన్నీ మేం చేసేవాళ్ళం. కైలాసగిరి చుట్టుపక్కల అడవులలో పోలీసు సెంట్రీలను ఏర్పాటు చేసాం. అడవుల లోపలకు ఆహారపదార్థాలు, మందులు వెళ్ళకుండా కట్టడిచేసాం. జబ్బు చేసి వస్తారేమోనని చుట్టుపక్కల ఆస్పత్రుల దగ్గర ఆఖరుకు పల్లెటూరు వైద్యుల దగ్గరా కాపుంచాం."

"ఏం చేసినా ఆచూకీ తెలిసేదిగాదు! ఒకసారి మాత్రం ఆరావళీ కొండలలో దాదాపు మోహినిని చుట్టు ముట్టాం. అప్పుడు జరిగిన కాల్పుల్లో మోహిని అనుచరులు చాలామంది చనిపోయారు. కాని కొడుకును తీసుకుని థార్ ఎడారిలోకి పారిపోయింది. ఆ తర్వాత మోహిని మా పోలీసు బలగం దరిదాపులకు రాకుండా జాగ్రత్తపడింది!"

"అంకుల్ మోహినికి వివాహం అయిందా?"

"ఉహు - తన అనుచరులలో ఎవరు ఎక్కువ శౌర్యప్రతాపాలు చూపితే వాళ్ళను ప్రియునిగా స్వీకరిస్తుండేది. మోహిని పొందుకోసం ఆమె అనుచరులు ఒకరిని మించి వొకరు పోటీపడుతుండే వాళ్ళు."

"కొడుకు వున్నాడన్నారు?"

"సొంతకొడుకుగాదు. మోహిని ఒకసారి అస్సాం రాష్ట్రంలో దోపిడీలు చేస్తున్నప్పుడు దొరికిన మగపిల్లవాడిని పెంచుకుందని చెప్పుకునేవాళ్ళు!"

"సొంతకొడుకు కాకపోతేనేం అతన్ని ఎంతో శ్రద్ధగా పెంచేదట!"

"కొడుకు కూడా బందిపోట్లలో జేరిపోయాడా?"

"ఉహు. కొంత వయసు వచ్చాక అతన్ని దూరంగా ఎక్కడో వుంచి చదువు చెప్పించేదని విన్నాను!"

"కొడుకుని పట్టుకుని అతనిద్వారా మోహిని ఆచూకీ తీయాలని ప్రయత్నించకపోయారా అంకుల్."

"ఎంతో కృషిచేసాం. కష్టపడ్డాం - కాని కొడుకు ఎక్కడుందీ తెలుసుకోలేకపోయాం! మోహిని నీడను కూడా చూడలేకపోయాం. విపరీతమైన అలజడి సృష్టించిన మోహినీతాండవం మాత్రం ఆగలేదు."

"ఏమన్నారంకుల్ - మోహినీ తాండవమా?"

"అవును రవీ - నా ఆఫీసులో ఛార్టుండేది. మోహిని దోపిడీలు చేసిన ప్రదేశాలన్నీ ఎర్రసిరాతో ఇంటూ గుర్తు పెట్టేవాళ్ళం. సంవత్సరం అయ్యేసరికి ఇంటూ గుర్తులు ఎక్కువైపటం గజిబిజిగా కనపడింది. మోహినీతాండవం అని మొదటగా మా డి.ఐ.జి. అన్నారు. ఆ మాటే నిలబడిపోయింది, మెహిని మరణించేవరకూ!"

"మోహిని మరణించిందా అంకుల్!" ఆశ్చర్యంగా అడిగాడు రవి.

"పోలీస్ ఫోర్స్ దాడులలో మోహిని అనుచరులు కొందరు మరణించారు. కొందరు వోపిక తగ్గి ముఠానుండి వెళ్ళిపోయారు. జయప్రకాశ్ నారాయణ్ చొరవ వలన చాలామంది బందిపోటు దొంగలు జాతిజీవన స్రవంతిలోకి రావడంతో యితర ముఠాలు చాలా చెల్లాచెదరైపోయాయి."

"దాదాపు ఏకాకిగా మిగిలిన మోహిని మాత్రం లొంగిపోలేదు."

"జీవిత విధానం మార్చుకోలేదు. చివరకు నాలుగు సంవత్సరాలనాడు మోహిని కైలాసగిరి పర్వతంవైపు వస్తుండగా గుర్తుపట్టిన సెంట్రీ రైఫిల్‌తో కాల్చాడు. తీవ్రంగా గాయపడ్డ మోహినిని గుర్రం అడవులలోకి తీసుకుని వెళ్ళింది."

(ఇంకా వుంది)



## హేమమాలిని అభిమాని!

సినీ నటీ నటులపై అభిమానం పెంచుకునే అభిమానులు అనేక రకాలుగా వుంటారు. కొందరు తమను పెళ్ళి చేసుకోమంటూ లేకపోతే ఆత్మహత్య చేసుకుంటామని వాళ్ళకు ఉత్తరాలు వ్రాస్తుంటారు. మరికొందరు ఎటువంటి కోరికలు కోరకుండానే కేవలం అభిమానం కురిపిస్తూ వుంటారు. వాళ్ళకు తోచింది చేస్తుంటారు. ఆ కోవకే చెందిన ఒక హేమమాలిని అభిమాని తన పి. ఎఫ్. మొత్తం హేమకు చెందాలని వ్రాసి కన్ను మూసాడట. మహారాష్ట్రలోని భిలాస్‌పూర్‌కు చెందిన ఆ వ్యక్తి ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. తన అభిమాన నటి హేమమాలినితో చిత్రం తీయాలన్న కోరికను నెరవేర్చుకోలేకపోయిన ఆ అభిమాని తన పి. ఎఫ్. ను హేమమాలినికి చేరాలని వీలునామా వ్రాయటంతో పి. ఎఫ్ ఆఫీసువాళ్ళు హేమకు లెటర్ వ్రాశారట కాని జవాబు లేదుట. ఈ విషయం తెలిసి ఆతని తల్లిదండ్రులు మాత్రం శోక సముద్రులయ్యారుట. అయినా అతనికి హేమ పట్ల ఆ అభిమానమేమిటో?! తల్లి దండ్రులపట్ల ఆ నిర్లక్ష్య మేమిటో?!

# మనసు నిండింది

**ఉమాశివ**

"ఛీ...నీయవ్వ....లగ్గంల....అగ్గివడ... లగ్గం కున బారేత్తు ఇదొక లగ్గం దీందో కథ."

"ఏమైంది బాపు...."

ఏందా నీయవ్వ....కూసుండి ఇస్తార్లల్ల దినుడుగాడు.....నిలవడి తాటిబట్కాని "బొక్కుతాంౘ్రడు గాడ్డికొడుకులు. .ఇంత గరీబుగాన్కి ముద్దబెట్టని లగ్గం.. .ఏ లగ్గంర. నీయవ్వ . దునియా మారిపోయింది."

"ఆళ్ళు తాటిల్లల్ల దింటే నీకేంది.. . ఎంగ్ల దింటే నీకేంది బాపు. .."

"అరెగాడ్డికే. నువ్వు సప్పుడుజేయక. ఇస్తార్ల దావతైతే ఎంగిలి ఇస్తర్లు బైట బడేసేటోళ్ళు మన బిచ్చపోళ్లకు ఒక పొద్దు తిండి దొరికెడిది. తాటిల్లల్ల ఎవలకు వాళ్లు.....ఎంత గావలిస్తే గంత బెట్టుకుని నిలవడి తిరాంగా దిన్నంక ఆండ్ల యింక ఏం మిగిలిస్తరురా . . ఎవలన్నా యిడిసిపెట్టినాగాని అది ఆ తోటిలు గడిగే పనోళ్లకు పోతదిగాని బిచ్చపోళ్లకు ఏమొస్తదిగా....సీ నీయవ్వ లగ్గం లగ్గం అని ఎంత ఆశపడిన.... లగ్గంల మన్నువడ..."

"నేనందుకే జెప్తబాపు....గీ అడ్కదినుడు బందుబెట్టి...నైకీర్ జేస్కుందామని....పొద్దుగాల సంది లగ్గం లగ్గం అనుకుంట మస్తు ఎగిరినవ్. ఆడ మెతుకు దొరకకపాయె. మల్లా యిపుదుబోయి ఊరిమీద బడాల్నా. ..?"

"ఎవరికోసంరా మరి.. ..ఎవరి కడుపుగాత్తే వాడు మరి చిప్పబట్టుకుని అడుక్కదినాలె....నడు గా లగ్గం బువ్వదొరకదని తెల్సి మనోళ్లందరు అప్పుడే ఊర్లోకి బోయింౘ్రు."

"ధూ నీయవ్వ కుక్కబతుకైపోయింది ఆడ గాదంటె ఈడ....ఈడ గాదంటే ఆడ...."

"ఆడ....ఈడ అడుక్కదినక నీవేమన్న జాగీర్‌దార్ ననుకుంటున్నావురా భేవకూఫ్.. .నడు జల్దీ. నీయవ్వ నీతోని పెద్ద పరేషాన్ అయిపోయింది నాకు."

"బాపు....."

"అరె జల్ది నడురా. .. తరువాత బాతలేద్దువుగాని... .కడుపుగాలి సత్తున్న గాదురా ...నడు....నడు."

* * * * * *

"బాపు... ."

"ఏందిరా వారి. ."

"రేపటి సంది నేను సర్కార్ బడికి పోయి సదుకుంట. . నేను ఇగ అడుక్కదిన .."

"ఏందిరా.....సర్కార్ బళ్ల సదుకుంటావ్. ..అరె వారీ... నీ వెవళ్లకు బుట్టినవ్‌రా......?"

"నీకే.. ."

"మరింకేందిరా.. ..గట్ల మాట్లాడుతవ్.....?"

"అరె వారి.....మా తాత ఏం జేసెచోడో ఎరికేనారా?...."

"ఏం జేసేటోడు.....?"

"అడుక్కధినెటోడు."

"మా నాయన ఏం జేసేటోడో ఎరికేనారా....?"

"ఏం జేసేటోడు....."

"నీయవ్వ నీతలకాయల మెదడుగాదుర మట్టి వున్నది. మా నాయనగూడా అడుక్కదినేటోడు నవాబుతరీక. ..."

"నవాబులు అడుక్కతింటగా ఏడ్నన్న

"లేకుంటే బండగొట్టి సంపాదిస్తారనుకున్నావురా.....కాకుంటే వాళ్లుబోయి చిప్పబట్టుకుని అడుక్కదినకున్నా మనుష్యులనుబెట్టి అడిగిపించేటోళ్లు."

"ఏంది...."

"పన్నులని అదని.. ఇదని - అడుక్కునేటోళ్లు.. లేకుండే ఆళ్లకేడనుంచి వస్తయిరా పైసల్ అరెవారి నిరుదు ఓట్లు ఎలక్షన్లు అయినయి ఏర్పాటేనా -"

"అవ్ "

"అపుడేం జేసింౘ్రురా. ..మన చెట్టు కాడికి వచ్చి అడుకోలేదురా ?"

"ఏంది. .?"

"ఓట్లురా అరె వారి జంగపోడంటే ఎర్కైనారా..."

"ఎవరు. "

"దేవుడురా... .శివుడు. శివు డేంజేసెటోడో ఎరికేనా రా ."

"ఏం జేసేటోడు .?"

"జంగమయ్య -ఏశంగట్టి అడుక్కతినేటోడురా.. ..అరె మనల్ని బుట్టించిన గా భగమంతుడే అడుక్కదిన్నంక మనం అడుక్కదింటే తప్పేందిరా..... మనల్ని పాలించే సర్కారే అడుక్కదిన్నంక మనం అడుక్కడింటే తప్పేందిరా ....."

"గది గాదు బాపు.....నేను సదుకుంటా.. "

"నువ్ సదూకుంటే నీకు బువ్వెవడు బెట్టదురా?"

"నువ్వేబెట్టాల ...ఏంటికి గన్నవ్....?"

"అవ్.....నిన్నడిగి కనలే.....తప్పైపోయింది. గిసొంటి బేమాన్‌గాడు బుడుతాడని దెలిస్తే నీయవ్వ నిన్ను గనకపోనేపోయేదిరా...."

"నేనేం జేసిన....?"

"ఛీ నీయవ్వ బిచ్చపోళ్లల్ల తప్పబుట్టినవ్‌రా.....జాగీర్‌దార్ తీరు మాట్లాడుతవ్. సదుకుంటా సదుకుంటా గివేమాటలు....గటుసూడు.... గా బోయేటోళ్లందరు ఎవరో ఎరికేనా? అళ్లుగూడా బిచ్చరాళ్లె."

"సీ.....గట్ల మాట్లాడుతవ్....ఆళ్లు కాలేజిలో సదివేటోళ్లుగాదూ.. ."

"గది యియ్యాలటి మాట.....రే పటి సంది ఆళ్లుగూడ అడుక్కదినబో తరు."

"ఏడికి...."

"నౌఖరికోసం.....కొలువుకోసం...."

"బాపు దేనికేదో ఒకటి మాట్లాడి...నా నోరు ముయిపిస్తవ్.. .నేను సదవుకుం టనే. ."

"సదువుకో....కాని సద్ది పెట్టేటం దుకు నేనుండగదా...."

"ఏడ్కి బోతున్నవ్ . "

"రేలుగాడిల పట్నం బోతున్న . .."

"సీతాన పైసల్ ఏడియి "

"అరె పిసోడివా ఏంది నాకు పైసల్ దేనికి...."

"టిక్కెట్ కోసం "

"నాకు టిక్కెట్ ఎందుకు ...రెళ్ల అడుక్కదింటగూడ...."

"నల్లంగి టిక్కెట్లసారొచ్చి టిక్కెట్ అడిగితే...."

"లేదంటా."

"పోలీసులకు పట్టిపిస్తే. ."

"పట్టిపియ్యని."

"అరె గట్లెట్ల. .."

"అవ్....పట్టుకోకుంటే పట్నంబోత పట్టుకుంటే జైలుకుపోతా మంచిగా సర్కారోల్లే ఒక వారందినాలు బువ్వ బెడ్తరు. ఇడిసిబెట్టినంక మల్ల పట్నం బోతా."

"మల్లా బట్టుకుంటే...."

"అరె పట్టుకోనీరా.....ఆళ్ల కర్మ. .

"పట్నంబోయి ఏం జేస్తవ్. . ?"

"నీ ఇద్దరక్కల జూసొస్త...."

"అవ్ బాపు ఆళ్లను జూసి మస్తు దినాలయింది. నాకుగూడ ఆళ్లను సూడాల్నని వున్నది."

"మరయితే అస్తవా...."

"అస్తగాని...ఆడ అక్కలేం జేస్తరు...'

"ఏం జేస్తరురా అడుక్కదింటరు...నీ తీరు అవారాగానిలెక్క తిరుగుతరనుకు న్నవా ఏంది... ?"

"ఛ్చ్....ఆల్ల బతుకు కూడా యింతే నన్నమాట..."

"మనకన్నా నయమేతియి...ఆళ్లకు సిన్నప్పటి సంది మంచి పాటలు నేర్పింది మీ యవ్వ. ఆళ్లు మంచి రాగందీసి పాడ్తుంటే మస్తు పైసలేస్తరు."

"అవ్ అవ్వగూడ మంచిగ పాడు తుండే....మరి బావలేంజేస్తరు....?"

"ఏం జేస్తరురా.....ఒక్కడేమో ఒగ కన్ను మూస్కుంట తెరుసుకుంట బసి స్టాండుల అడుక్కతింటడు. ఇంకోడు నేలమీద దేక్కుంట చార్‌మీనార్‌కాడ అడుక్కదింటడు. నీ అక్కలు రైల్ టేసన్ల అడుక్కదింటరు....నీ అన్నలు ఈడ అడుక్కదింటరు....అడుక్కదిన అనే బద్మాష్‌గాడివి నీ వొక్కడివే."

"గట్ల దిట్టకు బాపు....అడుక్క దినాలంటే నాకు....మస్తు షరమైతది."

"సీ నీయవ్వ.....అయ్య అడుక్కచ్చి బెడితే....తిన షరం గాదురా...నాకుగాక కాలు రెక్కలు సక్కంగున్నయని నక రాల్ జేస్తున్నవు.....నీయవ్వ. నువ్ బుట్టిననాడే నీ కళ్లతింత జీడిబోసుంటే అయిపోతుండే లేకుంటే ఓ కాలన్న, సెయన్న యిరగగొట్టుంటే మంచిగుం టుండే. అప్పుడు నువ్వే సచ్చినట్టు అడుక్కదినేటోడివి. దినాం నాకీ లొల్లి వుండెడిది గాదు."

"గది గాదు బాపు ."

"మరేందిరా. . "



"అడుక్కదింటుంటే మస్తు బూతులు దిద్దుంద్రు."

"తిట్టని....ఇవతలకచ్చి నువ్వుగూడ దిట్టు. నీ నోటితిమ్మిరి తీరిందాక."

"ఛీ...గట్ల వాళ్లు దిడుతుంటే ఇజ్జత్ అనిపించదా...?"

"అరె ఆకలి దీర్చుకోను అడుక్క దింటున్నం దానికి ఇజ్జత్ ఎందుకురా?"

"మనం కష్టపడితల్లేదు."

"కష్టపడ్తంలేమా....ఏది ఈ సెట్టు కిందనే గుసో. ఏ ధర్మతల్లిన్నా ఓ ముద్దతెచ్చి ఏస్తదేమో సూస్త.... మనం ఏడకు తిరగకుండనే ఒర్లకుండనే ఏ అయ్యన్నా ఓ పైస తెచ్చేస్తడేమో సూస్త....మనం కష్టపడి ఇల్లిల్లు తిరుగకుండనే నోట్లకి నాలుగేళ్లు పోతున్నయిరా! వారి!"

"మరి వాళ్లంత మస్తు కష్టపడి సంపాదించుకున్నదాన్ని....మనం..."

"అరె వాళ్లే మనకోసం కష్టపడి సంపాదించి తెచ్చి పోస్తున్నరా....అల్లు సంపాదించిన పైసలల్లకెళ్లి....పుణ్యంకో సమో. ...పాపమని జాలిపడో.... చిల్లర ఏస్తున్నరు."

"మరి అన్నం. .?"

"అరె వాళ్లేమన మనకోసరం వండుతున్నారా ....వాళ్లు వండుకున్నది వాళ్లు దిన్నంక.....మిగిలింది పారేసుటెందుకని మనకేస్తున్నారుగాని అరె యిది బాగానే వున్నదిరో....నీకు ఎట్లజెప్తె సమజైతదిరా......"

"ఏమో... గీ అడుక్కతినుడు నాకు మంచిగనిపిస్తల్లేదు."

"అరె పిస్సోడా ఈ మనుష్యులు దినమంతా ఏమన్నా జేయని వాళ్లకు గిట్ట పాపం తల్లకుంట.. దేవునికి పూజలు జేస్తున్నారు. పుణ్యంరావాల్నని మనకు దానం జేస్తున్నారు. దేవుని తరువాత దేవునంతటోళ్లంరా మనం."

* * * * * *

"బాపూ. ."

"ఏందిరా.. ?"

"ఎట్లన్న మన బతుకులు రోత బతుకులు బాపు.. ."

"ఏంటికి... "

## నా దేశం

నాదేశం
స్వాప్నిక ప్రపంచం!
స్థలకాలాల కొలతలుండవు
హేతు వుండదు
తర్కానికసలు తావే లేదు!
ప్రాచీనత, ఆధునికత పక్క పక్కనే
మనిషికొక న్యాయం
మతానికొక ధర్మం.
అనుభూతికే, ఆలోచనకీ
మాటలకీ, చేతలకీ పొంతనుండదు.
స్వీయవాంఛా పరిపూర్తి తప్ప
విలువలుండవు!

-పి.వి.కృష్ణారావు

"మొన్న ఐలయ్య సచ్చిపోతే ఏంజేసింద్రు..."

"ఏం జేసింద్రురా దుఃఖమొచ్చినోళ్లంతా మస్తు ఏడ్చింద్రు."

"గంతెగదా....ఏడ్వచాతనై ఏడిసింద్రుగాని వాన్ని కాల్చచాతనై కాల్చింద్రా. ఒక దినమంతా గట్లగే పడివున్నదిగదా వాడి శవం."

"ఉంటే ఏందిరా....మల్ల సర్కారోల్లు వచ్చి బండ్ల దీస్కబోలేదా."

"ఆ... ఆ....తీస్కబోయింద్రు. ఆడ ఆళ్లు ఆ శవాన్ని ఏమిజేసింద్రో...?"

"ఛీ.. .నీయవ్వ బతుకులల్ల మన్నుబడ "

"అరె వారీ! సర్కారోళ్లు.. . ఎవరెవర్కి సావులు జేస్తరో ఎర్కేనారా .. ?"

"ఎవర్కి జేస్తరు.. "

"ఎవర్కిజేస్తర్రా మినిష్టరోళ్లకు.... మన బిచ్చపోళ్ళకిజేస్తరు సూసినవా మనంగూడా సర్కారోళ్లంత గొప్పోళ్లం."

"అవ్.....ఆళ్లకేమో లగ్గంజేసినట్లు జేస్తరు. మనకేమో కుళ్లి పురుగులుబట్టేనంక ఇంతగాంచు మూనెబోసి కాలుస్తరు......అది పూర్తిగ కాలినా కాలకున్న దిక్కులేదు."

"అరె మనమే సచ్చినంక....మనిషే బోయినంక యింక శవాలగురించి రంధి బడతావ్ ఎందుకురా.....దేనికైనా నసీబ్ వుండాలరా."

"నసీబ్‌ల లేంది జిందగీల ఎట్ల వొస్తదిరా."

"నీవు గిట్లనే మాట్లాడు....నేను మాత్రం అడుక్కదిన...!"

* * * * * *

"బాపు...!"

"మల్లేందిరా...."

"నీకుగిట్ట మంచిగా బంగ్లాకట్టాలని వుండదా?"

"ఎందుకురా బంగ్లా.....నీకు నీ అన్నలకు భాగాలుపంచనా...."

"నీయవ్వ గదిగాదు బాపు..."

"ఏదిగాదు.....ఇప్పుడైతే బాపు.... బాపు....అని ప్రేమగ తిరుగుతున్నారు. నువ్వూ నీ అన్నలు....నాగిట్ట బంగ్లాలుంటే ప్రేమంతా నామీదగాదు నా బంగ్లాలమీద వుంటుండే...గిప్పుడైతే నేను సస్తే అయ్యో మా బాపు సచ్చిండు అని ఏడుస్తరు.....నాగిట్ట బంగ్లాలుంటే మా బాపింక ఎప్పుడు సస్తడో అని ఎప్పుడు పంచుకుందమా అని ఎదురుసూస్తరు."

"ఛీ......"

"ఛీ.....ఏంది దునియాల జాస్తలేమా ఏంది?"

"మాగురించికాదు. నీ కసలు మంచిగ సంపాదించాల్నని సుఖంగ వుండాలని వుండనే వుండదా...?"

"ఇప్పుడు సుఖంగలేనా.....ఆకాశమంతా నాదే....భుదేవంతా నాదే. ఈ సెట్లగాలితో ఈ వాగునీళ్లతో సిన్నప్పటి నుండి దోస్తాన నాకు."

"ఏందో....ఎట్లెట్లనో మాట్లాడుతవ్."

"అరె వారి యిపుడు నాతాన ఒక లచ్చ వున్నది. దానిసోపతి యింకో లచ్చ సంపాదించాల అన్న కాయిష్ నాకు లేదురా...ఏమిలేనోడికి ఏ కోర్కెలూ వుండవ్‌రా....గొంచమంతవుంటేనో యింకొంచెం కూడబెట్టాలని ఆశబుడ్తది."

"అరె బాపు.....నాకు సమజ్‌గాక అడుగుతా.....గింత బేఫికర్‌గా ఎట్లుంటున్నవ్ బాపు....?"

"అరె నాకు మస్తు సంపాదించాలని రంధిలేదు. అందుకే మనసు శాంతంగ వున్నది. సంపాదించింది యింకొకడు దోచుకుపోతడని భయంలేదు.....అందుకే ఈ బేఫికర్."

"గట్లగాదు బాపు.........పోయిన

'నెల ఏమైంది....?"

"ఏమైంది....?"

"సర్కారోళ్లొచ్చిగా సడాక్ (రోడ్డు) పక్క సెట్టుకింద నుంచి ఎల్లగొట్టిరి."

"అవ్.....అందుకే గదా ఈడకొచ్చినం...."

"మల్ల కొన్నిదినాలయినంక ఈడకొచ్చి ఎల్లగొడ్తే...."

"ఎల్లగొట్టనీ.....వాళ్లపని వాళ్లు జేస్తరు మనదారి మనం జూసుకోవాలె. ఈడగాకుంటే మరోకాడా.......ఊరు ఊరంత మనకేకాదుర....ఈ ఊరుగాకుంటే మరో ఊరు దునియానే మనిదిగాదురా."

"బాపు....అవునురా దునియాల మనంత ఇమాన్‌దార్ ఎవరుంటర్ మనంత బేఫికర్ ఎవరికుంటది?"

"అవు దునియాల మనతీరు ఉపాసమెవరుంటరు....మనతీరు పాసిపోయిన కూడు ఎవరుతింటరు. ఇప్పటిదాక నువ్వుజెప్పింది నేను యిన్న యిపుడు నేను జెప్పిందిగూడ నువ్వు యినాలె..... నిన్నటిసంది మనం ఏం దినలె. ఎందుకిట్ల ఉపాసముండాలె దాపోయి కష్టంచేస్కుని బతుకుదం."

## మనసు నిండింది

"ఛీ నీయవ్వ బిచ్చపోనికి బుట్టి బిచ్చమెత్తుకోను నామోస్సైందిరా నీకు."

"నేను పుట్టుడే బిచ్చపోనిగ బుట్టితే బిచ్చపోనికె పుట్టిందానికి నన్ను బిచ్చపోన్ని జేస్తున్నవ్ నువ్వు."

"అరె వారి....ఏందిర గిట్ల తయారైనవ్."

"అదిగాదు బాపు......ఒడ్లోడు ఏంజేస్తడు......"

"కట్టెపని...."

"అవ్ మరి ఆళ్లు కష్టంజేసి బతుకతల్లేరా. కుమ్మరోడేంజేస్తడు?"

"కుండల్ జేస్తడు."

"గదేబాపు నేను జెప్పేది కుమ్మరోడు, కమ్మరోడు, రజకుడు, వడ్డెరోడు అందరు ఎవరికి చాతనైన కష్టం వాడు జేసి బతుకుతాంటే దునియాల మనమేగి అడుక్కదినుడేంది? ఇన్నేండ్లు ఎట్లనో అడుక్కదిన్నవు. జనం సుత యిదివరకు తీరు దానధర్మాలు జేస్తలేరు. ఇగనన్నా మనం రెక్కలకష్టంజేసుకుని బతుకుదం."

............

"దా బాపు గా సెంటర్‌ల నుంచుని ఏ మేస్త్రిని బతిమిలాడుకున్న గింత పనిప్పిస్తడు. సా పోదం."

* * *

"అరె వారీ...."

"ఏంది బాపు.....కష్టమనిపిస్తుందా పెయి అలిసినట్టైందా-నామీద కోపమొచ్చిందా....?"

"లేదురా కొడుకా....రోజూ అడుక్కదింటే కడుపు సగంనిండుతుంటే.... ఇయ్యాల కష్టంజేసి సంపాదించుకుని తింటే.....నీయవ్వ....మనసే నిండిపోయింది గదరా....పుట్టి....పుట్టి గిన్ని దినాలాయె....ఎన్నడూ గింత తుర్తి (తృప్తి)గ దినలేదురా....ఇయాల......నాకెంతో సంబరంగ వుందిరా..."

"బాపూ....."

"అవుర కొడుకా.....సేతులున్నయి సెయిజాపి అడుక్కుంటానికిగాదురా.... సెమటోడ్చి పనిజేస్తానకని....నా కియ్యాలనే ఎర్కైందిరా - !!!"

# న్యాయచట్టం ప్రశ్నలు-జవాబులు

## అడ్వొకేట్: బి.భాస్కరరావు ఎం.ఎ.,ఎల్.ఎల్.బి.



నారుమళ్ళ భాస్కరలింగమూర్తి, న్యూ సంతోష్ నగర్, హైదరాబాద్ – 59.

ప్రశ్న · మాది రిజిష్టర్డ్ భాగస్వామ్యము గల ప్లాస్టిక్ పరిశ్రమ. మేము ఒక కంపెనీకి ఆరువేలు విలువ జేయు ప్లాస్టిక్ బాటిల్‌లను సప్లయి చేశాము. డబ్బు ఇవ్వలేదు. తదుపరి నిలదీసి అడుగగా రెండు పోస్టు డేటెడ్ చెక్కులు ఇచ్చినాడు. అవి బ్యాంక్‌లో ఆ తారీకు లలో ప్రజంట్ చెయ్యగా అతని ఖాతాలో డబ్బు లేదని వాపసు ఇచ్చివేశారు. మేము లాయర్ నోటీసు పంపగా లాయర్ ద్వారా జవాబు పంపించాడు. ఇక ప్రయోజనం లేదని మేము కోర్టు ద్వారా వారెంట్ ఇప్పించాము. కాని అతను మాత్రం కోర్టులో హాజరు కాలేదు. మీ సలహా తెలుప వలెను.

జవాబు : మీ కేసు కోర్టులో ఉన్నది గనుక ఇప్పుడు ఎటువంటి అభిప్రాయము వెల్లడించ కూడదు సబ్ జుడీస్ అవుతు ంది కదండి!

ఎస్. నాగేశ్వరరావు, మధిర (ఖమ్మం జిల్లా)

ప్రశ్న . 34 సంవత్సరములు దాటి పోతే ఉద్యోగము రాదు. కాని ఒకరికి మాత్రం ఉద్యోగం ఇచ్చారు మీ సమాధానం ఏమిటి?

జవాబు : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉద్యోగాలకు 34 సంవత్సరాల వయస్సు నిర్ణయించింది. ఎస్. సి., ఎస్. టి. అభ్యర్థులకు 34 సంవత్సరాలు దాటినా ఉద్యోగం ఇవ్వ వచ్చును. బహుశా ఎస్. సి లేదా ఎస్ టి వారికి ఆ ఉద్యోగం ఇచ్చి ఉంటారు. ఇక 34 సంవత్సరాల లోపల ఉన్న వారికి కూడా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో ఉద్యోగం దొరకదు. కారణం నిబంధనలు పాటించక పోవడమే. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ 1988లో గ్రూప్-2 బి. సర్వీసులకు పరీక్షలు నిర్వహించారు ఇంతవరకు పత్రికలలో ఫలితాలు వెల్లడి కాలేదు. గ్రూప్-1 సర్వీసులకు పోస్టులు ఖాళీలుగా ఉన్నా కొద్దిమందికే ఇంటర్వ్యూలకు పిలిచారు. సి.టి.ఓ., ఆర్.టి ఓ., డెప్యూటీ కలక్టర్ మొదలగు పోస్టులకు వాటి నియమావళి ప్రకారం 33న్నర శాతం పోస్టులకు డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ జరుపాలి. ఆ విధంగా పోస్టులు లెక్కకట్టి సెలక్షన్ జరుపాలి ప్రభుత్వ ఛీఫ్ సెక్రటరీయొక్క 4-10-1985 తేదీగల మెమో నెం 2029 (జి.ఏ డి ) లేఖలో ఒక సంవత్సరం దాటిన ఖాళీలు సర్వీస్ కమీషన్‌కు తెలియపర్చ మని ఆదేశాలు ఇచ్చినా, ప్రభుత్వ శాఖాధిపతులుగాని, ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్‌గాని పటి ంచుకోలేదు కాబట్టి ప్రభుత్వం అన్ని ప్రభుత్వ శాఖలకు వెంటనే ఆదేశాలు ఇచ్చి నిరుద్యోగులను నియమావళి ప్రకారం ఖాళీగా ఉన్న అన్ని ఉద్యోగాలలో నియమిస్తుందని ఆశిద్దాము!

పెయ్యల నరసింహమూర్తి, ఖేత్రినగర్, (రాజస్థాన్)

ప్రశ్న: నేను హిందూస్తాన్ కాపర్ కాంప్లెక్స్‌లో మెకానికల్ ఛార్జ్‌మేన్‌గా ఉద్యోగం చేస్తున్నాను. నా జన్మతేదీ 1-1-1944. మా పిన్ని కుమారుని జన్మ తేది నవంబరు 1944 నా తల్లి మరణించి నది. నాకు, మా పిన్న కుమారునకు ఒక సంవత్సరం తేడా వుంటుందని మా అమ్మ చెప్పినది. నన్ను పాఠశాలలో వేసినప్పుడు ఉపాధ్యాయులు నా పుట్టిన తేదీ తప్పుగా వ్రాసి యున్నారు. నేను సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగం చేస్తున్నాను. నా జన్మతేదీ మార్చుకొనుటకు మా న్యాయ సలహా కోరుచున్నాను.

జవాబు: మీరు జన్మించినప్పుడు మీ యొక్క పుట్టిన తేదీ మీ గ్రామం యొక్క రికార్డులో వ్రాయించనట్లయితే మీ పుట్టిన తేదీ మార్చమని కోర్టులో దావా వెయ్య వచ్చును. పుట్టిన తేదీ గురించి సుప్రీం కోర్టు ఉమేష్ చంద్ర కేసులో 1982లో ముగ్గురు జడ్జీలు గల సుప్రీం కోర్టు ఉమేష్ చంద్ర యొక్క పుట్టిన తేదీ మునిసిపల్ రికార్డులలో వ్రాయబడలేదు. గనుక భారతీయ సాక్ష్య చట్టము (1872)లోని 35 సెక్షన్ ప్రకారం స్కూలు రికార్డులను పరిగణనలోనికి తీసుకొనాలని తీర్పు చెప్పింది. కాబట్టి మీయొక్క పుట్టిన తేది గ్రామ పంచాయితీ యొక్క రికార్డులో వ్రాయబడినట్లయితే మీ పుట్టిన తేదీ మార్చమని మీరు కోర్టులో కూడా వెయ్యవచ్చును. ○

ఆంధ్రసచిత్ర వారపత్రిక

న్యాయ చట్టం-ప్రశ్నలు జవాబులు

ప్రశ్న: ..............................................................

పేరు: ..............................................................

పూర్తి చిరునామా: ..............................................................

..............................................................

# ఒక మరపురాని సంఘటన! — ఎన్.టి.ఆర్.

(గత సంచిక తరువాయి)

"చిరంజీవులు" చిత్రంలో నాకు కాంటాక్ట్ లెన్స్ పెట్టారు. భోజనం లేకుండా, నిద్రలేకుండా-పాత్ర మీద ఏకాగ్రతతో రాత్రీ పగలూ షూటింగ్‌లో పాల్గొనడం వలన, కంటి చూపు దెబ్బతింది. డి.యల్. గారు గాబరా పడిపోయారు. డాక్టరుగారి పరీక్ష తర్వాత కంప్లీట్ రెస్ట్ కావాలన్నారు. కదలకూడదన్నారు. పడుకొని నిద్రపోయాను. ఒకరోజు గడిచింది-మర్నాడు గడిచింది. నెమ్మదిగా కళ్లు తెరిచాను....అంధకారం.... అంతాగాఢాంధకారం. మూడవ రోజున 2 గంటలకు మెలకువ వచ్చింది. అప్పుడు కళ్లు తెరిస్తే... మిణుకు మిణుకు మంటూ చిన్న వెలుతురు కన్పించింది. నాకు ఆశ జనించింది. నాల్గవరోజు నాటికి మసక క్లియర్ అయింది. దాంతో దినసరి కార్యక్రమానికి ఉపక్రమించడం కోసం మూసివున్న తలుపు తెరిచాను. ఆవిడగారు (శ్రీమతి బసవరామ తారకం) అచేతనంగా-గుమ్మం దగ్గర కూలబడి వున్నారు. 'ఏమిటిలా పడుకున్నారు?' అని అడిగాను. గౌరవంగా 'దండి'- 'అండీ' అని సంబోధించడం-మా అలవాటు.



అమృతమూర్తి 'తల్లి' చేరువలో రామ లక్ష్మణులు (చిన్నప్పుడు శ్రీ రామారావు, శ్రీ త్రివిక్రమరావు)

'నటరత్న'తో ఆంధ్రపత్రిక సినీ స్పెషల్ రిపోర్టర్ శ్రీ ధీశెట్టి జరిపిన ప్రత్యేక ఇంటర్వ్యూ

"మీరు నిర్దయతో, నిర్దాక్షిణ్యంగా-మాకెవరికీ చెప్పకుండా, నన్నూ మరిచిపోయి మనోవేదనతో-ఒంటరిగా గెడవేసుకుని గదిలో వుండిపోతే మాకెలావుంటుంది?" అంటూ గుండెపగిలే వేదనతో దుఃఖంతో అన్నారామె. చలించిపోయాను. ఎక్కడికీ వెళ్లక, ఏమి చేయక, ఏమి చేయాలో తోచక కనీసం పచ్చిమంచినీళ్లు కూడా ముట్టకుండా- నా ఆరోగ్యం కోసం-అల్లాడిపోయినామెలో-అర్ధాంగేకాదు... అనురాగం నిండారిన ఓ దేవతా మూర్తి కన్పించింది. 'జీవన సహభాగిని' అనే పదానికి అంకితమైన భావంతో కూడిన ఆ పుణ్యస్మృతి-ఆనాటి నుండీ నాలో అలాగే నిలిచిపోయింది. ఆరోజు నుండీ ఏ విధమైన సంస్కృతిని కాపాడుకోవాలి- గౌరవాలు నిలువుకోవాలి అన్నది - నామనస్సును స్పందింపజేసిన మరపురాని....మధుర సంఘటన..." అన్నారు శ్రీ రామారావు గారు.

మహాసాధ్వి-బసవరామతారకంగారంటే ఆయనకు ఎంతటి గౌరవమో-ఎంతటి ఆరాధనా భావమో-ఆ పుణ్యపురుషుడు చెప్తోంటే-

ఆ దొడ్డ ఇల్లాలికి-పూజ్యభావంతో మనసులోనే జోహార్లర్పించాను-నేను.

పధ్నాలుగు మంది బిడ్డల్లో ముగ్గురు పోయినా, పదకొండు మంది సంతానాన్ని పెంచి-పోషించి- పెద్దజేసి, వాళ్ల ఆలనా, పాలనా చూసి, సిరినీ-సంపదనూ సమతూకాలపై అనుభవించి, తన పతిదేవుని ఉన్నతినీ-మహోన్నతినీ కళ్లారా గాంచి, తన బాధ్యతలు తీరాయని తెలుసుకొని, కన్న బిడ్డల కన్నీటి జాలులో స్నానాలు చేసి, కట్టుకున్న పతిదేవుని అనురాగ సుమమాలలు నిండారా ధరించి-ముక్తిగతులను వెదుకుతూ, పుణ్యలోకాలకు సుమంగళిగా తరలి వెళ్లిన ఆమె- ఎంతటి భాగ్యశాలి....! ఎంతటి పుణ్యశీలి....!!

'మల్లీశ్వరి'లో



అందుకే-
ఈనాటికీ ఆ దేవతామూర్తి-
నిత్య ధూప-దీప-నైవేద్యాలతో
"నందమూరి వారి ఇలవేలుపుగా"
కొడుకుల్లా, కోడళ్లూ-కూతుళ్లు, అల్లుళ్లూ-మనవళ్లూ, మునిమనవలతో పాటు - అన్నింటినీ మించి- "కొండంత దేవుని" అనురాగ గుడిలో ఓ అంతర్యామిగా- ఆరాధనలందుకోవడం-ఎన్నిపూజల వరమో...! ఎన్ని జన్మల పుణ్యమో.....!

## 'నటరత్న' చిత్రరత్నాలు

*1949* నుంచి *1982* వరకు ఎన్టీఆర్ నటించిన చిత్రాలు మొత్తం *292.*

- తెలుగు-*274*
- తమిళం-*15*
- హిందీ-*3*
- వీటిలో-పౌరాణికాలు-*42*
- జానపదాలు-*55*
- చారిత్రకాలు-*11*
- సాంఘికాలు-*184*

శ్రీ రామారావు 'విశ్వవిఖ్యాత నట సార్వభౌమ' కావటానికి 'నటరత్న'గా, కోట్లాది మంది అభిమానులకు ఆరాధనా హీరో కావడానికి ఆయన నటించిన చిత్రాల్లో కళాఖండాలు-కళా వైభవాలు-వజ్ర వైఢూర్యాల్లాంటి మేటి చిత్రాలు లెక్కకు మిక్కిలిగా వున్నాయి.

## ప్లాటినమ్ జూబ్లీ.....

*1963-64*లో విడుదలైన "లవకుశ" *75* వారాలు ప్రదర్శింపబడింది.

## గోల్డెన్ జూబ్లీ (50వారాల) చిత్రాలు

- *1951*-పాతాళభైరవి
- *1956*-నయాఆద్మీ (హిందీ)
- *1977*-అడవిరాముడు
- *1979*-వేటగాడు
- *1983*-బొబ్బిలిపులి
- -సంపూర్ణరామాయణం(మళయాళం)

సిల్వర్‌జూబ్లీ(*25*వారాల)చిత్రాలు-*33*

శతదినోత్సవ చిత్రాలు-*140*



'బడిపంతులు'లో

## అవార్డు పొందిన ఎన్టీఆర్ చిత్రాలు...

*1954*-తోడుదొంగలు-రాష్ట్రపతిప్రశంసాపత్రం పొందిన మొదటి చిత్రం. *1956*-రాష్ట్రపతి రజితపతకం పొందిన చిత్రం- "తెనాలి రామకృష్ణ". *1957*-రాష్ట్రపతి ప్రశంసాపత్రం పొందిన చిత్రం-"భాగ్యరేఖ". *1958*-రాష్ట్రపతి ప్రశంసాపత్రం పొందిన చిత్రం "శోభ". *1961*-రాష్ట్రపతి ప్రశంసాపత్రం పొందిన పౌరాణికచిత్రం- "సీతారామకళ్యాణం". *1962*-రాష్ట్రపతి రజిత పతకము పొందిన చారిత్రాత్మక చిత్రం- "మహామంత్రి తిమ్మరుసు". *1963*-రాష్ట్రపతి రజితపతకములు పొందిన చిత్రరాజములు-"లవకుశ", "నర్తనశాల", "కర్ణ"-(తమిళం).

*1964*-రాష్ట్ర ప్రభుత్వంచే కంచు నంది అవార్డు పొందిన సాంఘిక చిత్రం "గుడిగంటలు". *1965*-రాష్ట్ర ప్రభుత్వం వారిచే వెండి నంది అవార్డు పొందిన చారిత్రాత్మక చిత్రం- "పల్నాటి యుద్ధం". *1966*-రాష్ట్ర ప్రభుత్వంచే వెండి నంది అవార్డు పొందిన పౌరాణిక చిత్రం-"శ్రీకృష్ణపాండవీయం". *1969*-ప్రాంతీయ ఉత్తమ చిత్రం-'వరకట్నం'.*1969*-రాష్ట్రప్రభుత్వం -బంగారునంది అవార్డు పొందిన చిత్రం "కథానాయకుడు". *1970*-రాష్ట్ర ప్రభుత్వంచే నంది అవార్డు పొందిన చిత్రం- "కోడలు దిద్దిన కాపురం". *1971*-రాష్ట్ర ప్రభుత్వంచే వెండి నంది అవార్డు పొందిన చిత్రం "శ్రీకృష్ణసత్య". *1972*-ప్రప్రథమంగా ఫిలిమ్‌ఫేర్ 'ఉత్తమ నటుని' అవార్డు చిత్రం- "బడిపంతులు". *1975*-రాష్ట్ర ప్రభుత్వంచే కంచు నంది-ప్రప్రథమంగా వినోదపు పన్ను మినహాయించిన తొలి తెలుగు చిత్రం "తీర్పు".

'రారాజు'గా



మీ పంటపొలాలను సారవంతం



త్వరలోనే మీకు ఆసక్తికరమైన
భవిష్యత్తు తేబోతోంది.



108 కోట్ల రూపాయల
ఈక్విటీ షేర్ ఇస్యూ


ఆంధ్ర ప్రదేశ్‌కి గర్వకారణమైన

పెట్టుబడిదారులు ప్రాస్పెక్టస్‌లోని వివరాలను చదివి పెట్టుబడి నిర్ణయాలను తీసుకోవాలని కోరుతున్నాం

# చేసిన ఆ కంపెనీయే...

మీ యూరియా కోసం మీరెప్పుడు నమ్ముకున్న నాగార్జున కంపెనీ ఇప్పుడు కల్పిస్తోంది మీకోసం మరో ఆసక్తికరమైన అవకాశం **నాగార్జున ధన సాగర్** పెట్టుబడికిది చక్కని అవకాశం అంటే సమృద్ధియైన సంపద అన్న మాట నాగార్జున షేర్లలో పెట్టుబడి పెట్టండి మీకోసమే ప్రత్యేకంగా నిర్మించబడుతున్న భారీ ఎరువుల కర్మాగారానికి సొంతదారులనుండి బంగారు పంటను పండించుకోండి

ఇంకా వివరాలకోసం మీకు దగ్గరలోగల బ్యాంక్ లేదా నాగార్జున యూరియ డిస్ట్రిబ్యూటర్‌తో సంప్రదించండి



## నాగార్జున ధనసాగర్

**పచ్చని పొలాలు. బంగారు భవిష్యత్తు.**

NFCL నాగార్జున ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్.

**ఇష్యూకి ముఖ్యమైన సంస్థలు :**

SBI Capital Markets Limited
**SBI Capital Markets Ltd.**
Bombay

CANBANK FINANCIAL SERVICES LTD
Hyderabad

**Indbank**
Merchant Banking Services Ltd
Madras

J M Financial & Investment Consultancy Services Ltd
Merchant Banking Division
Bombay

# నాగార్జునలో పెట్టుబడి పెట్టండి

NAG P 10 23.4

## 'నటరత్న'తో ఇంటర్వ్యూ



ఎం జి రామచంద్రన్‌తో .



కుటుంబ సభ్యులతో

1951 మార్చి 15న విడుదలైన "పాతాళభైరవి"- 1952లో జరిగిన ప్రపంచ చలనచిత్ర ప్రదర్శనోత్సవానికి ఒకే ఒక్క తెలుగు చిత్రంగా దక్షిణ భారతం నుండి ఎన్నిక కావడం విశేషం-

### బంగారు మనిషి

"మనదేశం"నుండి "నాదేశం" వరకు 292 చిత్రాల్లో నటించిన- శ్రీ రామారావు-

తోటరాముడైనా-అగ్గిరాముడైనా
గుండమ్మకు అల్లుడైనా-మిస్సమ్మకు మొగుడైనా
కేడీ నెంబర్‌వన్ అయినా
హీరో నెంబర్ వన్ ఆయనే....
అందుకే-
ఆయన-
ఓ వేటగాడు-
ఓ బొబ్బిలిపులి.
ఓ కొండవీటి సింహం.
ఓ సర్దార్ పాపారాయుడు
ఓ జస్టిస్ చౌదరి
ఓ...బంగారు మనిషి.....

******************

"ఇంత వరకూ మీరు ధరించని పాత్ర అంటూ లేదు. కాని...."బొబ్బిలిపులి"- "సర్దార్ పాపారాయుడు"- "కొండవీటి సింహం"- "జస్టిస్ చౌదరి" లాంటి మహత్తర సాంఘిక చిత్రాల్లో మిమ్మల్ని మళ్లీ మళ్లీ చూడాలని లక్షలాది మంది ప్రేక్షకులు ఉవ్విళ్లూరుతున్నారు. ప్రేక్షక మనోభిరామునిగా మీ అభిప్రాయం ఏమిటి? ఆ అవకాశమూ, అదృష్టమూ వుందంటారా?- అని ప్రశ్నించాము."

ఆ ప్రశ్నకు శ్రీ రామారావుగారి వదనం-ఒక్కసారి ప్రఫుల్లితమైంది!

జవాబు చెప్పసాగారు!

అదేమిటో చదవండి....

వచ్చేవారమే

○

# చిత్రపు నారాయణమూర్తిగారి దర్శకత్వంలో
## 1942లో విడుదలైన
# శోభనాచల పిక్చర్స్‌వారి 'భక్త ప్రహ్లాద'

గగ్గయ్య, రామకృష్ణశాస్త్రి, వద లక్ష్మి, పరిపూర్ణ, కుంపట్ల నారాయణ రావు లాంటి సుప్రసిద్ధ తారాగణం నటించిన, శోభనాచల పిక్చర్స్‌వారి "భక్తప్రహ్లాద" చిత్రం 1942 జనవరి 30న అన్ని కేంద్రాల్లోనూ విడుదలైంది.

బ్రహ్మాండమైన సెట్టింగులతోనూ-మృదుమధుర గానాలతోనూ- నిండివున్న యీ చిత్రం ఆంధ్రుల ముదమును పొందగలదనుటలో ఎట్టి సందేహమూ లేదు.

చిత్రపు నారాయణమూర్తిగారు దర్శకత్వమున-నిర్దుష్టముగా తయారింపబడినయీ చిత్రము ఆంధ్రుల మెప్పు బడయగలదు!

హరి-నారసింహావతారమున, లోక కంటకుడు హిరణ్యకశిపుని తుద ముట్టించిన పవిత్ర గాథ యిది.

అవతారాల్లో-ఉత్తమ అవతారము- నారసింహావతారమని-ఆది శంకరులు స్తుతించారు.


ఎందుకనగా-

వగనైనా-పగనైనా-హరిని సేవించిన వారికి ముక్తిగలదని-ఋజువు పరిచింది-యీ అవతారమే.

హరి-సర్వాంతర్యామియై-సర్వజీవకోటియందు-అచలములగు స్తంభములయందు సహితము గలడని, నిరూపించింది- యీ అవతారమే....! భక్తకోటిని హింసించు వారిని హరి మనసీయడని-తేటతెల్లము జేసినది-యీ అవతారమే....!

అందువల్లనే-

భూమ్యాకాశాల యందును, రేయింబవళ్ల యందును, అస్త్రశస్త్రముల చేతను, నరుల చేతను, మృగముల చేతను చావకుండా బ్రహ్మతో వరాలు పొందిన కశిపుని- రేయింబవలు కాని-సంధ్యవేళ, నరుడు-మృగమూ కాని - నారసింహావతారము, భూమ్యాకాశాలు గాని- సింహద్వారమున, అస్త్రశస్త్రములు గాని నఖాగ్రముల చేత-తుదముట్టించాడు.....




'ప్రహ్లాద' చిత్రం...

30-1-42న విజయవాడ-దుర్గాకళా మందిరంలోనూ, నెల్లూరు-వినాయక్‌లోనూ, 6-2-42న గుంటూరు-సరస్వతీ టాకీస్‌లోనూ, తెనాలి-సత్యనారాయణ టాకీస్‌లోనూ విడుదలైంది.

ఆంధ్ర - నైజాం దత్తమండలములకు డిస్ట్రిబ్యూటర్స్-పూర్ణాపిక్చర్స్-బెజవాడ.

మైసూరు రాష్ట్రానికి- హేమలతా పిక్చర్సు - బెంగుళూరు.

(పై సమీక్ష 14వ తేదీ మార్చి 1942లో ఆంధ్రపత్రికలో ప్రచురించబడింది.)

సేకరణ: భీశెట్టి

## అలనాటి మేటి చిత్రాలు- (11)

# సినిమా.. సినిమా..



## "మైనర్ రాజా"

### రాజేంద్రప్రసాద్

"నూతన వత్సరానికి స్వాగతం చెప్తూ ప్రతి ఏడూ డిసెంబర్ 31 రాత్రి సరిగ్గా పన్నెండు గంటలకు ప్రతి చిత్రాన్నీ నేను ప్రారంభించడమూ, అది సూపర్ హిట్ అవడమూ మామూలు. "మైనర్ రాజా"కు తమిళంలో ఘనవిజయం సాధించిన 'మల్లువేట్టి మైనర్' ఆధారం... కడుపుబ్బనవ్వించే పూలరంగడు పాత్ర రాజేంద్రప్రసాద్‌ది. తమిళంలో నటించిన శోభనే తెలుగులోనూ నటిస్తుంది. యమున మరో నాయిక," అన్నారు ఇంతవరకు 97 చిత్రాలకు దర్శకత్వం వహించి, త్వరలో గిన్నీస్‌బుక్‌లోకి ఎక్కబోతున్న ఎ.వి.శేషగిరి. ఈయన దర్శకత్వంలో మగ్గినేని శ్రుతి సమర్పించే రాకేష్ ప్రొడక్షన్స్ 'మైనర్ రాజా' చిత్రంలో కోట శ్రీనివాసరావు, రాళ్ళపల్లి, సుత్తి, సంజీవి, డాక్టర్ శివప్రసాద్, ఏమారి ప్రభృతి నటవర్గం. కలైమణి కథకుడు. వేటూరి, జాలాది గీతాలకు విద్యాసాగర్ ఇంపైన బాణీలు కూర్చారు. "రాజమండ్రి సమీపంగా ఉన్న రాజోలులో ఒకే షెడ్యూల్‌గా జనవరి నెలాఖరుకు




షూటింగ్ పూర్తవుతుంది," అన్నారు. ఈ చిత్ర నిర్మాత పెనిగళ్ళ రాంబాబు.

## "నడుస్తున్న చరిత్ర"

"కొందరు రౌడీలుగా తమకు తామే మారుతున్నారా– లేక, మార్చబడుతున్నారా? కొట్లాటల్లో వాళ్ళు చనిపోతున్నారా లేక చంపబడుతున్నారా అన్న అంశాల ఆధారంగా నిర్మించబడే చిత్రం. 'కర్తవ్యం' ఫేమ్ ఆట్లూరి పుండరీకాక్షయ్య ఈ చిత్రంలో నాగళ్ళ భోగేశ్వరరావుగా ఒక క్లిష్టమైన పాత్ర ధరిస్తున్నారు. నటి సీత తమ్ముడు రాజ్‌మోహన్ హీరో. 'అడవి దివిటీలు' నాయిక శాంతిలత హీరోయిన్. 'జననీ జన్మభూమి' 'ముద్దుల చెల్లెలు'లో నటించిన ఈ చిత్ర నిర్మాత రామోజీ కూడా ఒక వినూత్నమైన పాత్ర ధరిస్తున్నారు," అన్నారు పంచాననా ప్రొడక్షన్స్ "నడుస్తున్న చరిత్ర" చిత్రానికి తొలిసారిగా దర్శకత్వం నెఱపే కారుమూరి. ఈయన గతంలో కట్టా సుబ్బారావు, డి. ఎస్. ప్రకాశరావు, ఎన్. రామచంద్రరావుల వద్ద అసోసియేట్‌గా పని చేశారు. బో సుబాబు సంగీతం, ఎం. ఎల్. స్వామి ఛాయ, ద్వారకానాథ్ నృత్యాలు, రమేష్ సాహసాలు, గురుచరణ్– కోశాని సుబ్బారావు గీతాలు, ఎ. మోహన్ ప్రొడక్షన్, టి. చిన్న కూర్పుతో ఈ చిత్రాన్ని నిర్మించే రామోజీ "నవంబర్ 23 నుండి విశాఖపట్నంలో ఒకే షెడ్యూల్‌లో షూటింగ్ పూర్తవుతుంది," అన్నారు.

## కొండముది "మంజీరనాదం"

"మానవతా విలువల కోసం ఉద్దేశించిన నా నవల 'సింహకాంతం' వార పత్రికలో సీరియల్‌గా బహుముఖ ప్రశంసలందుకుంది. దీనినే 'మంజీర నాదం'గా రూపొందిస్తున్నాం. నవంబర్ 14 నుండి నెలాఖరు వరకు అమలాపురం ప్రాంతాలలో, డిసెంబర్ 3వ వారంలో వేదాద్రి, కీసర పరిసరాలలో రెండు షెడ్యూల్స్‌లో షూటింగ్ పూర్తవుతుంది." అన్నారు కొండముది శ్రీరామ చంద్రమూర్తి. ఈయన కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో బి. ఎ. సీతారాం నిర్మిస్తున్న చిత్రంలో మురళీమోహన్ (గెస్ట్) శరత్‌బాబు, భవానీశంకర్, వేలు, సాక్షి, వంకాయల, రావి కొండలరావు, మల్లికార్జునరావు, పొట్టి ప్రసాద్, బ్రహ్మానందం, టెలిఫోన్ సత్యనారాయణ, చిట్టిబాబు, హేమసుందర్, రాజసులోచన, విజయదుర్గ ఆదిగా గల వారు పాల్గొంటారు. నిర్మాణ సారథ్యం : రామబ్రహ్మం. గీతాలు : సి. నారాయణరెడ్డి, వేటూరి, సీతారామశాస్త్రి. ఛాయ : ఫోటో కె. నాయుడు. నృత్యాలు : శేషు, కోరాడ నరసింహరావు. కూర్పు : జి. జి. కృష్ణారావు. ప్రొడక్షన్ : మోహన్.

–జి. వి. జి.

సీరియల్




# ప్రణయవల్లరి

## యర్రమంట్ల వరలక్ష్మిదేవి

**ఇంతవరకూ సాగినకథ-15 :** నాటకాలపిచ్చివున్న రామకృష్ణ-గణపతి స్నేహితులు. లా చదివేందుకు అలహాబాద్ వెళ్లిన రామకృష్ణకు సిన్హా, రబీన్ స్నేహితులవుతారు. నవనీతపై లేనిపోని నిందలు మోపి ఆమెకు వచ్చిన పెళ్లి సంబంధాన్ని కామేశం చెడగొడతాడు. టి. బి. సోకిన నవనీతకు రామకృష్ణ వైద్యం చేయిస్తూ, ఆ కుటుంబానికి సన్నిహితుడవుతాడు. రామకృష్ణ -నవనీతను పెండ్లి చేసుకోవాలన్న తన నిర్ణయాన్ని గణపతికి తెలియచేస్తాడు.

(గత సంచిక తరువాయి)

రామకృష్ణ అనుకున్నట్లుగానే నవనీతను మదనపల్లి తీసుకుని వెళ్ళి అక్కడున్న టి. బి. శానిటోరియంలో ఆమెను చేర్పించేడు.

డాక్టరు పరమేశంగారు వ్రాసిచ్చిన ఉత్తరాన్ని అక్కడున్న డాక్టరు గోపాల్‌గారికివ్వగానే అతను ఎంతో సహృదయంతో వారికి ఎంతో తోడ్పడ్డాడు అంతేకాదు నవనీతకు మంచి ట్రీట్‌మెంటు ఇవ్వడం జరుగుతుందని ఎనిమిది నెలల్లో ఆమె సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి వెళ్లేటట్లు చూస్తానని మాటిచ్చాడు ఆమెకు ఓ స్పెషల్ క్యాబిన్ ఏర్పాటు చేసేడు. ఆమె తండ్రి పరంధామయ్య ఉండడానికి శానిటోరియం దగ్గర్లోనే ఉన్న లాడ్జిని కుదిర్చి పెట్టేడు. అక్కడ కట్టవలసిన డబ్బును రామకృష్ణ కట్టేడు. పైగా నవనీతను శ్రద్ధగా చూసేందుకై అక్కడున్న వారికి ముట్టజెప్పవల్సింది చేసేడు

అన్ని ఏర్పాట్లు జరిగేక తృప్తిగ గణపతిని తీసుకుని తిరుగు ప్రయాణమయ్యాడు నవనీత తన క్యాబిన్‌లో రామకృష్ణతో విడిగ మాట్లాడింది.

'మీకు నా మీద ఇంకా కోపం పోలేదు కదండి?''

"కోపమా?- ఎందుకు?" రామకృష్ణ ఆశ్చర్యంతో అడిగేడు.

"నేను ఆనాడు మీరు వ్రాసిన ఉత్తరానికి సరైన జవాబు వ్రాయలేదని మీరు కోపగించుకుని నా ఉత్తరాన్ని ముక్కలు చేసి తిరుగు టపాలో పంపించేరు గుర్తుందా? అందుకే మీరు అలహాబాద్ వెళ్లేక నా గురించి గణపతికి వ్రాసి తెల్సుకున్నారు గాని నాకు వ్రాయలేదు-ఏం''

"అదేమీ కాదు- మీకు నేరుగ వ్రాసి, వచ్చిన జవాబుల్ని చదువుతుంటే నా మనస్సు కలత చెంది నా చదువు పాడవుతుందని, అందుకే లేనిపోని అపోహల్ని పెట్టుకుని మనస్సును పాడు చేసుకోకండి. నా చదువు అయిపోగానే నేను ఇక్కడకు వచ్చి మిమ్మల్ని చూస్తాను. ఈలోగా మీరు పూర్ణ ఆరోగ్యాన్ని పొందుతారనుకుంటా- డాక్టర్లు హామీ ఇచ్చేరు''.

"రామకృష్ణగారు నాదో ప్రార్థన.నన్ను 'నవనీత' 'నువ్వు' అంటే నేను మీకు ఆప్తురాలుగ భావన చెంది తృప్తి చెందుతాను. దయచేసి ఆ 'గారు', ఆ 'మీరు' వదిలేయండి'.

రామకృష్ణ ఓసారి ఆదరణగ ఆమె ముఖంలోకి చూచి, "అలాగే" అన్నాడు రామకృష్ణ బై బై చెప్పేసి కదలిపోతుంటే నవనీత హఠాత్తుగ అతని రెండు చేతుల్ని పట్టుకుని కన్నీళ్లతో- "నేను మళ్లీ మిమ్మల్ని చూడగలనంటారా- నా ఈ దేవుణ్ని?" అంది

రామకృష్ణ ఆమె కన్నీళ్లని తుడిచి, "తప్పకుండా మనం ఆరు నెలలు గడిచేక కలుస్తాం మరే భయం పెట్టుకోకు నవనీత," అని ప్రేమతో తల నిమిరి కదిలేడు

### (22)

రామకృష్ణ అలహాబాదుకు తిరిగి వచ్చి మళ్లీ చదువులో శ్రద్ధగా నిమగ్నుడయ్యేడు ఒక గురి కుదిరేక రామకృష్ణ సాధనలో లోపముండదు రామకృష్ణ, రబీన్, దేవేంద్ర చాల పట్టుదలతో చదువుతున్నారు

ప్రతి పదిహేను రోజులకు గణపతి నుండి అన్ని విషయాలు రామకృష్ణకు తెలుస్తుండేవి అలా మూడు నెలలు

గడిచేక గణపతి నుండి ఓ లేఖ వచ్చింది-

"రామకృష్ణ! నువ్వు ఈ దైవ పరీక్షలో నెగ్గుతున్నావు నేను వారం క్రితం మదనపల్లి వెళ్ళి వచ్చేను నవనీతగారు చాల మార్పు చెందేరు ఆమె వ్యాధి నయమవుతూంది మునుపున్న కళాహీనత ఇప్పుడు లేదు. ఆమెలో ఎంతో ఉత్సాహం కనిపిస్తూంది అప్పుడున్న నిస్పృహ, నిరాశ ఇప్పుడు లేశమైనా లేవు ఆమె ఎంతో ఆశతో భవిష్యత్తు గురించి మాట్లాడుతూంది ఆమె విశాఖపట్నంలో వ్రాసిన ఎమ్ ఎస్ సి ఫైనల్ ఇయర్ పరీక్ష రిజల్ట్సు వచ్చి ఆమె మంచి మార్కులతో పాసయిందని తెలిసింది ఇప్పుడామె డాక్టర్లు అనుమతించినప్పుడల్లా పుస్తకాలను తీసి చదువుతూంది ఆమె వచ్చే సంవత్సరం నేషనలైజ్డ్ బ్యాంకు ఆఫీసర్ల టెస్టులను వ్రాస్తానంటూంది. ఆమెకు శ్రద్ధుంది. ఈలోగా శానిటోరియంలోంచి బయట పడగలనంటూంది.

"డాక్టర్లను కలసి మాట్లాడేను నెలకోసారి ఆమెకు ఎక్స్‌రే ఫోటో లను తీసి, అన్ని పరీక్షలూ చేసి వ్యాధినయమవడం గమనిస్తున్నారట ఆ ప్రకారంగ చికిత్సను మార్చుకుంటు పోతున్నారుట. మరో అయిదారు నెలలకు ఆమె పూర్తిగ ఆరోగ్యవంతురాలై ఇంటికి పోగలదన్న ఆశను వారు వ్యక్తపరిచేరు. పరంధామయ్య గారు నవ్వగలుగుతున్నారు అతని ముఖం లోని విషాద చాయలు తొలగి పోతున్నాయి.

"వారక్కడ మంచి బలమైన ఆహారాన్ని నవనీతగారి కిస్తున్నారు; మంచి మందులిస్తున్నారు సరైన వేళలకు అక్కడున్న చక్కని వెలుతురు, నిర్మలమైన గాలి ఆమె రోగ నివారణకు ఎంతగానో తోడ్పడు తున్నాయి

"రామకృష్ణ! నీ మనస్సు ఉదాత్తమైనది అందుకే నీ దయను పొందిన వారంత అదృష్టవంతులై



# ఒంటెలు నీటిని నిలువ చేసుకుంటాయా?

## తెలుసుకోండి

–అవును. ఒంటెలకున్న మూపురాల లోని తిత్తులలో అవి నీటిని నిలువ చేసుకొని మూడు నాలుగు రోజుల దాకా నీరు త్రాగ నక్కరలేకుండా ప్రయాణం చేయగలవు. ఒకొక్కప్పుడు ప్రయాణీకులు నీటి యెద్దడి వల్ల ప్రాణ రక్షణకు ఒంటెలను చంపి ఈ నీటిని త్రాగుట కూడా కద్దు. దక్షిణ అమెరికా లోని అరిజోనా ఎడారిలోని కాక్టసు ముళ్ళ చెట్లను నరికి, కాండము లోని ముద్దను పిసికి గొట్టములతో రసమును పీల్చుకు త్రాగడం కూడా మామూలే. ఆస్ట్రేలియా యెడారులలో ఒక జాతి కప్పకు పెద్ద పెద్ద మూత్రాశయాలుంటాయట. వాటిలో నిర్మల మైన నీరు దాచుకుంటాయట ఆ కప్పలు. ఆదిమ వాసులు ఈ నీటిని తాగి ఒక్కొక్కప్పుడు దాహము తీర్చుకుంటారట. ○

తిరుతారు. అది నా నమ్మకం. నువ్వు వచ్చేసరికి నవనీతగారు ఎంతో ఆరోగ్యంగ, అందంగ, ఆనందంతో ఎదురౌతారు- చూద్దువు గాని. నువ్వు చాల శ్రద్ధగ చదువుతున్నావనుకుంటా. మా రామకృష్ణ యూనివర్సిటీకే గర్వ కారణమవాలని కోరుకుంటున్నా".

రామకృష్ణకు ఆ ఉత్తరంలోని విశేషాలు ఎంతో సంతోషాన్ని కలిగించేయి. కాలం త్వరగ పరుగెడ్తూంది. మరో నాలుగు నెలలకు ఫైనల్ పరీక్షలు జరిగేయి. చాల బాగా వ్రాసేనన్న తృప్తితో రామకృష్ణ ఆఖరి రోటున పరీక్షానంతరం హాస్టలుకు తిరిగి వచ్చేడు.

రెండు రోజులు స్నేహితులు ముగ్గురు మత్తే బరువు, బాధ్యత లేకుండ స్వేచ్ఛగ గడిపేరు. హాస్టలులోని మరి కొందరు సన్నిహితులు ముందటి రోజున ఓ చిన్న 'ఈట్ అండ్ డ్రింక్' పార్టీని ఏర్పాటు చేశారు. ఆ పార్టీలో ఈ ముగ్గురు హాల్గొనక తప్పలేదు. సాయంత్రం యేడు గంటలకు మొదలైన పార్టీ, రాత్రి ఒంటి గంట వరకు చాల ఉల్లాసంగ సాగిపోయింది.

ఏమేమి తిన్నారో, ఏమేమి త్రాగేరో వాళ్ళకే తెలియదు. రామకృష్ణకు, రబీన్‌కు ఈ హార్డ్ డ్రింక్స్ కొత్త. ఎప్పుడు వాటి పరిచయమవలేదు.వినడమే గాని ముందుగ బీరుతో మొదలెట్టి, మధ్యలో జిన్ కాస్త పుచ్చుకుని, ఆఖరికి విస్కీతో ముగించేరు. ముందుగ రబీన్, తరువాత రామకృష్ణ. తరువాత దేవేంద్ర ఒరిగిపోయి ముడుచుకుని పోయి గాఢ నిద్రమత్తులో పడిపోయేరు.

తత్ ఫలితంగ ప్రొద్దున్న లేచేసరికి తల బద్దలైపోతూంది. రెండేసి గ్లాసుల లస్సీ త్రాగి, ఒకొక్క సారిడాన్ మాత్ర వేసుకుంటే గాని మామూలు మనుష్యులు కాలేకపోయేరు. సరే అదొక అనుభవం-బుద్ధొచ్చింది, ఇక ముందు జాగ్రత్త పడదాం అనుకున్నారు ఆ ముగ్గురు మిత్రులు.

ఆ మరునాడు సామాన్లను, పుస్తకాలను తీసుకుని ప్రయాణ మయ్యారు. రబీన్ చటర్జీ కలకత్తా మిదుగ మిడ్నాపూర్ తోతానని బయలుదేరేడు. రామకృష్ణ, దేవేంద్రసిన్హా సార్‌నాథ్ ఎక్స్‌ప్రెస్‌లో కట్నీ మిదుగ రాయపూర్‌కు వెళ్ళేరు. అక్కడ దేవేంద్ర సిన్హా దిగిపోగా, రామకృష్ణ రాయపూరు నుండి లింక్ ఎక్స్‌ప్రెస్‌లో విశాఖపట్నం వెళ్ళిపోయేడు.

సంవత్సరం తరువాత కొడుకు మళ్ళీ కనిపించినందుకు రామకృష్ణ తల్లి సంతోషించింది. కొడుకు చదువు పూర్తి చేసుకొని ఇంటికి వచ్చినందుకు, ఇక ముందు తన కళ్ళ ముందే తిరుగాడుతాడని ఆ తల్లి ఎంతో సంబరపడిపోయింది.

"పరీక్షలు చాల బాగా వ్రాసేను మామయ్యా. తప్పకుండ ఫస్ట్‌క్లాస్ వస్తుంది."

"చాల సంతోషం రాముడు. ఇక ఈ బాధ్యతంతా నీకు అప్పజెప్పి, నేను మీ అత్త కెనడా వెళ్ళిపోగలము. ముందు నీ డిగ్రీలు రావాలి, నువ్వు ప్లీడరు పట్టా పొందాలి. ఇవన్ని అయేసరికి ఎలానైన మరో నాలుగు నెలలు పట్టుతాయనుకుంటా."

"అన్నయ్యా! నువ్వు మన రాముడు పెండ్లి అయేవరకు ఉండవల్సిందే. వాడు ఓ ఇంటివాడై, ప్లీడరి చేస్తుంటే గాని నీకు విడుదల ఉండదు" అంది రామకృష్ణ తల్లి చిరునవ్వుతో.

"అలాగయితే నా ప్రయాణం వాయిదా పడినట్లే. రామం నువ్వు త్వరగా పెండ్లి చేసుకో.చక్కని పిల్లను చూడమన్నావా, లేక ఈసరికే నువ్వే పిల్లనైన ఎంపిక చేసి ఉంచేవా?" అడిగేడు నరసింహం మామయ్య ఉషారుగ.

రామకృష్ణ గతుక్కుమన్నాడు, కాని ఓ క్షణంలో తేరుకుని–

"ఇప్పుడంత తొందరేమొచ్చింది మామయ్యా. కొన్నాళ్ళు పోని నువ్వే ఎంపిక చేసి నాకు చెప్పువుగాని," అనేసేడు.

రామకృష్ణ రెండు రోజులు ఇంటి వద్దే ఉన్నాడు. రామకృష్ణ వచ్చిన మరునాడే గణపతి వచ్చి రామకృష్ణను కలిసేడు. ఇద్దరు మేడ మీద రామకృష్ణని గదిలో కూర్చుని మాట్లాడుకున్నారు.

"రామకృష్ణా! నేను నెల్లాళ్ళ క్రితం రెండోసారి మదనపల్లి వెళ్ళివచ్చేను. నవనీతగార్ని ఇప్పుడు చూస్తే వెంటనే పోలిక పట్టలేవు. అంతగ మార్పుంది. ఆ వ్యాధి నయమయిపోయినట్లే. ఇప్పుడు ఆమె ఆరోగ్యంగ ఉంది. ఒంటికి మంచి ఛాయ, కాంతి వచ్చేయి. ఇప్పుడిప్పుడే ఆమె కాస్త ఒళ్ళు చేస్తూంది. డాక్టర్లు

ఆమె ప్రోగ్రెస్‌కి సంతోషిస్తున్నారు. నవనీతగారు మాటి మాటికి నీ గురించే అడుగుతున్నారు. నన్నెంతో ప్రాధేయపడ్డారు, నీకు వ్రాయమని. తనకి నువ్వు ఉత్తరం వ్రాస్తే అన్ని వివరాలతో జవాబిస్తానని చెప్పేరు. తను తొందరపడి నేరుగ నీకు ఉత్తరం వ్రాస్తే నువ్వెక్కడ కోపగించుకుంటావో నని భయపడుతున్నట్లు చెప్పేరు. నా ఉద్దేశంలో ఆమె ధ్యాసంతా నీ పైనే. అప్పుడు నీకు దూరంగ ఉండడానికి ఎంతగ ప్రయత్నించేరో, ఇప్పుడు చేరువవడానికి అంతగ తాపత్రయ పడుతున్నారు. ఆమే కాదు ఈ విషయంలో నువ్వు అదృష్టవంతుడివే" అని రామకృష్ణను అభినందించేడు గణపతి హృదయ పూర్వకంగ.

"నాకు ఆమెను త్వరగ చూడాలనే ఉంది. నా చదువయిపోగానే తిరుపతి వెళ్ళి దైవదర్శనం చేసుకుందా మనుకున్నానని ఇంట్లో చెప్పి రేపే బొకారో ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరుతాను. తిరుమల వెళ్ళి ఆ దేవుని సందర్శించి, అక్కడ నుండి మదనపల్లి వెళ్ళొస్తాను."

ఆ విధంగానే రామకృష్ణ ఇంట్లో తల్లితోను, మామయ్యతోను చెప్పేడు.

"ఏమోయ్ రామం! దేముడి మీద భక్తి ఎక్కువైపోతూందే నీ కీమధ్యన. ఏమని మొక్కుకుంటావు? పరీక్ష ఫస్టుక్లాసులో పాసవాలనా, లేక చక్కని పిల్ల భార్యగా రావాలనా?"

"నువ్వు చెప్పేవే ఆ రెండో దే."

అందరు నవ్వుకున్నారు. తల్లి శాంతాదేవి అంది– "నన్ను రమ్మంటావా? నేను తిరుపతి వెళ్ళి చాల కాలమైంది."

రామకృష్ణ గతుక్కుమన్నాడు, సర్దుకుని– "నేను కొందరి స్నేహితులతో కలసి వెళుతున్నాను. అందుకే మరో సారి నిన్ను తీసుకుని వెళ్తాను. ఏం– సరేనా?"

"సరే– నీ ఇష్టంరా," అని ఊరుకుంది శాంతాదేవి.

"అవునోయ్ రామం– వాళ్ళు ఆడస్నేహితులా, మగస్నేహితులా?" అని చిరునవ్వుతో అడిగేడు నరసింహం.

## ప్రణయవల్లరి

"ఫో మామయ్యా! నీవన్నీ అనుమానాలే. నన్ను అనవసరంగ సంశయించకు."

"ఫరవా లేదోయి నీ వయస్సులో ఆడస్నేహితులు కాకపోతే, నా వయస్సులో కావాలనుకున్నా దొరకుతారేమిటి."

"మీ సిగ్గు బొగ్గులవా! మీకూ ఆడస్నేహితులు కావల్సి వచ్చిందా?" అని చిరునవ్వుతో రామకృష్ణ మేనత్త భర్తను కసురుకుంది.

నరసింహం ఉల్లాసంగ నవ్వేసి మీసాలు సర్దుకున్నాడు.

ఆ మరునాడు చిన్న సూటు కేసుతో రామకృష్ణ ట్రెయినెక్కేడు. అతని ఎద నిండా అమృతభావాలే. అతని ఊహలన్ని బంగారు తీగలతో అల్లుకో నారంభించేయి.

రామకృష్ణ మదనపల్లి చేరేసరికి మధ్యాహ్నం నాలుగు గంట లయింది. తిన్నగ నవనీత ఉంటున్న క్యాబిన్‌కి వెళ్ళేడు. ఆమె ఆ సరికి వాలుకుర్చీలో కూర్చుని ఓ నవల చదువుతూంది. అడుగుల చప్పుడుకు తలెత్తి చూచింది. రామకృష్ణను చూడగానే చటుక్కున కుర్చీలోంచి లేచి నిల్చుంది. ఆమె ముఖంలో వెయ్యి దీపాలు సంతోషంతో వెలిగేయి. నవనీతరూపాన్ని చూస్తు అలా ఆనందంతో రామకృష్ణ నిల్చుండి పోయేడు.

ఓ క్షణం గడిచేక నవనీత ముందుగా తేరుకుని,

"నమస్కారం రామకృష్ణగారు!" అని చేతులు జోడించింది.

"నమస్కారం – మీరు కులాసాగ వున్నారా?" రామకృష్ణ చిరునవ్వుతో పల్కరించేడు.

"అలా కూర్చోండి" అని ఎదురుగనున్న కుర్చీ చూపించి తను మంచంమీద కూర్చుంది.

"మీరు ఎప్పుడొచ్చేరు అలహాబాదు నుండి? అన్నట్లు మీ రింకా నన్ను 'మీరు' అంటున్నారు."

"ఏదో అలవాట్లో పొరబాటు -చాలకాలమయిపోయిందిగ. సుమారుగ ఏడు నెలలు గడిచేయనుకుంటాను."


"అందుకే నేను కొత్తగ తోస్తున్నాను కదండి."

"నిజమే నవనీత – నువ్వు ఈ ఏడు నెలల్లో ఎంతో మారిపోయేవు రూపంలో నా కళ్ళకు కొత్తగానే కనిపిస్తున్నావు?"

"మరి మీ మనస్సుకు?"

"చిరపరచితురాలనే"

"థాంక్స్ – మీరు బాగున్నారా? నా కండ్లకు మీ కా హాస్టలు భోజనం పడినట్లుంది- కాస్త ఒళ్ళు చేసేరు. ఆ చూపులో ఓ గంభీరత సంతరించు కుంది."



"ఇప్పుడు థాంక్స్ చెప్పడం నా వంతు అది సరిగాని మీ ఆరోగ్యం యెలా గుంది?"

"చాల మెరుగుపడిందండి ఇంటికంటే గుడి పదిలమన్నట్లు ఈ శానిటోరియం నా ఒంటికి పడింది ఇక్కడ తిండి, మందులు వేసుకోడం అన్ని సరిగ్గా వేళకు జరగాల్సిందే చాల ఖరీదైన మందులు, పోషకమైన భోజనం, పాలు, పండ్లు అన్ని శ్రద్ధగా ఇస్తున్నారు ఈ వాతావరణం చాల బాగుంది నేనిప్పుడు చికిత్సకు వచ్చిన రోగిలా కాకుండ, అలా ఆనందంగ యాత్రకు వచ్చిన మనిషిలా ఇక్కడ అనుభూతి చెందుతున్నాను శరీరాన్ని పీడించి నాశనం చేస్తుండే ఆ జ్వరం ఇప్పుడు రెండు నెలలైంది మరి రావడం లేదు నన్ను బంధించి, నరకం చూపించే ఆ దగ్గు పోయి చాలకాలమైంది నా దేహమిప్పుడు శుచిగ స్నానం చేసి, పవిత్రంగ పట్టు వస్త్రాలను కప్పుకున్న ట్లుంది నన్ను ఎంతో యాతనకు గురి చేసిన ఓ కర్కశ, దుష్ట స్వప్నంనుండి మేల్కొని ఆహ్లాద భరితమైన సూర్యో దయాన్ని చూస్తున్నట్లు అనుభూతి చెందు తున్నాను శరీరానికి ఆరోగ్యం యెంత అద్భుతమైన, నిర్మల మైన ఆనందం ప్రసాదించగలదో ఇప్పుడు తెల్సుకున్నాను నన్ను ఈ సంపూర్ణ సంతోషంతోనాకు నూరేళ్ళు వచ్చేవరకు బ్రతకమని ఆశీర్వదించండి. మీరు అను రాగంతో నా తలపైన మీ అభయహస్తం యుంచి దీవిస్తే నా దేహమేకాదు, నా హృదయమంతా పులకరిస్తుంది" అని రామకృష్ణ ముందుకువచ్చి నిల్చుంది

ఆమె ఉత్సాహానికి, ఆమెకు తన యందున్న నమ్మకానికి రామకృష్ణ ఎంతో ఆశ్చర్యపోయి, ఆమెతో బాటు ఆనందాన్ని పొందేడు

రామకృష్ణ ఆమె కోరినట్లు తన కుడి చేతిని ఆమె తలపై యుంచి మన స్ఫూర్తిగా దీవించేడు "నా నవనీత నూరు సంవత్సరాలు సుఖ, శాంతి, ఐశ్వర్య, సౌభాగ్యాలతో నిండుగ జీవించా లని ఆ పరమేశ్వరుని వేడుతున్న" అన్నాడు

## జ్ఞాపకాలు!

జ్ఞాపకాలు
తియ్యనివైతే
మనసంతా
క్షణమన్నా
హాయిగావుంటుంది!
చేదువయితే
జీవితమంతా
బరువుగా వుంటుంది!!

—కె. లుగేంద్రనాథ్‌పిళ్ళై

## ప్రణయవల్లరి

నవనీత ఆనందంతో "మీరు నవనీత అనే కాక 'నా నవనీత' అన్నారుకదూ?" అని ప్రశ్నించింది

"అవును. ఎల్లప్పుడు నువ్వు నా దానివే. నా హృదయంలో నీకు శాశ్వత స్థానం యేనాడో ఇచ్చేను ఇక కొద్ది నెలల్లో నా దేహంలో సగబాగంగ నిన్ను చేసుకుంటా" అని రామకృష్ణ ఆమె కండ్లలోకి చూస్తూ వాగ్దానం చేస్తు న్నట్లు గంభీరంగ అనేసరికి నవనీత మానసికానందంతో పులకరించి రామ కృష్ణను గాఢంగ కౌగలించుకుంది

ఒక్క క్షణం వారిరువురు అద్భుత ఆనందానుభూతితో అలా ఉండి పోయేరు తరువాత నవనీత మెల్లగ కదిలి తన మంచం వద్దకు వెళ్ళి కూర్చుంది రామకృష్ణ తన కుర్చీలో చిరునవ్వుతో కూర్చున్నాడు

'నా కివాళ యెంతో తృప్తిగా ఉంది ఈ సుదినాన్ని నేనెన్నడు మరచిపోలేను. నా కింక జీవితంలో కావాల్సిందేమిలేదు అన్ని మీ రిచ్చేరు మీ ఈ మాటలు నా హృదయంలో శాశ్వతంగ అమృత వాక్కు లుగ పదిలపర్చుకుంటాను "

"నవనీత! నువ్వు నన్ను అంత గాఢంగా ప్రేమిస్తున్నావా"

"చెప్పలేనంత మీకీపాటికి నా హృదయం మీ హృదయానికి నివేదించ లేదా!" అని ఆమె చిరునవ్వుతో అనేసరికి రామకృష్ణకు తను విశాఖలో ఆమె ఇంటిలో అన్న మాటలు గుర్తొచ్చి నవ్వేసాడు సంతృప్తితో

ఈలోగా నవనీత తండ్రి పరంధామయ్య ఏదో సంచీతో ఏవో వస్తువుల్ని తీసుకుని అక్కడకు వచ్చేడు

"నమస్కారం రామకృష్ణగారు! ఎంతసేపయింది మీరొచ్చి!"

"నేనొచ్చి ఓ గంటయిందిలెండి- బాగు న్నారా?"

"ఆ బాగున్నా మీ దయవల్ల చూసేరుగ అమ్మాయి బాగానే కుదుటపడింది డాక్టర్లు ఆమె కిప్పుడేమి జబ్బులేదు, నయమయి పోయిం దంటున్నారు అందుకే మీరొకసారి సూపరిం టెండెంటుతో మాట్లాడండి వారు విడుదల చేస్తేనే వెళ్ళిపోదామని ఉంది అమ్మాయి అదే అంటూంది "

"అవును మీరు చాలకాలం ఉండి పోయే రిక్కడ అయితే పదండి ముందు డాక్టరు గోపాల్‌గార్ని కలిసి మాట్లా డుదాం నువ్వుండు నవనీత- మేం వెళ్ళొస్తాం" అని రామకృష్ణ, పరం ధామయ్య హాస్పిటల్‌లోకి వెళ్ళేరు

అక్కడ ముందుగానే డాక్టర్ గోపాల్ దగ్గరకు వెళ్ళేరు

"రామకృష్ణగారు! మీరు రావడం నాకు సంతోషంగ నుంది. నవనీతగారి గురించి మీతో చెప్పాలని ఉంది. ఆమె ఇప్పుడు సంపూర్ణంగ ఆ వ్యాధి నుండి విముక్తి చెందేరు అన్ని పరీక్షలు గత వారమే చేసేం. ఆ టి. బి. బాసిలెస్ ఇప్పుడు మరేమిలేవు. ఊపిరితిత్తులు మునుపులా ఆరోగ్య సెల్సుతో నున్నాయి. అప్పుడు చెస్టులో వచ్చిన కాంప్లికేషన్స్‌కు అన్నిటికి ట్రీట్ చేసి వాటిని నివారించేం. ౩ఈజ్ కంప్లీట్లీ క్యూర్డు నౌ "

"చాల థాంక్స్ డాక్టర్— మీరంత శ్రద్ధ వహించి చికిత్స చేయకపోతే ఇంత త్వరగ ఆమె కోలుకోలేదు అయితే ఆమెను డిశ్చార్జి చేస్తారా?"

"అదే మీతో మాట్లాడుదామను కుంటున్నాను ఆమె శరీరంలో ఇప్పుడు

వ్యాధి ఏమి లేకపోయిన ఆమె మరో రెండు నెలలు ఇక్కడ ఉండడం మంచిదంటున్నారు మా హాస్పిటల్ సూపరింటెండెంటు. పదండి ఓ సారిఅతణ్ని కలసి మాట్లాడుదాం. నేను అతని ఉద్దేశంతో ఏకీభవిస్తున్నాను- పదండి."

రామకృష్ణ, పరంధామయ్యా కాస్త ఆందోళన చెంది ఒకరి వైపు ఒకరు చూసుకున్నారు. హాస్పిటల్ సూపరింటెండెంటు వారిని కూర్చోమని అసలు సంగతి చెప్పేడు-

"ఆమె ఇప్పుడు పూర్తిగ కోలుకుంది. ఆ వ్యాధి సమగ్రంగా నివారణయింది. అందులో అనుమానం లేశమంతయినా లేదు. కాని ఈ టి. బి. వ్యాధి పోయిన తరువాత కొంత పీరియడ్ని సస్పెక్టబుల్ పీరియడ్ అంటారు. ఆ స్థితిలో పేషంటుని శ్రద్ధగ చూడాలి. మంచి టానిక్కులు, మంచి డైటుని ఇచ్చి గమనిస్తు ఉండాలి. ఆ పీరియడ్లో ఆ పేషంటు శరీరంలో రోగ నిరోధక శక్తిని పెంపొందించాలి. ఆ ఇమ్యూనిటి ఆ వ్యాధి మరింకెప్పుడు జీవితంలో రాకుండా ఉండడానికి ఎంతో అవుసరం. ఆ నిరోధక శక్తినే ఇప్పుడు ఆమె శరీరంలో పెంపొందిస్తున్నాము. అందుచేత నా ఉద్దేశంలో ఆమె మరో రెండు నెలలు ఈ శానిటోరియంలో ఉండడం యెందుకేనా మంచిది. అలా మీరుంచితే ఇక ముందెప్పుడూ ఆమె కావ్యాధి మరి సోకదని నేను వాగ్దానం చేయగలను. ఏమంటారు?"

"తప్పకుండ ఆమె మరో రెండు నెలలు ఇక్కడే ఉంటుంది. ఇప్పుడే వెళ్ళిపోవల్సిన అగత్య మేమిలేదు డాక్టర్. మీ మాటప్రకారమే ఉంచుతాం" అని రామకృష్ణ చెప్పేడు.

"సంతోషం- మీరు సరిగ్గా రెండు నెలల తరువాత వస్తే ఆమెను పంపించుతాను. అంతవరకు ఆమె బాధ్యతను మామీద ఉంచండి- ఏం?" నవ్వుతు అన్నాడు.

"సరే డాక్టర్- అలాగే కానీండి," అని రామకృష్ణ లేచేడు.


రామకృష్ణ, పరంధామయ్యా తిరిగి నవనీత గది వద్దకు వచ్చేరు. నవనీతకు జరిగిందంత చెప్పేరు. నవనీత ఉత్సాహం కాస్త తగ్గింది.

"మీతో వచ్చేస్తా ననుకున్నాను ఇక్కడనుండి విడుదలై. మరో రెండు నెలలుండాలంటే, నా మంచికైన, కాస్త నిరుత్సాహమే."

"రెండు నెలలు ఇట్టే గడచిపోతాయి. ఈ రెండు నెలల చికిత్సతో జీవితాంతం ఆ వ్యాధి భయం మరుండదు కదా," అన్నాడు రామకృష్ణ.

"అవునులెండి- అది ముఖ్యం," అని చిరునవ్వుతో అంది నవనీత.

"మరి నేను వెళ్తా- రెండు నెలలయేక




నేనే వచ్చి నిన్ను తీసుకొని వెళ్తా- సరేనా?"

"ఆహా, అలా మీరు వెంటనే వెళ్ళడానికి వీలులేదు. ఇవాళుండిపోండి, రేపు వెళ్దురుగాని. నాకు కాస్త ఊసుపోతుంది," అని ఆప్యాయంగ నవనీత అంది.

"అవును బాబు- ఈ సాయంత్రం ఎక్కడకు వెళ్ళగలరు. నేనున్న లాడ్జిలో ఈ రాత్రి ఉండి రేపు వెళ్దురుగాని. ఈ రాత్రికి ట్రెయిను లేదు."

"సరే- అలాగే ఉంటా, గాని రేపు ప్రొద్దున్నే ఆరుగంటలకున్న వెంకటాద్రి ఎక్స్ప్రెస్లో బయలుదేరి తిరుపతి వెళ్ళి అక్కడ నుండి విశాఖపట్నం వెళ్తా."

"అలా చేయండి. ఈ రాత్రి ఎనిమిది గంటల వరకు ఇక్కడ నాతో మాట్లాడుతు కూర్చోవచ్చు."

"అయితే మీరు మాట్లాడుతుండండి. నేను లాడ్జికి వెళ్తా. మీ కోసం అన్ని సౌకర్యాలున్న ఓ రూమును బుక్ చేసి ఉంచుతాను," అని పరంధామయ్యా అక్కడ నుండి కదిలేడు. అతను వెళ్ళిపోయేక రామకృష్ణ అన్నాడు-

"నవనీత! ఇలారా, నీ కోసం నేను అలహాబాదు నుండి ఓ మంచి బహుమతి తెచ్చేను."

నవనీత ఉల్లాసంగ వచ్చి అతనికి చేరువలో నించుంది. రామకృష్ణ జేబులోంచి బంగారు చైనుతో నున్న బంగారు రిస్టు వాచీని తీసి ఆమె చేతిని అందుకుని ఆమె రిస్టుకు ఆ వాచీ పెట్టేడు. ఆమె ఆ వాచీని చూసి ఎంతో మురిసి పోయింది.

"చాల బాగుందండి. మీకు నా థాంక్సండి," అంది మెరుస్తున్న కళ్ళతో.

"వఠి మాటలతో థాంక్సేనా?" అని చిలిపిగ అన్నాడు రామకృష్ణ.

నవ్వుతో రామకృష్ణ ముఖంలోకి చూస్తూ- "మరో రెండు నెలల తరువాత నేను విశాఖపట్నం వచ్చేక మీకు కావల్సిన విధానంలో థాంక్సును అర్పిస్తా, సరేనా?" అంది. రామకృష్ణ నవ్వేసి "ఒకె- మర్చిపోకు సుమా" అని హెచ్చరించేడు.

అలా కాస్సేపు అవి, ఇవి అన్ని విషయాలు మాట్లాడు కున్నారు.

(ఇంకాఉంది)

# 1991లో మీ యోగం

(ఈ సంవత్సరం 1991 జనవరి ఒకటవ తారీకు మంగళవారంతో ప్రారంభం. ఆకాశ గమనాన పలు మార్పులు 'గ్రహమండలి'లో ఏర్పడటం దేశ ప్రగతికి, ప్రపంచాన శాంతి భద్రతలు నెలకొనుటకు ఆస్కారం. గ్రహమండలియందలి శని, గురు, రాహు, కేతు, గ్రహాల మార్పులు, పాడి పంటలకు, శాంతి సౌఖ్యాలకు, రాజకీయ వాతావరణమునందు సుముఖతకు, ఆరోగ్య భాగ్యాలకు, దేశ రక్షణకు ఆకరమగుట నిశ్చయం. గత రెండున్నర సం.లుగా, తీవ్రగతిలో సంచరించు అశాంతియుత వ్యవహారాలు శుభదాయకమగును. సుభిక్షతకు ఆకరమగును.

"భారతదేశం శాంతియుతంగా, సత్య శివ సుందరములతో '1991' ఆంగ్ల వత్సరం సర్వరంగములలో శుభదాయకమగు గాక!" అని, సౌభాగ్య విలసితంగా దేశం ఎసలారగలదని ఆశింపవచ్చు. అట్టి గ్రహస్థితి గలదని భావం.)



**మేషం**
(అశ్వని, భరణి, కృత్తిక 1 పా)


పై నక్షత్రములందు ఏ పాదమునందైనను, జన్మించినవారు మేష రాశి జాతకులు. రాశి చక్రమున యిది మొదటిరాశి. బహు నిబ్బరమైనది. గణిత మందు ప్రావీణ్యత, మేధావులు, రక్షణ విధానమందు నేర్పరులు, నావికులు, గనులందు, కార్ఖానాలందు శ్రమించువారు, ఈ రాశి స్త్రీ పురుషాదులు బహు బలవంతులు, పటిష్టులు.

జనవరి నుండి, ముఖ్య గ్రహములైన గురు, శని గ్రహాలు, కర్కాటక, సింహ రాశులందు, 'శని' స్వక్షేత్రయుతుడై 'మకరమున' సంచరించును. జనవరి 14 నుండి సుఖపంచమములందు గురునిస్థితి, మకర రాశిలో 'శని' సంచరించుట మొదటి ఆరు నెలలకన్న ద్వితీయార్ధం శుభదాయకం, ధనదాయకం. వృత్తిరీత్యా అనుకూలత, ఉద్యోగమందు 'ప్రమోషన్' యిత్యాది శుభములుండును. 1991లో జూలై నెల నుండి వత్సరాంతం వరకు చలనచిత్ర రంగాన అనుకూలత కొందరకు, ఉద్యోగ వృత్తులందు అధికయోగ్యత కొందరకు, రాజకీయంగా ముందుచూపు కొందరకు, స్థితిగతులందు పెంపుకొందరకు, వైవాహిక కార్యాలోచనలు కొందరకు, నవంబరు 16తా. నుండి విలక్షణయుతంగా కొంద రకు కాలం గడచును. మేషరాశివారు సర్వవిధాలా ప్రగతి పథమందు సంచరింతురుగాక!



**వృషభం**
(కృత్తిక 2, 3, 4 పా, రోహిణి, మృగశిర, 1, 2 పా)

వృషభరాశికి చెందిన నక్షత్రాలలో 'రోహిణి'వారు యితరులకన్న యోగం 1991లో అనుభవిస్తారు. బలవంతమైన శరీరంతో, అందంగా, విద్యావిలసితులుగా స్త్రీ పురుషాదులు జన్మిస్తారు. జీవితాంతం వరకు అందంగా ఆనందంగా వుంటారు. వృషభలగ్న రాశియందు జన్మించుట విశేషం. వృషభంలో కుజుడు, కర్కాటకంలో, సింహంలో గురుస్థితి, 'శని' మకరమందు, భాగ్యంలోస్థితి, జనవరి 14తా. నుండి, ఆగస్టు వరకు సర్వానుకూలత, వర్తకమందు పెంపు, గృహ నిర్మాణత, బిడ్డలకు పెంపు, ఉద్యోగానుకూల్యత యిత్యాదులు బుధ, శుక్ర గ్రహాల అనుకూలత, సెప్టెంబరు నుండి డిసెంబరు వరకు, శుభకార్యాలోచనలు, వ్యాపారలాభం, స్త్రీలకు, కళారంగాభివృద్ధి. గత కొంతకాలానికన్నా మేలుగా ధనలబ్ధిగలదు.



**మిధునం**
(మృగశిర 3, 4పా, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పా)

1991లో మిధునరాశి పరిపూర్ణ శోభతో ఎసలారును. మబ్బువదిలిన 'రవి' లాగు ప్రకాశం. 'పునర్వసు'వారు మరీ మేలైన జీవితాన్ని గడుపనున్నారు. శాస్త్రవేత్తలు, సాహితీపరులు, నటకులు, ప్రాతికేయులు, పంపిణీదారులు ఈ రాశి జాతకులయిన మరీ బాగుండును. మూడు పూలు, ఆరు కాయలతో వారికి జీవితాభ్యుదయం. మొదటి ఆరు నెలలు 'గురుడు' అనుకూలుడగుట ధనవసతి, ధాన్యవసతి, వృత్తియందు అనుకూలం, కొందరకు నూతనోద్యోగప్రాప్తి. కొందరు భారీ వ్యాపారాం చేసి, మార్చి 11తా. నుండి ముందుకు సాగిపోదురు. నూతన చిత్ర నిర్మాణదక్షులు కొందరు, దర్శకపట్టభద్రులు కొందరగుదురు. చివరి 4 నెలలు కొన్ని యిబ్బందులుండవచ్చు. కుటుంబ యిబ్బందులు, ఏమయినా 'శని' అనుకూల్యతగలిగి మేలు పొందగలరు.



**కర్కాటకం**
(పునర్వసు 4 పా, పుష్యమి, ఆశ్లేష)

కర్కాటకరాశి జాతకులకు 1991 సంవత్సరాన సర్వవిధాలా, సర్వరంగాలలో సుఖశాంతులతో ఆనందమయమైన జీవితం గడపుటకు గ్రహానుకూలత గలదు. స్త్రీ పురుషాదులు, అందంగా ఆనందంగా వుంటారు. శాస్త్రవేత్తలు, లలిత కళాప్రావీణ్యులు, గాయకులు, సాహితీ ప్రియులు, చలనచిత్రరంగానుకూలురు. రాశియందలి 'గురుడు' కొంతకాలం సంచరించి, ద్వితీయ రాశిని చేరుకొంటాడు. ధనలాభం, వ్యాపారలాభం, విద్యాలాభం, సాహితీరంగాన ప్రసిద్ధి, వృత్తియందు సిద్ధి, ఇంట శుభకార్యాలోచనలు యిత్యాది శుభ ఫలములు పూర్వార్ధమందే గ్రహిస్తారు. మొదటి 6నెలల్లో మీరు సాధించరానిది వుండదు. నూతన చిత్రనిర్మాణాదులు, భారీ వ్యాపారానుకూలత, పత్రికారంగ ప్రావీణ్యత, పుష్యమి

జాతకులకు మరీ బాగుండగలదని, 'ప్రమోషన్' కొందరకు రాగలదని, ఆనందంగా వత్సరం జరుగుట శాస్త్రసమ్మతం.



సింహం
(మఘ, పుబ్బ, ఉత్తర 1 పా)

ఈ నక్షత్ర జాతకులు 'సింహ'రాశివారు. కేసరి వంటి పరాక్రమం, దక్షత, సూర్యప్రకాశంతో పరులకు దిగాల్ మనిపించు ముఖ వర్చస్సుతో, పట్టుదలతో, గాంభీర్యంతో త్వరితంగా కార్యసాధకులు స్త్రీ పురుషాదులు.

వృషభంలో వక్రించిన కుజుడు, కొంత కాలం 'గురు, కేతువులు' కర్కాటకంలో, గురుడు సింహరాశిలో వుండుట, శని మకరంలో 6వ యింట సంచరించుట 'త్రి, షట్, ఆయః' న్యాయంతో లక్షలాది అప్పులు వసూలగుట, వ్యాపార రంగాన పెంపు, జనవరి 14తా. నుండి ఆరు నెలల పర్యంతం జీవితం, ఉద్యోగం, వృత్తులు ఆనందమయంగా వుండగలవు. విదేశీయానం కొందరకు, ఉన్నతోద్యోగ స్థితి కొందరకు, వృత్తి పెంపు కొందరకు, 'కోర్టు' వ్యవహారానుకూల్యత కొందరకు, 1991సం. సర్వాభీష్టదాయకం, గ్రహింతురుగాక. 'రవి' ప్రకాశ ప్రభావితులగుదురుగాక!



కన్య
(ఉత్తర 2, 3, 4 పా, హస్త, చిత్త1, 2 పా)

పై నక్షత్ర జాతకులు 'కన్యారాశివారు' బుధగ్రహానుకూల్యత గలవారు. మాట నేర్పు, ఉత్తమ వ్యవహార వ్యాపార దక్షతగలవారు. ఈ రాశి జాతకులే వ్యాపార నిపుణులు, మేధావులు, రాజకీయ రంగాన నేర్పరులు, మంత్రి పదవి నలంకరించువారు, ప్రముఖులు, ఉత్తములు, మిత్రులుగా గలవారు. 'చిత్త' మరీ ఉత్తమంగా వెలుగొందగలదు గ్రహించండి. 1991లో పూర్వార్ధం లాభప్రదంగా, కుటుంబానందదాయకంగా, ఆరోగ్యదాయకంగా, కళాప్రతిభావిలసితంగా, రచనా వ్యాసంగాన చతురతతో ఫిబ్రవరి 15తా. నుండి ఆరు నెలల పర్యంతం హాయిగా గత కొన్నిసంవత్సరాలకన్నా 1991లో మెరుగుగావున్నట్లు గ్రహిస్తారు. ఆగస్టు నుండి, ప్రతి రెండు నెలలు లాభప్రదంగా వుంటుంది. గృహోపకూల్యతగల సమయమే. ఉత్తమోత్తమ వ్యవహారదక్షులగుట నిశ్చయం.



తుల
చిత్త 3, 4 పా, స్వాతి, విశాఖ 1, 2, 3 పా)

ఎవడీతడు? తులారాశి జాతకుడు, లేక 'తులాలగ్న' జాతకుడంటారు. మరీ 'స్వాతి' వారు విలాస వికాసవంతులు. 12 రాశుల్లో అతి ముఖ్యమైనవి. 'వృషభ, తుల'లని, శాస్త్ర నిశ్చితం. స్వరద్రూపులై, నిక్కచ్చిగా మాట్లాడి, నిబ్బరంగలవారు ఈ రాశి స్త్రీ పురుషాదులు. ఉన్నత పదవులందుకొంటారు, 'సైన్సు, శాస్త్రజ్ఞులు, డాక్టర్లు' విజ్ఞానఖనులీ రాశి జాతకులు. 1991 లో ప్రతినెల యోగదాయకం. ముఖ్యంగా ఫిబ్రవరి, ఏప్రిల్, జూన్, సెప్టెంబరు, నవంబరు, డిసెంబరు 14 నుండి ఒక్కపక్షం యోగదాయకం, వృత్తివికాసం, ధనరాబడి, ప్రయాణమూలకంగా అనుకూలత, రాజకీయరంగానుకూలత, ఏమయినా అర్ధాష్టమ 'శని' బాధ కూడ లేకపోలేదు. ఆరోగ్యరీత్యా జాగ్రత్త గ్రహించగలరు. 1991లో మీకు శుభదాయకమే!



వృశ్చికం
(విశాఖ 4వ పా, అనూరాధ, జ్యేష్ఠ)

ఈ రాశి జాతకులందు 'అనూరాధ, జ్యేష్ఠ' నక్షత్ర జాతకులు అత్యుత్తమమైన కార్యసాధకులవుతారు. ఎవరికీ లొంగని వారుగా, పట్టుదలగలవారుగా 'లాటరీ స్పెక్యులేషన్'లందు పెంపునందనున్నారు. తృతీయ శని, సప్తమ, అష్టమ రాశులందు 'గురుని' స్థితి లాభదాయకం. ధనదాయకం, వ్యాపారమందు లాభప్రదం. 1991 జనవరి నుండి 4నెలల పర్యంతం, ధన ధాన్య/ వస్తు, వాహన, కళారంగ ఖ్యాతి, చలనచిత్రరంగానుకూలత, గృహనిర్మాణదక్షతకు మేలు. కొందరు 'రాజకీయ' రంగాన పెంపు వహింపనున్నారు. మే, జూన్, జూలై నెలలందు అప్పులు తీరనున్నాయి. ఆగస్టు నుండి డిశంబరు వరకు యత్నకార్యసిద్ధి, ప్రసిద్ధి, ఆరోగ్య వృద్ధి, చివరకు యోగదాయకవత్సరంగా పరిగణన. గత కొన్ని సంవత్సరాల కన్నా 1991 సర్వవిధాల మీకు యోగాఢ్యం.



ధనుస్సు
(మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1పా)


రాశినాథుడు గురుడు. పూర్ణశుభుడు. విద్యావంతులు, ధనవంతులు, రూప సంపదగలవారు, సత్యసంధులు, సత్ప్రవర్తకులు, విద్యావంతులు, శాస్త్రవేత్తలు, అధిక ఉద్యోగవంతులు స్త్రీ పురుషాదులు ధనురాశివారు.

ద్వితీయమందు 'శని' అష్టమ, నవమ రాశులందు 'గురుడు' వృషభ కుజుడు, కొంతకాలం మకరమందు రాహుగ్రహోలస్థితి, ముఖ్యంగా శని బాధ,వేధ, ద్వితీయ శని పరాక్రమం చవిచూడకపోరు. జనవరి 14తా. నుండి మార్చి వరకు ధనలాభం, ధాన్యలాభం, చేసిన ఉద్యోగ యత్నాలు సానుకూలం అగుట నిశ్చయం. కుటుంబానందం, రాబడియందు పెంపు, గృహనిర్మాణతకు, దూరప్రయాణాను కూలతకు ఏప్రిల్, జూన్, ఆగస్టు, అక్టోబరు, డిశంబరు నెలలు వుపకరింపగలవు. కళారంగాన, చలనచిత్రరంగాన సదవకాశాలు గలవని గ్రహించాలి.



మకరం
(ఉత్తరాషాఢ 2, 3, 4 పా, శ్రవణం,ధనిష్ఠ 1, 2పా)

మకరరాశి జాతకులు మొసలిపట్టుదల గలవారు, కార్య దక్షతగలవారు. ఎంతకైనా తగినవారనుపించు కొంటారు. 1991లో రాశియందు శని, కొంత కాలం 'రాహువు' సప్తమాష్టమ రాశులందు గురుడు సంచరించుటచే వ్యాపార, వ్యవహార, ఉద్యోగములందు, ప్రయాణములందు, సజ్జనమైత్రియందు, 'ప్రమోషన్' సాధనయందు అనుకూలత. రాశియందున్న 'శని' ఏడున్నర సం. శనిగా సంచరించును. ఆరోగ్యరీత్యా జాగ్రత్త! అప్పుల బెడద. ఇరుగు పొరుగు చికాకు లేకపోదు. 1991 లో మొదటి ఆరు నెలలకన్నా చివరి ఆరు నెలలు బాధాకరముగా వుండకపోవు. ఓర్మితో 'శని' జపంతో అర్చనలతో సంవత్సరం గడిపి హాయి, ఆనందం అనుభవింతురని ఆశింపవచ్చు.




కుంభం
(ధనిష్ఠ 3, 4 పా,శతభిష, పూర్వాభాద్ర,2, 3పా)

ఈ నక్షత్ర జాతకులు కుంభరాశివారు.

# పాఠకులే సెక్స్ కథలు కావాలంటున్నారా?

## రచయితలదే బాధ్యత

ఈరోజుల్లో రచయిత(త్రి)లు వ్రాస్తున్న కథలలో "సెక్స్"కే ప్రాధాన్యత నిస్తున్నారు. శృంగారం ఔషధములాంటిది మోతాదు మించితే ప్రమాదం. అలాగే కథలలో శృంగారం శృతి మించకూడదు.




కథలు కేవలం శృంగారం గురించే వ్రాయకూడదు. ఆ కథలోని సన్నివేశాన్ని బట్టి "శృంగారం" ఉంటే మంచిది

నేటి చిత్రాలు, కథలు సమాజంలో జరిగే సంఘటనలు ప్రజలలో తీవ్రమైన ఆందోళన కలిగిస్తున్నాయి. మనం అన్నిటిలోను "మంచి"ని ఆదర్శంగా తీసుకోవాలి. కథలుకూడా పెద్దలు అందరూ చదువుతారని రచయిత్రు(త)లు దృష్టిలో పెట్టుకోవాలి. "సెక్స్"ను ఎక్కువ చిత్రించకుండా పాత్రబట్టి ఉంటే చాలా మంచిది.

-చావలి రామం,
రాజమండ్రి

## నిజం కాదు

పాఠకులు సెక్స్ కథలు చదవరు. రచయితలే పాఠకుల జ్ఞానం శృంగార వీధికి ఇరికించి, ఏమీ ఎరుగనట్లు కలం పుచ్చుకొని ఆలోచిస్తే నేనేమి చెప్పను. ఓ రచయితగా నేను ఆలోచిస్తే రచయితకి కథ పడాలి అందుకూ కాస్త శృంగారం జల్లితే హిట్ అని ఆశ. ఇది నిజం అయింది పాఠకులు శృంగార కథలు చదువుతున్నారు. శృంగార చిత్రాలు చూస్తున్నారు సెక్స్ నేర్చుకోవటం తప్పు గాదు. శృంగారం లేనిదే చదవం అని అనటంలేదు. మన ఆంధ్రపత్రిక పాఠకలోకం ఇది నిజం




సెక్స్ కథలు వద్దు. ఈ అభియోగం నిజం నిజం కాదు అంటే నేరం!

-కె. శివరామప్రసాద్,
హైదరాబాద్

## మితంగా వుండాలి

పాఠకులు మంచి సాహిత్యం, శైలి వున్న కథలను ఎక్కువగా ఆశిస్తారు



అంతేకాని సెక్స్ కథలు కాదు 'సెక్స్'ను పుట్టించి దాని చుట్టూ కథలల్లరాదు మంచి కథను ఎన్నుకొని దానికి మంచి సాహిత్యం శైలి కొత్తదనం అల్లాలి సెక్స్ రచన అవసరమైన చోట మాత్రమే ఉపయోగించాలి అతిగా కాకుండా మితంగా అప్పుడే మనం ఆశించిన ఫలితం లభిస్తుంది లేకపోతే శూన్యమే ఫలితం మరియు అది పాఠకులను పెడత్రోవ పట్టిస్తుంది నా దృష్టిలో పాఠకులు ఎప్పుడు సెక్స్ కథలు కోరరు

—చెగొంటి రమేష్‌కృష్ణ

కుంభం 'కడవ' అంతటి లోతైన, విశాలమైన ప్రకృతి, ధైర్యస్థైర్యం గలవారు కుంభరాశి పురుషాదులు. 'శని' ప్రకృతిగలవారు. ఎంతటిదానికైనా జంకరు. వ్యయ రాశియందు 'శనిస్థితి' కర్కాటక సింహ రాశులందు అనగా 6, 7 రాశులందు గురుడు, ముఖ్యగ్రహాలు ఎగుడు దిగుడుగా నున్నారు. అలాగే అంగారక బుధులు కూడా వృత్తియందుగాని, రాజకీయములందుగాని, చేసే ఉద్యోగమందుగాని, చిత్రరంగానగాని, జాగరూకత, నిర్భయత్వం అవసరం, వ్యాపారమందు రెండవ ఆరునెలలు జాగ్రత్తపడవలెను. 1991 లో ప్రయాణములందు, రాజకీయరంగాన జాగ్రత్త అవసరం. జూన్ నుండి మరీ జాగరూకత అవసరం. ప్రయాణములందు అతి జాగ్రత్త కావలెను. 'రోడ్డు' ప్రమాదం, దొంగతనం జరుగవచ్చు. జాగ్రత్త! ఆగష్టు నుండి వత్సరాంతం వరకు ఎంత జాగ్రత్తగా వుంటే

## 1991 లో మీ యోగం

అంతమేలు.



మీనం
(పూర్వాభాద్ర 4పా,
ఉత్తరాభాద్ర, రేవతి)

పైమూడు నక్షత్రములకు చెందిన వారు మీనరాశి జాతకులు, స్ఫురద్రూపులు, మేధావులు, శాస్త్రపారంగతులు, నల్గురకు న్యాయం చెప్పగలిగిన వారు, విద్యావేత్తలు, చక్కని ఆకృతిగలవారు. 1991 రాశి జాతకులకు సర్వవిధాలా మేలుగా వుండుటకు, దినాభివృద్ధికి, ఉత్సాహజనకమైన జీవితమునకు, జీవనోపాధికి, తక్కినవారి కన్న రేవతి నక్షత్రజాతకులకు, సర్వవిధాలా మేలు. పంచమ, షష్ఠరాశులందు గురునకు స్థితి. మకరరాశి 11లో శనికి స్థితి. 'సర్వే గ్రహాః ఏకాదశస్థాన ఫలం వరదాభవంతు' అను న్యాయేన చలనచిత్ర, పత్రిక ప్రకటన, రాజకీయ రంగములలో సర్వశుభదాయకమగును. అనారోగ్యతచే బాధపడువారికి కొంతలో కొంత శాంతియుతమగును. జనవరి 14వతా.నుండి దాదాపు ఆరునెలల పర్యంతం వృత్తి, ఉద్యోగ, రాజకీయ, కళా సాహితీ రాశులందరి ప్రావీణ్యత భాసించును. సెప్టెంబరు 16తా.నుండి వత్సరాంతం వరకు, ఆహార విహారాదులలో, భారీ వ్యాపారంలో, అధిక ప్రయాణత్వరలో బహు జాగ్రత్తగా సంచరించుటమేలు. కొండరకు విదేశ ప్రయాణావకాశములు కూడ గలవు. జాగ్రత్తగా సంచరించవలె. గృహమున కళ్యాణ విభవమునకు ఆస్కారం గల వత్సరం 1991గా గుర్తించగలరు.

శ్రీర్జయతు శుభం భూయాత్, సర్వే జనాఃసుఖినోభవంతు

- విద్వాన్ కోటసత్యరంగయ్యశాస్త్రి

సీరియల్

# సాగరమథనం

## అడివి సూర్యకుమారి

(గత సంచిక తరువాయి)

సాగర్ ఒక్కక్షణం ఆలోచించాడు.

ఎవరై ఉంటారీపని చేసింది.

'తీతూజీప్ ఎక్కు' అన్నాడు. తీతూ ఎక్కాక జీప్ శరవేగంతో మహావీర దూత ఎస్టేట్స్ వైపు కదిలింది.

అక్కడికి సమీపానికి జీపు వస్తుంటే విస్ఫోటనం కలిగినప్పటి శబ్దాలతో ఎస్టేట్ బిల్డింగ్స్ కూలిపోతున్నాయి.

జీప్ దిగుతూ 'శక్తి సామర్థ్యాన్ని తక్కువగా అంచనా వేసుకున్నాడు పూర్ ఫెలో' అంటూ ఆ వైపుకి పరుగు తీశాడు సాగర్.

'మహావీర దూతని ప్రాణాలతో పట్టుకోవాలి' ఈ విషయం అందరికీ చెప్పండి అన్నాడు చెరో వైపుకి పరుగెత్తబోతున్న తీతూ దిలీప్‌లకి.

సరేనంటూ పరిగెత్తారు వాళ్లిద్దరూ.

బైట సెక్యూరిటీ గార్డ్స్ ఎవరూ లేరు.

ఒకవైపున లేస్తున్న మంటల్ని ఫైర్ ఇంజన్స్ నీటి ధారలచే ఆపేందుకు విశ్వప్రయత్నం చేస్తున్నాయి.

తగలబడ్తోంది కేవలం అతని టెక్స్‌టైల్స్ మిల్స్ మటుకే.

'వీళ్లందరిని ఎక్కడుంచారు'

**ఇంతవరకూ సాగినకథ-20 :** శ్రీలంక ట్రింకోమలిలో శక్తి నెలకొల్పిన సేవాగ్రామంలో జయసూర్య డాక్టరుగా చేరతాడు. సాగర్ ఆచూకీ కోసం పోలీసులు సేవాగ్రాంకి వస్తారు. డచ్చిపోర్టులోని కోటలోకి ప్రవేశించిన సాగర్‌ను సింహళ ఈలం సభ్యులు చుట్టు ముడతారు కాని సాగర్ తప్పించుకొని వాళ్ల నుండి సమాచారం రాబడతాడు. ఆ సమాచారం అందించిన వారిని కాల్చి వేయమని స్థితబోధి ఆదేశిస్తాడు. కొంతమంది రౌడీలు శక్తిని, సేవాగ్రాంలోని వారిని ఎత్తుకు వెళ్లినట్లు తీతూ-సాగర్‌కి తెలియజేస్తాడు.

ఒక్కక్షణం ఆలోచించి ఫైర్ సర్వీసెస్ వారితో కలిసిపోయాడు సాగర్. చీకటి, అందరి డ్రెస్ బ్లాక్‌గా ఉండటం అతనికెంతో సహాయం చేసింది. మహావీరదూతకి ప్రత్యేకంగా ఫైరింజన్లున్నాయి.

'ఇదొక్కటే చాలదు మరొకటి తెప్పించాలి' అంటున్నాడొకడు.

'ఎలా జరిగిందిది!'

'ఇందాక తెచ్చినవాళ్లల్లో ఎవరో ఒకమ్మాయి తప్పించుకుందిట.బహుశ ఆమె పనే ఇది. మన టెర్రర్ స్క్వాడ్‌ని వదిలాడు మహావీర దూత. ఆమెను పట్టుకోవడం కోసం!

'టెర్రర్ స్క్వాడ్!' అతని కళ్లు భయంతో వెడల్పయ్యాయి. ఆమె అంత అసాధ్యురాలా! పి.వి.పి.లోని లేడి టెర్రరిస్టుల కంటేనా? 'ఆహా! వాళ్లకంటే చాలా డేంజరస్ ఉమన్‌లా వుంది. లేకుంటే పులి నోట్లో తలదూర్చి దాని మీసాలతో ఆడుతుందా'

'అలాగే వుంది చూడబోతే' అన్నాడు రెండో వ్యక్తి. సాగర్‌కి అర్థమైంది. అయితే ఈ పరిసరాల్లోనే ఎక్కడో మహావీర దూతకి మరింత నష్టం కల్గించటానికి ప్రయత్నిస్తోంటుంది.

ఈ టెర్రర్ స్క్వాడ్ ఎవరో?

అనుకుంటు వాళ్ల నుండి పనిచేస్తున్నట్లుగానే దూరం దూరంగా జరిగి వెళ్లిపోయాడు సాగర్. ఇంతలో మైక్ నుండి మహావీరదూత కంఠస్వరం విన్పించసాగింది.

"తప్పించుకున్నానని గర్వపడకు. నా ఎస్టేట్ దాటి నువ్వు బైటికి పోలేవు. నా టెర్రర్ స్క్వాడ్ కవర్ చేస్తోంది. నువ్వు వాళ్ల కళ్లపడక తప్పదు. మర్యాదగా చెబుతున్నా బైటకిరా వచ్చి... అరగంటలో నాకు ఎయిర్ ట్రాఫిక్ ఇంజనీర్‌ని అప్పగించు, నావాళ్లు నీతో వస్తారు. ఏ మాత్రం ఆలస్యం చేసినా ఈ పసి పిల్లలు వృద్ధులు అంతా మాడిమసై పోతారు."

అతని మాటలు పూర్తికాలేదు. అతని ఎస్టేట్ అంతా లైట్లతో పట్టపగల్లా మారిపోయింది. టెర్రర్ స్క్వాడ్ రెండు హెలికాప్టర్లలో అతికిందుగా వెళుతూ విహంగ



వీక్షణం చేస్తున్నారు.

ఇంక తప్పకోవడం కష్టమన్పించింది శక్తికి. ఆమె టీ గోడౌన్స్‌కి, మినీ బాంబుల మర్చింది. కరెక్టుగా పది నిమిషాలు టైమ్ పెట్టి అక్కడి నుండి కదిలింది. గోలీ సైజులో వున్న ఆ పవర్‌ఫుల్ బాంబ్స్ చేతితో వేసేవికావు. అందుకే ఆమె అక్కడే అమర్చి సాధ్యమైనంత దూరం పరుగెత్తింది బిల్డింగ్స్ చాటు చేసుకుంటూ.

నగిగెత్తుకు ంటూ వస్తున్న ఆమెకు తీతూ ఎదురయ్యాడు. ఇద్దరూ కూలబడి ఓ మూలకి ఒదిగి కూర్చున్నారు. "తీతూ వగరుస్తూ ఆ బిల్డింగ్‌లో మనవాళ్లు న్నారక్కా. మాతో సాగర్ వచ్చారు.' అన్నాడు.

'హమ్మయ్య, అయితే సరే. ఆ బిల్డింగ్‌లోకి వెళ్లేందుకు మార్గంలేదా!' అడిగింది శక్తి

లేదు. 'వాళ్ల మాటలని బట్టి అందులో వున్నారని గెస్ చేశాను. ఆ బిల్డింగ్ చుట్టురా స్టెన్‌గన్స్‌తో వున్నారు.' అన్నాడు.

శక్తి ఒక్కక్షణం ఆలోచించి.

"మనకిప్పుడో రెండు వ్యాన్లు కావాలి" అంది

'పిల్లని తెచ్చిన వ్యాన్లు అటువైపు ఆగేవున్నాయి' అన్నాడు తీతూ.

'ఓ.కె. అయితే ఒక పనిచెయ్యి, ఇటు నుండి నేను ఫైరింగ్ స్టార్ట్ చేస్తాను.' వాళ్ల అటెన్షన్‌ని డైవర్ట్ చేస్తాను. నువ్వు లోపల వాళ్లని వ్యాన్‌లలో కెక్కించెయ్. తప్పించటానికి ప్రయత్నించు.'

'అమ్మయ్యో! ఇది చాలా ప్రమాదం అక్క. అంతమందిలో నువ్వొక్కర్తి వేనా- ఊహూ నా మనసొప్పటం లేదు'

'నోర్మూసుకొని చెప్పింది చెయ్యి. క్విక్ త్వరగా అటువైపుకి వెళ్లు' అంది.

తీతూ తూనీగలా వాళ్ల కళ్లలో పడకుండా బిల్డింగ్ వెనకవైపు పారిపోయాడు.

శక్తి సడన్‌గా ఫైరింగ్ ప్రారంభించింది. ఫ్రంట్ సైడ్ ఉన్న ఆరుగురు ఒక్కసారే నేలకూలారు.

కాల్పులు వస్తున్న వైపుకి మిగతావాళ్లు ఎలర్టై కాల్పులు సాగించారు.

వాళ్లని ముందుకు రప్పిస్తూ తను వెనక్కి జరుగుతూ బుల్లెట్లు తగలకుండా జాగ్రత్త పడుతూ బిల్డింగ్‌కి దూరంగా తీసుకొచ్చింది. అయితే బిల్డింగ్‌లో వారికి కాపలాగా వుంచబడిన వ్యక్తి పోలీసు డిపార్టుమెంటులో అల్లర్లని అణిచివేయటంలో ప్రసిద్ధుడుగా పేరొందిన మహమ్మద్ ఖాన్.

అతను మహావీర దూత మనిషి అతను దేశానికి చేసిన సేవకంటే కల్గించిన నష్టమే ఎక్కువ. మహావీర దూత కాళ్ల దగ్గర కుక్కలా బ్రతుకుతూ అతని ఆనందం కోసం చేయని దుర్మార్గాలు, నీచమైన పనులూ లేవు.

ఖాన్‌ని చూస్తూనే గుర్తు పట్టింది కాత్యా. ఆరోజు తన భర్తని తమిళ సపోర్టర్ అంటూ కాల్చేసిన దుర్మార్గుడు వీడే. ఆమె కళ్లు ప్రతీకారంతో రగిలిపోతున్నాయి.

చండీ చెవిలో మెల్లిగా చెప్పింది.

చండీ బిగ్గరగా 'దాహం! ఎవరక్కడ గొంతు ఎండుకుపోతోంది' అంది.

అక్కడున్న సెంట్రీలకి కోపం వచ్చింది.

'ఇక్కడ ఇందరం ఉన్నాం. అంత బిగ్గరగాఅరుస్తావేం!' అన్నాడు కోపంగా.

'మీ సాబ్‌కి విన్పించాలనీ' అంది ఓరగా. గ్లాసుతో నీళ్లు తెచ్చిచ్చాడు.

'నన్ను మీసాబ్ దగ్గరికి తీసికెళ్లావా పక్కగదేగా, లేకపోతే నేనే రమ్మన్నానని పిలుచుకొస్తావా?' సెంట్రీ బిత్తరపోయాడు.

ఇదేం ఆడపిల్లరాబాబూ! ఇంత తెగించేసింది. డైరెక్టుగా తనే పిలుస్తోంది. ఏమైనా ఖాన్‌సాబ్ పెట్టిపుట్టాడు.

ఖాన్‌సాబ్ ఈ పిల్లని తీసికెళ్తే తర్వాత తామందరూ ఇక్కడున్న తలో పిల్లని తీస్కెళ్లి తెల్లారే దాకా... ఆపైన ఆలోచన వచ్చేసరికి వాడి ఒళ్లు 105 డిగ్రీల జ్వరం వాడిలా వణికిపోతోంది కోరికలతో.

సెంట్రీ మాటలు విని ఖాన్ పరమానందంతో 'ఆ పిల్లనిలా తీసుకురా త్వరగా' అన్నాడు లేచి నిలబడుతూ.

సెంట్రీ చండి చేతులకి కాళ్లకి వేసిన ఇనుప గొలుసులు తొలిగించి ఖాన్‌సాబ్ గదిలోకి పంపాడు.

గది తలువులు మూసుకున్నాయి.

సెంట్రీ ఒక్క పరుగున బైటకూర్చున్న వాళ్ల దగ్గరికి పరిగెత్తాడు. విషయం చెప్పాడు.

అంతా తోసుకుంటూ ఒక్క పరుగున లోపలికొచ్చారు. ఒక్కో ఆడపిల్ల సంకెళ్లు తొలగించి ఎదురుగా కనిపించిన గదుల్లోకి తీస్కెళ్లి తలుపులేసుకున్నారు.

వృద్ధులు, పసి పిల్లలు మిగిలారు.

తీతూ అక్కడికి చేరుకున్నాడు మెల్లిగా

'పదండి. మెల్లిగా నాతోరండి. కింద వ్యాన్‌లో కెళ్లి కూర్చోండి' అన్నాడు మెల్లిగా వృద్ధులొక్కొక్కళ్లు ఒక్కో పసిపిల్లని తీసుకొని మెల్లిగా బిల్డింగ్‌లో నుండి బైటపడ్డారు.

ఈలోపు ఆ గదుల్లోనుండి భీకరమైన శబ్దాలు ధ్వనులు, అరుపులు.

తలుపులు తెరుచుకున్నాయి.

హీరోలంతా దెబ్బలుతిని ప్రాణావశిష్టంగా పడుకున్నారు.

కాత్యా పరిగెత్తుకుంటూ ఖాన్ గది వైపొచ్చింది.

'చండీ చండీ' అంటూ తలుపు బాదింది. పోరాటపు శబ్దాలు విన్పిస్తున్నాయి.


చుట్టూ చూసింది కాత్యా.

మూలగా పెద్ద ఐరన్‌రాడ్ కన్పించింది. అది తీసుకొని తలుపుల మీద బలంగా బాదింది. పది దెబ్బలు వేసేసరికి తలుపులు విరిగాయి. ఖాన్ చేతులనుండి తప్పించుకోవటానికి చండి ప్రయత్నిస్తోంది. శబ్దానికి వెనక్కి తిరిగాడు ఖాన్. కాత్యా వైపుకి అతను తిరగ్గానే చేతిలోని రాడ్ ఎత్తి కసిగా వాడి గుండెల్లో దింపేసింది. వాడు భయంకరమైన కేకతో విరుచుకు పడిపోయాడు. ఆమె కళ్లల్లో తృప్తి తళుక్కుమంది.అది అనందిస్తూ కూర్చునే టైమ్ కాదు.

కాత్యా చండిని లేవదీసి 'పద, తీతూ వచ్చాడు తప్పించుకుందాం' అంది.

'అక్కా. .శక్తి...' ఆగింది చండి.

'శక్తికి ప్రమాదమా! మనం తప్పించుకుంటే ఆమె క్షేమంగా బైటపడగలదు. పద' అంది చండిని లాక్కెళ్తున్నట్లుగా పట్టు




## సాగరమథనం

కొని కిందికి దిగుతూ కాత్యా.

ఈ కార్యక్రమమంతా ఆ బిల్డింగ్‌లో అతి నిశ్శబ్దంగా జరిగిన సంగతి మహావీర దూతకింకా తెలీదు.

శక్తి ఆర్డర్స్ కోసం, వ్యాన్లు ఆగివున్నాయి. ఆమె ఓకె. అనగానే స్టార్ట్ అవుతాయి. అంతా నిశ్శబ్దంగా వ్యాన్‌లలో కూర్చున్నారు.

పైనున్న హెలికాప్టర్లు ఆమెకై వెయ్యి కళ్లతో వెతుకుతున్నాయి. ముందునుండి వస్తున్నారు. పది మంది సెంట్రీలు కాల్పులతో.

గన్‌లో తూటాలె పోయినాయి. ఆ విషయం వాళ్లకి తెలియకూడదు. శక్తి ప్రాణాలకు తెగించి పరిగెత్తింది. అటు వైపు నుండి ఎలాంటి కాల్పులు లేకపోయేసరికి రెట్టించిన ఉత్సాహంతో సెంట్రీలామెను వెంబడించారు

తన భవనంలో కాలుగాలిన పిల్లిలా, కల్లుతాగిన కోతిలా అరుస్తున్నాడు. ఒకచోట నిలువలేకుండా అటు ఇటు పచార్లు చేస్తున్నాడు. మహావీర దూత-

కారణం అతని టీ గోడౌన్స్ ధ్వంసమయ్యాయి టెక్స్‌టైల్ మిల్స్ బూడిదయ్యాయి.

అతని ఆయిల్ టాంకర్లు ఆకాశాన్నంటే మంటల్లో తగలబడుతున్నాయి.

తనకింత నష్టాన్ని కల్గించింది కేవలం ఒక ఆడపిల్ల. ఒక ఆడపిల్ల.

ఇంత ధైర్యం, తెలివి, చాకచక్యం, గల ఆ పిల్లని తన మందీ మార్బలం ఎవరూ పట్టుకోలేక పోయారు. తన అనుచరులంతా ఏమయ్యిందీ అతని కర్థం కావటం లేదు.

ఎటు చూసిన మంటలు, తగలబడిపోతున్నాయి తన ఆస్తులు.

తన బిల్డింగులు కళ్లముందే పునాదులతో సహా లేచిపోతున్నాయి.

ఎక్కడ జరిగిందో లోపం-

ఇంతలో శామ్యూల్, జాన్ వచ్చారు.

'ఎక్కడ చచ్చారు మీరు,' ఆవెశంగా అడిగాడు మహావీర దూత.

"బాస్. ఆయిల్ టాంకర్లు తగలబెట్టింది - ఆరోజు షియా హోటల్లో మన వాళ్లను కొట్టినవాడే, వాడే మాష్టర్స్‌ని స్థిత బోధి కప్పగించింది, వాడే ఇంజనీర్‌ని పట్టికెళ్లింది.

'ఇన్ని చేసింది వాడేనని తెలిసి, వాణ్ణి చవటల్లా వదిలేశార్రా దద్దమ్మల్లారా-

'వాడిప్పుడు మన ఎస్టేట్స్ కొచ్చాడని తెలిసింది. ఇంక చూడండి, వాడి శవాన్ని తెచ్చి చూపిస్తాం'

'మాటలు గాదు చేతల్లో చూపండి'

**ఎమ్. చాంద్‌భాష, ఎమ్మిగనూర్;**
**టి. కొండలరావు, చాగల్లు.**

ప్ర: శ్రీలంకలో ప్రస్తుత పరిస్థితి రావడానికి గల కారణాలేమి?

జ: ఏ దేశంలోనైనా అల్లర్లకిగాని, తిరుగుబాటుగ్గాని, పోరాటానిగ్గాని, విప్లవానిగ్గాని మూల కారణాలు దారిద్ర్యం, నిరుద్యోగ సమస్య, ఆర్థిక అసమానతలు. శ్రీలంకలోనూ ఇవే కారణాలు కొన్ని శక్తులు వీటిని అవకాశంగా తీసుకుంటున్నాయి

**వీరమాచనేని శ్రీధర్, విజయవాడ.**

ప్ర: శ్రీలంకలోని ప్రస్తుత పరిణామాల దృష్ట్యా ఆ దేశంపై భారత వైఖరి ఎలా వుండాలంటారు?

జ: స్వదేశీ వ్యవహారాల్లోనే మనది తటస్థ వైఖరి ఇక విదేశీ వ్యవహారాల గురించి అడిగేదేముంది

**ఎమ్. చంద్రశేఖర్, పట్టాభిపురం, గుంటూరు.**

ప్ర: శ్రీలంకలో కూడా మన దేశంలో లాగానే రాజకీయ నాయకులే అన్ని అనర్థాలకూ మూలం అనుకుంటాను మీ వుద్దేశ్యం?

జ: ఆ రాజకీయ నాయకుల్ని ఎన్నుకొనేది ప్రజలేకదా. కాబట్టి ఆ బాధ్యత వీరిదే



# రచయిత్రి జవాబులు

**గుబ్బల శ్రీనుబాబు, పూనె.**

ప్ర: మనదేశం అనేక చిక్కుల్లో ఆర్థికంగా వెనకబడి వుండి ఐ పి కె ఎఫ్ ని శ్రీలంక పంపటం సమంజసమేనా?

జ: ఐ పి.కె ఎఫ్ శ్రీలంక వెళ్ళటం 'సార్క్' సభ్య దేశంగా మన బాధ్యత

ప్ర ఐ పి కె.ఎఫ్ శ్రీలంక వెళ్ళటం పుల్లయ్య వేమారం వెళ్ళడంలా వుందేమో?

జ. కాదు 'భారత సైన్యం శక్తి సామర్థ్యాలు మన దేశ రక్షణకే గాక ఇరుగు పొరుగు వారికీ రక్షణ కల్పిస్తాయనే విషయం చాటి చెప్పారు

**భోగేశ్వర్రావు, జాల్నా, మహారాష్ట్ర.**

ప్ర జమ్ము-కాశ్మీర్ విషయంలో పాక్ కల్పించుకోవటాన్ని నిరసిస్తున్న మనం శ్రీలంక అంతరంగిక విషయాల్లో జోక్యం కల్గించుకోవడం ఎంతవరకు సమంజసం అంటారు?

జ పాకిస్తానీయు లెవరూ జమ్మూ-కాశ్మీర్‌లో లేరు కాని మన సోదర తమిళులు శ్రీలంకలో మూడు ప్రధాన పట్నణాల నిండుగా వున్నారు అదీగాక శ్రీలంక మన సహాయాన్ని అర్థించినమీదటే మన ఐ పి కె ఎఫ్ అక్కడికి వెళ్ళింది

ప్ర: జైళ్ళలో యు టి అంటే ఏమిటి? సి టి అంటే ఏమిటి?

జ: యు టి అంటే అండర్ ట్రయల్స్ సి టీ అంటే కన్విక్ట్స్ అంటారు జైళ్ళ పరిభాషలో

హుంకరించాడతను.

ఒక్కమనిషి ఆఫ్టరాల్ ఒక మనిషి ఇన్ని పనులెలా చేశాడు? అతనికి నమ్మశక్యం గావటంలేదు.

సాగర్ మహావీరదూత బిల్డింగ్ లోకే ప్రవేశించాడు. చీకటిని చాటుగా చేసుకొంటూ ఎదురుగా వున్న గదిలోకెళ్ళాడు. జేబులో నుండి పెన్‌టార్చి సాయంతో ఆ ప్రదేశాన్ని పరిశీలించాడు. దాని ప్రక్కగా ఉన్న గదికి తాళం వుంది. ఒక్కటే దెబ్బ సూటిగా చూసి కొట్టాడు. తాళం ఊడొచ్చింది. గటగట తలుపులు తీసుకొని లోపలికొచ్చాడు. అక్కడ మెట్లు ఉన్నాయి. వాటి గుండా దిగి క్రిందికొచ్చాడు. దాదాపుగా ఐదొందల మంది కుర్రాళ్లు ప్రాణాలు కళ్లల్లో పెట్టుకొని ఉన్నారక్కడ.

వాళ్లనలా చూచేసరికి అతని కళ్లు చెమర్చాయి. అసలు వాళ్లలో జీవం వుందా లేదా అని దగ్గరికెళ్లి కదిపాడు.

'దాహం' అంటూ సైగ చేశాడు కుర్రాడు.

చుట్టూ చూశాడు కూజా కన్పించింది. గ్లాసుతో నీళ్లు తెచ్చి కుర్రాడికి త్రాగించాడు. వాళ్లెవరో అర్థమైంది సాగర్‌కి. వారంతా విద్యార్థి నాయకులు.

ఇంకొంచెం పక్కకి వెళ్లాడు.

# సాగరమథనం

అక్కడ 'సమరసింగె' కన్పించాడతనికి. దగ్గరగా వెళ్లి తట్టి 'నువ్వు సమరసింగెవి' కదూ అడిగాడు.

'మీరెవరు? ఇక్కడికెలా రాలగలిగారూ' ఆశ్చర్యంగా చూస్తూ అడిగాడు సమరసింగె.

అతని కట్లు విప్పుతూ "ఐ.పి.కె.ఎఫ్. ఉన్నంతకాలం సాయం చేయటానికొచ్చిన వారితో కూడా గొడవలు పెట్టుకున్నారు. వాళ్లు వెళ్లిపోయారు. సింహళ ఈలం, సిలన్‌స్ప్రింగ్, పి.వి.పి. అంటూ గ్రూపులు కట్టుకొని ఒకరినొకరు చంపుకుంటూ మీకు మీరే అన్యాయం చేసుకొన్నారు" అన్నాడు. సమరసింగెకు మాట్లాడ్డానికి ఓపికలేక ఊర్కుండిపోయాడు.

'మీరంతా స్టూడెంట్ లీడర్స్ కదూ మీ అందరిని బైటికి పంపే ఏర్పాటు చేస్తాను. ధైర్యంగా ఉండండి' అంటూ గబగబా బైటకొచ్చాడు.

బైట నిలబడివున్న దిలీప్‌కి అతను చేయాల్సింది చెప్పాడు.

అప్పటికే అక్కడికి చేరుకున్న సిలన్‌స్ప్రింగ్ సభ్యులు లోపలున్న అందరిని బైటకి చేరవేస్తున్నారు.

సాగర్ అక్కడినుండి కదలబోయేంతలో విన్పించింది మహావీర దూత గొంతు.

'సాగర్, శక్తి మా చేతుల్లో వుంది. మర్యాదగా లొంగిపో'

మహావీర దూత పర్సనల్‌గా వుంచుకునే అతని విశ్రాంతి భవనం వైపు పరిగెత్తాడు సాగర్.

దారిలో ఎదురైన వారిని ఎదురు పడ్డట్టుగా కాల్చేస్తూ ముందుకు సాగాడు.

అతనెంత స్పీడుగా ముందుకు సాగుతున్నాడంటే ప్రతి ఒక్కడూ సాగర్ తన పక్కనే ఉన్నాడా అని భయపడేంత వేగంగా వెళ్తున్నాడు శత్రువులని దెబ్బ తీస్తూ.

పైకొచ్చేసాడు.


'ఊ! అయితే నువ్వేనన్నమాట సాగర్‌వి.'

అతణ్ణి పైనుండి క్రిందిదాకా పరీక్షిస్తున్నట్లుగా చూస్తూ అడిగాడు మహావీర దూత.

'శక్తి ఎక్కడ?' అతడడిగిన ఒకే ప్రశ్న.

మహావీరదూత విలాసంగానవ్వుతూ 'చచ్చిపోయింది' అన్నాడు

(ఇంకా వుంది)



# వాళ్ళలో ఒకడిగా!

పచ్చిగోళ్ళ సుధ

ఒక్కసారిగా ఆకాశమంతా మబ్బులు అలిమేసాయ్! సన్నటి జల్లు కురుస్తోంది. ఆ వాతావరణం ఎంతో అహ్లాద కరంగావున్నా.. ..నా మనసులోమటుకు అల్లకల్లోలం చెలరేగుతోంది. వరండాలో అటూయిటూ పచార్లుచేస్తూ..... సిగరెట్ మీద సిగరెట్ వెలిగిస్తున్నాను.

ఎంత మర్చిపోదామన్నా మరుపురాని, మరువలేని ఆ సంఘటన తన మనసుని పిండుతోంది. సంద్రంలో పిడుగు పడినంత అలజడి తన ప్రశాంత మనసు మందిరంలో...తుఫానురేపిన ఆ సంఘటతోనే తనో నిర్ణయానికి వచ్చాడు

కాలేజీలో ఆషాలతకు అవమానం జరిగింది. అదీ లెక్చరర్ వల్ల ఆషాలత అందగత్తె తెలివైన స్టూడెంట్ ఆమె కళ్ళలో కాంతి, ఎదుటివారిని ఆకట్టుకునే ఆకర్షణ ఆమెకు వరాలు కాదు. .. శాపాలుగా ఆమె జీవితంతో ఆడుకుంటున్నాయి. ప్రతిరోజు క్లాసుకువచ్చి పాఠాలు చెప్పవలసిన లెక్చరర్ ఆషాలత అందానికి ముగ్ధుడయి, ఆమెనే చూస్తూ, తనొక 'గురువు' అన్న విషయం పూర్తిగా మర్చిపోయి ఒకరోజు ఆ అమ్మాయి చెయ్యిపట్టుకున్నాడు.

అక్కడితో ఆగలేదు . . అలా... . అలా.. ప్రతిరోజూ ఆమెను ఎక్కడో ఒకచోట ఏదోవిధంగా తాకుతూ.....పరవశించిపోతున్నాడు. పాపం ఆ అమ్మాయి భయపడి ప్రిన్సిపాల్ కి చెప్పలేదు. కాలేజీలో న్యూసెన్స్‌గా తయారయింది యీ గొడవ. ఉదయం ఆషాలత క్లాసుకు వెళుతుంటే.....ఆ లెక్చరర్ ఆమె వెనుకే ఫాలోఅయి.....ఆమె బుగ్గమీద గాఢంగా ముద్దిచ్చి 'నిన్ను ప్రేమిస్తున్నాను ... పెళ్ళిచేసుకుంటాను' అన్నాడు

ఆమె దీనంగా 'ప్లీజ్.....నా జీవితంతో ఆడుకోకండి ....వదిలేయండి' ప్రాధేయపడుతుంటే అంతా చూస్తున్న నేను మరి అక్కడ నిలువలేక ఆ లెక్చరర్ కాలర్ పట్టుకున్నందుకు నాకు సస్పెన్షన్ సర్టిఫికెట్ బహూకరించింది కాలేజీ

నేను ఆ క్షణంలోనే గట్టి నిర్ణయం తీసుకున్నాను. ఎక్కడ ఏ ఆడపిల్లకు అన్యాయం జరిగినా. ...మనసున్న మనిషిగా అడ్డుపడాలని-తన జీవితం ఏమయినాకానీ....ప్రజాచైతన్యం చూడగలగాలని

నేను రూమ్‌కి వచ్చేసరికి నా తండ్రి వ్రాసిన లెటర్ వచ్చివుంది అర్జంటుగా తనని బయలుదేరి రమ్మని - ఏదో పెళ్ళి సంబంధాలు చూడాలని వ్రాశాడు నాకు వెళ్ళాలని లేకపోయినా వెళ్ళవలసిందే!

ఎందుకంటే.....ఈసారి లెటర్ రాదు లెటర్‌కి బదులు నాన్నే వచ్చేస్తాడు తుఫాను వచ్చినంత గొడవచేస్తాడు.

"వెళ్ళక తప్పదు. వెళ్ళకపోతే పెద్ద రాద్ధాంతం చేసేస్తాడు తండ్రి పెళ్ళిసంబంధాలంటూ సంవత్సరానికే ఆరునెలలు కాలేజీకి శలవు పెట్టించే తండ్రంటే . చిరాకు అనిపిస్తోంది. అయినా తండ్రి

మీద వున్న ప్రేమ తనని వెళ్ళేటట్టు చేస్తోంది. రెండుజతల బట్టలు బేగ్‌లో పడేసుకుని బస్టాండుకు నడిచాను.

బస్ టైమ్‌కి తగలడదుగా. ఈ బస్సుల పరిస్థితి ఈ దేశ దీనస్థితి ఎవరికి తెలియంది కనుక. అలాగే బస్‌కోసం చూస్తూ కూర్చున్నాను. గంట గడిచాక నేను ఎక్కవలసిన బస్ కంగారుగా వచ్చి ఆగింది. బస్‌లోనుండి జనం చీమలబారులా దిగుతున్నారు. దిగేవారు దిగకుండానే ఎక్కేవారు ఎక్కడానికి ప్రయత్నిస్తున్నారు. కండక్టర్ అరుస్తున్నాడు ఓసారి ఆగమని.

అక్కడ ఓ కురుక్షేత్రంలా వుంది. బలంవున్నవాడు ముందుగా ఎక్కగలుగుతున్నాడు. బలంలేనివాడు కింద మిగిలిపోతున్నాడు.ఆడవాళ్ళను తోసుకుంటూ....రాసుకుంటూమగవారుఎక్కేస్తున్నారు. 'లేడీస్ ఫస్ట్' అన్నమాట అక్కడ అర్థంలేకుండాపోయింది. ఆ తొక్కిసలాటలో ఓ ముసలావిడ పడిపోయింది. ఆవిడ్ని లేవదీసి ఓ పక్కన కూర్చోబెట్టాను. మరోఆమె పసిపాపతో బస్ ఎక్కలేక అవస్థపడుతోంది. ఆమె చేతిలోనుండి పాపను నేను తీసుకుని ఆమెను ఎక్కమన్నాను. అలా అందర్కీ సాయపడుతూ చివరిగా నేను మిగిలిపోయాను.

బస్ కదులుతున్న సమయంలో ఒక్కవుదుటన బస్‌లోకి గెంతి, బస్ రాడ్‌ను పట్టుకుని వ్రేలాడుతున్నాను. రోడ్డుబాగోక కుదుపుగా వుంది. ఆ కుదుపుకు పక్కనవున్న ఆమెమీద పడ్డాను. సారీచెప్పేలోపే ఆమె లారీ తిట్లు తిట్టింది: అప్పుడు చూశాను ఆమెవైపు. ఆమె ఎవరోకాదు..... పాపను నా కిచ్చి బస్ ఎక్కిన ఆమె. కనీసం ఆ కృతజ్ఞత అయినా లేకుండా తిడుతోంది. నా ఆశయాలు, మంచితనం ఆమెముందు పనికిరాలేదు. ఛ వెధవ మనుషులు....సంస్కారంలేదు. వాళ్ళకోసం తాపత్రయపడి, సాయపడి తనకి సీటు లేకుండా చేసుకున్నాడు.... కానీ మిగిలింది ఏమిటి? ప్రశ్నించుకోకుండా వుండలేకపోయాను.

కండక్టర్ 'టిక్కెట్...టిక్కెట్' అని అరుస్తున్నాడు.

# వాళ్ళలో ఒకడ్ని!

పడిపోయిన ముసలావిడ ఏదో పేరు చెప్పి ఓ టిక్కెట్ అడిగింది డబ్బులిస్తూ.

"మరో పదిపైసలు యివ్వు" అన్నాడు కండక్టర్.

"లేవుబాబూ! పుణ్యముంటుంది. ముసలిముండని. పదిపైసలు వగ్గేయ్ బాబూ!" అర్థించింది.

"డబ్బుల్లేకుండా బస్సెలా ఎక్కావ్? అందరికీ అలవాటయిపోయింది పదిపైసలు నీ బాబు యిస్తాడనుకున్నావా? దిగవమ్మా. దిగు" నిర్లక్ష్యంగా అంటున్నాడు. వెంటనే నా జేబులోనుండి పదిపైసలు తీసియిచ్చాను. అతను టిక్కెట్ యిచ్చాడు.

అరగంట ప్రయాణం చేసాక ఓ వూరు వచ్చింది. అక్కడ బస్ చాలావరకూ ఖాళీ అయిపోయింది. గాలి పీల్చుకున్నాను. కాళీ అయిన సీట్లో కూర్చున్నాను. బస్ మళ్ళీ కదిలింది.

ఉదయం 'వీక్లీ' తిరగేస్తూ చూస్తున్నాను. నా పక్కసీట్లో అతను 'ఓసారి ఆ పుస్తకం యిస్తారా?' అడిగాడు. నేను చదవకపోయినా....నా పుస్తకమే కనుక ఎప్పుడయినా చదువుకోవచ్చునను కుంటూ ఆ పుస్తకాన్ని అతనికి అందించాను. అలా అందిస్తూ అప్పుడే చూశాను ఆ వెనుక సీట్లో కూర్చున్న ఆమెను.

ఆమె చాలా అందంగా వుంది. శరీరానికి పట్టిన చెమటను సుకుమారంగా కర్ఛీఫ్‌తో అద్దుకుంటోంది. తెల్లని తెలుపు-ఎర్రని పెదవులు నిజంగా అంతటి అందాన్ని కాలేజీలో కూడా చూడలేదు. పుస్తకాల్లో వర్ణించినట్టు కనుముక్కుతీరు ఎంతో అందంగావుంది. ఓసారి నావైపుచూసి, కళ్ళు దించేసుకుంది. ఇంత అందాన్ని ఈదేశంలో కాపాడుకోవాలంటే కష్టమే అనిపించింది.

కాలేజీలో తన స్నేహితుల మధ్య తీసుకున్న నిర్ణయం ఓసారి గుర్తుకు వచ్చింది. "ఎక్కడ ఏ అన్యాయం జరిగినా.....మనం ప్రతిఘటించాలిరా. చట్టం ఏదో చేస్తుందని, న్యాయం జరుగుతుందని ఆలోచిస్తూకూర్చుంటే.... నష్టం జరిగిపోకమానదు. వాక్స్వాతంత్ర్యం వున్న మనం మనదేశంలో వున్న లోటును గొంతెత్తి చాటుదాం. కట్నాలను కాటికి పంపుదాం. కన్నెలను కాపాడుదాం. యువత తలచుకుంటే.... చేయలేంది లేదురా.....యిది మనందరం మనస్ఫూర్తిగా తీసుకుంటున్న నిర్ణయం" అంటూ ఒకరిచేయి ఒకరుపట్టుకుని కలసికట్టుగా కార్యరూపంలో పెడదామనుకున్నాం.

నా ఎదుటిసీట్లో కూర్చున్నతను అస్తమానం వెనక్కి తిరిగిచూస్తున్నాడు. ఎవరివైపు చూస్తున్నాడాని గమనించాను. నేను అనుకున్నది కరక్టే. ఆ అందమయిన అమ్మాయివైపు అతను పదేపదే చూస్తున్నాడు.

అమ్మాయి కనిపించగానే ఆవురావురుమంటూ చూసే మగాళ్ళంటే..... నాకు అసహ్యం. వాడికి ఎలాయినా బుద్ధి చెప్పాలనుకున్నాను. నా ఆదర్శాలను - ఆశయాలను బ్రతికించుకోవాలనుకున్నాను. అతన్నే గమనిస్తున్నాను. ఓసారి వళ్ళికిలించాడు. ఆమెకూడా అభ్యంతరంలేనట్టు అతని

## 'కొంటె'సలహాలు

లైన్‌మెన్ రక్తం వేరొక పేషెంట్‌కు ఎక్కిస్తే ప్రతి కరెంట్ స్తంభం దగ్గర ఆగుతాడు.

*******

మరీ లావుగా వుండే పేషెంట్లను బల్లపై కాకుండా నేలపై పరుండబెట్టి పరీక్షిస్తే బల్ల రక్షించబడుతుంది.

*******

మీరు ఎం.డి. చదివినా తగిలించుకోకండి. ఎందుకంటే ఎం.డి. అంటే "మనీ దోచుకోవటం".

********

గర్భిణీ స్త్రీలను పచ్చి కోడిగ్రుడ్లను తినొద్దని చెప్పండి. లేకుంటే బిడ్డతో పాటు కోడిపిల్ల కూడా పుట్టొచ్చు!

-ఎ.యన్.యస్. శంకరరావు

వైపు చూస్తోంది.

ఆమె చూడ్డానికిక్కూడా అర్థంలేక పోలేదు. అతనూ వయసులో వున్నాడు. అందగాడు. ఇద్దరి వయసులూ......పరిసరాలను, పరిస్థితులను గమనించేస్థితిలో లేవు. నాకుమాత్రం చాలా బాధగావుంది. అలా చూపులుకలుపుకుని 'ప్రేమ దోమ అంటూ అన్నీ అర్పించుకున్నాక, ఆ మగమహారాజు వచ్చినదారినే చక్కాపోతే....ఆ అందమయిన ఆడపిల్ల బ్రతుకు ఏంకాను?'

వాడు నవ్వితేమాత్రం...ఆమెకూడా నవ్వాలా? అదే నాకు నచ్చలేదు. అతన్ని పిలిచి అందరిలో బాగా చీవాట్లుపెడదామని నా మనసు వూరికే వుబలాటపడిపోతోంది. అయినా నిగ్రహించుకుంటున్నాను. మరికొంతసేపు చూడొచ్చు ఏంచేస్తాడో అని...

ఐదు నిముషాలకు ఓసారి బుర్రతిప్పడంమాత్రం మానలేదు. గడియారంలో ముల్లయినా అలసిపోయి ఆగిపోతుందేమోకాని.....వాడి బుర్ర ఆగలేదు.

**అంతలో బస్ ఆగింది.**

మా వూరు వచ్చేసింది. ఆశ్చర్యపోయాను అసలు ప్రయాణం చేసినట్టేలేదు. నేను దిగడానికి సిద్ధమవుతున్నాను. అతనుకూడా దిగిపోతున్నాడు. అతనిదికూడా మావూరేనన్నమాట. అయితే గడ్డిపెట్టొచ్చు....అనుకున్నాను. ఆ తర్వాత ఆమెకూడా దిగిపోయింది. నాలో ఆశ్చర్యం. ఆమెది కూడా మావూరేనా....? లేక అతని కోసం....మరి ఆలోచించలేకపోయాను. వాళ్ళిద్దర్నీ వెంబడించాలి. ఆమెను కాపాడాలి. దృఢంగా అనుకున్నాను.

బస్ కదలబోతోంది. అప్పుడు గుర్తుకువచ్చింది కండక్టర్ నాకు చిల్లర యివ్వవలసిన విషయం. బస్‌తో పరిగెత్తుతూ అడిగాను. వాడు నా ముఖంలోకి అదోలా చూస్తూ, అర్ధరూపాయి కోసం అలాపరుగెత్తాలా? బస్‌కిందపడి చస్తావ్! అంటూ అర్ధరూపాయి అడుక్కునేవాడిచేతిలో పడేసినంత నిరసనగా పడేశాడు.

నాలో వుద్రేకం పెరిగింది. 'ఇందాక ముసలావిడ అర్థిస్తున్నా పదిపైసల కోసం కఠినంగా మాట్లాడిన నువ్వటరా.....నాకు చెప్పేది.....నీలాంటివాళ్ళను నేను చాలామందిని చూసాను. ప్రభుత్వం జీతం యిస్తున్నా.....ప్రజల సొమ్ము కాజేయాలనుకునే దొంగనాయాళ్ళుమీరు. మీకు శిక్షలేదు. .అందుకే బడాదొంగతనం....!' అంటూ అక్కడ్నుంచి నడిచాను.

నా కళ్ళు వాళ్ళిద్దరికోసం వెదికాయి. వాళ్ళు యింకా అక్కడే తచ్చాడుతున్నారు. బహుశా రిక్షాకోసమయివుంటుంది. రిక్షాలోఅయితే ఎవరికీ కనిపించకుండాపోవచ్చునని వాళ్ళ ప్లాను కాబోలు. అది పల్లెటూరు కావడంవలన వున్నవే రెండు రిక్షాలు. వాటిక్కూడా ఎప్పుడోకాని బేరంరాదు.

నేను కూడా అలాగే నిలబడ్డాను వాళ్ళను గమనిస్తూ. ఐదునిముషాలు అటూయిటూచూసి, యిద్దరూ ముందుకు నడవసాగారు. ఆ యిద్దరి వెనుకా కొంతదూరంలో నేను, వాళ్ళను ఫాలో అవుతున్నాను. ఆమె అతనికి బలికాకుండా ఆమెను కాపాడాలన్న ఆతృతే....వాళ్ళతో నడిపిస్తోంది.

వాళ్ళఎదురుగా సోడాకొట్టు రావుడు వస్తూ "దండాలయ్యా...ఏటిబాబూ... రిచ్చాలేదా? అమ్మగార్ని కాలినడకన తీసుకెళ్తున్నారు?" వినయంగా అడుగుతున్నాడు.

"ఒక్కరిక్షా కూడా లేదు రావుడూ. నా భార్యకు ఆరోగ్యం బాగోకపోతే.... పట్నంలో చూపించివస్తున్నాను" అంటున్నాడు అతను.

అతని మాటలు విన్న నాకు మతిపోయింది. పిడుగుపడినట్లయింది. ఒక్కసారిగా ఉప్పెనవచ్చి నన్ను ముంచెత్తినట్టుగా అనిపించింది. సిగ్గు నా మనసునిండా నిండిపోయింది. పశ్చాత్తాపం నా నరాల్లో ప్రవహించసాగింది.

ఒక ఆడా మగా కలిసివెళితే.....నిందలువేసే ఈ సమాజాన్ని మార్చాలనుకునే తను.....వాళ్ళల్లో ఒకడిగా మిగిలిపోయాడు. ఆచర్యాల ఆచరణలో.....మంచితనం.. ...ముసుగులో.....తనూ అందరిలా ఆలోచించాడు.

అంతవరకూ ఆమెను కాపాడాలన్న ఆతృత తనకి పుత్సాహాన్నిచ్చింది. ఆనందాన్ని పంచింది. కానీ...భార్యా భర్తలను తను చెడుగా వూహించుకున్న వూహ గుర్తుకు వచ్చేసరికి మనసు సిగ్గుతో చచ్చిపోయింది.

నీరసంగా యింటివైపు అడుగులేశాను. ఈ సమాజం ఎప్పటికి మారుతుందో....ఇక నాకు నమ్మకంలేదు. ○

## చిత్రాల్లేని వినోద్‌ఖన్నా



అమెరికాలోని రజనీష్ ఆశ్రమం నుంచి తిరిగివచ్చాక వినోద్‌ఖన్నాకు చిత్రాల్లో మంచి అవకాశాలు వస్తాయనుకున్నారు కాని అవకాశం వచ్చిన చిత్రాలన్నీ ఫ్లాప్ అయిపోయాయి. వివాహానంతరం కూడా వినోద్ పరిస్థితిలో మార్పేమీ లేదు. చిత్రాలు ఫ్లాప్ అవటానికి అతని ప్రవర్తనే కారణమట. షూటింగ్‌లకు యిష్టం వచ్చినప్పుడు హాజరయి నిర్మాతలను ఏడిపిస్తుంటాడని అనేకమంది అంటున్నారు. ఇప్పుడు వినోద్‌ను బుక్‌చేసుకోండి అంటూ అతని చెంచాలు నిర్మాతల చుట్టూ ప్రదక్షిణం చేస్తున్నారు. కాని యింతవరకు ఏ నిర్మాతా గ్రీన్ సిగ్నల్ యివ్వలేదు. అయినా 'చేతులు కాలాక..... .... యిప్పుడు బాధపడి ప్రయోజనమేముంది?!



# మణికంఠుడు

ప్రయాగ రామకృష్ణ

<u>ఇంతవరకూ సాగినకథ-6 :</u> మహోన్నతమైన దాంపత్య జీవితం గురించి, ధర్మార్థ కామమోక్షాలను అనుభవించటం గురించి ప్రజలకు తెలియచేయవలసిన బాధ్యతను బ్రహ్మ తన మానసపుత్రుడైన అత్రి మహర్షిపై వుంచుతాడు. అత్రి భార్య అనసూయ పాతివ్రత్యాన్ని పరీక్షించి దత్తాత్రేయుడ్ని ప్రసాదిస్తారు. గాలవ మహర్షి కూతురు లీలాదేవితో దత్తుడికి వివాహమవుతుంది. కామకేళికి యిష్టపడని దత్తాత్రేయుడు మహిషివి కమ్మని లీలను శపిస్తాడు. కోపావేశంతో మహిషి ఇంద్రలోకంపై దాడి చేస్తుంది. నారదుడి సలహాపై త్రిమూర్తులు సృష్టించిన మహిషం అదృశ్యం కావటంతో మహిషి బ్రహ్మ గురించి తపస్సు చేసి వరాలు పొందుతుంది. బ్రహ్మ యిచ్చినవరం తెలుసుకొన్న మహావిష్ణువు దేవతలపై మండిపడతాడు.

(గత సంచిక తరువాయి)

దేవేంద్రుడికి సృష్టి స్థితి లయకారుల మీదే విరక్తి జనించింది. ఏమిటీ త్రిమూర్తులు? తమకెవరినుంచైనా ఆప దవస్తోందని గ్రహిస్తే వాళ్ళకు ముందు గానే వరాలిచ్చి ఆకట్టుకునే తెలివైనవాళ్ళు. చిన్నవాళ్ళ కష్టాలు పట్టించుకోని స్వార్థ పరులు. "నా బాధలకు, భయాలకు ఫలానా వాళ్ళు కారణం" అని చెప్పినా వినకుండా మనకెందుకులే అని నిమ్మకు నీరెత్తినట్టుండే అసహాయశూరులు. "నా చిన్నిపొట్టకు శ్రీరామ రక్ష" అనుకునే దొంగ దేవుళ్ళు.....ఈ దేవతలు ఈ సుర లోకం అన్నిటికన్నా ముఖ్యంగా ఈ విష్ణు మూర్తికి......ఏడేళ్ళ కుర్రాడిగా వెళ్ళి బలి చక్రవర్తి దగ్గర దేహీ అని చెయ్యి జాపి అతని నెత్తిమీదే కాలుపెట్టాడు. అసలు చిన్నతనంనుంచే మాయలు చేస్తుండేవాడు. అలాంటిది యిప్పుడు చేయడం ఒక లెక్కా! పుట్టటమే చెరసాలలో పుట్టాడు. మాయావి కాక మరేమవుతాడు? వంచనకి ప్రతి వంచన చేయగలిగినవాడు, మోసాన్ని మోసంతో జయించగలిగినవాడు, ఎదుటి వాడు కొట్టిన చాటు దెబ్బకి దొంగ దెబ్బ కొట్టగలిగినవాడు, తన చేతులకు మట్టికాకుండా ఎంతటి కార్యమైనా అవలీ లగా సాధించగలిగినవాడు, తాను ఆయుధం పట్టకుండా, ఒక్క పరుష వాక్యమైనా పలక్కుండా భీకర సంగ్రామాన్ని నడిపి విజయాన్ని చేజిక్కించుకున్నవాడూ శ్రీ మహావిష్ణువే సహాయ నిరాకరణచేస్తే తనకు దిక్కెవరు?

ఈ ఆలోచన వచ్చేసరికి ఇంద్రుడికి కాళ్ళలోంచి వణుకు పుట్టింది. 'దేవు డైనా, మనిషైనా అతని అసలు స్వరూపం కష్టాల్లో వున్నప్పుడే బైటపడుతుంది. నీకు వచ్చినకష్టం మామూలు చిల్లరదేవుళ్ళు కలలో కూడా వూహించలేనంత ఘోర మైంది. ఇటువంటి పరిస్థితుల్లోనే ఎవ రైనా ధైర్యంగా వుండాలి. అందరితోనూ మంచిగా వుంటూ కార్యం సాధించుకో వాలి' అని సలహా యిచ్చాడు నారదుడు.

దేవేంద్రుడు కళ్ళనీళ్ళ పర్యంతమ వుతూ 'ఇంత దయనీయమైన పరిస్థితి ఎవ రికీ రాకూడదు. ఇదంతా మీకు చాలా చిన్న విషయంగా కనబడవచ్చు. కాని నావైపు నుంచి ఆలోచిస్తే....' నార దమహర్షి కల్పించుకుని 'నాకు తెలుసు' అన్నాడు.

ఇంద్రుడు చేతులు జోడించి 'ఈ ఆపద సమయంలో ఆదుకోవల్సింది మీరే' అన్నాడు.

మహర్షి నవ్వాడు.

కళ్ళతోనే 'సరే' అని పరమేశ్వరు డున్న చోటుకి కదిలివెళ్ళాడు.

* * * * *

ఆడదీ అన్న జీవే లేకపోతే భూలోక, మర్త్యలోక, సువర్లోక, పాతాళ లోకాల్లో ఎక్కడా కూడా యుద్ధాలు జరిగుండేవి కావు. కాంతా కనకాలనేవే లేకపోతే ఏ రాజ్యంలోనూ అక్రమాలు చెలరేగివుండేవి కావు. స్త్రీలోలత లేకపోతే రావణాసు రుడితో రాముడు పోరాడవల్సిన అవసరం వుండేదికాదు. కురు పాండవ యుద్ధానికి ఆస్కారం వుండేదికాదు. రావణుడి నిక్ర ష్టపు చావుకీ, దుర్యోధనుడి దీనారావానికి, కీచకుడి ఆక్రందనకూ ఆడదే కారణం.

మహిషిని హతమార్చేందుకు కూడా ఆ ఆడదే యిప్పుడు రంగంమీదకు రావల్సి వుంది. భోళాశంకరుణ్ణి మెచ్చగొడ్తేగాని ఆపని జరిగేట్టులేదు. నారదుడు తెలివై నవాడు కాబట్టి అందుకు అనువుగా ఒక పథకానికి అప్పటికప్పుడే మనసులో రూప కల్పనచేశాడు. మోసం అన్నిట్లోనూ జరు గుతోంది. అలాంటప్పుడు ఒక మంచి పనికి చిన్న కపటనాటకం ఆడటంలో తప్పేమిటని మనసును సమాధాన పరు చుకున్నాడు. తనాడబోతున్న నాటకంతో కూలగొడ్తున్నది ఒక మహిషినే కాదు, ఆ నాటకం నిజంగా రక్తికడ్తే అందులోంచి ఉద్భవించే ఒక మహా చైతన్యశక్తి సర్వమా నవాళినీ జాగృతం చేస్తోంది. పంచేంద్రియ పంజరబద్ధులైవున్న వారందరినీ మేలుకొలు పుతుంది. ఈ విశ్వమంతా విష్ణుమయమని బోధపరుస్తుంది. తను ఎన్నుకున్న దారిపట్ల తనకు సంతృప్తి కలిగాక మహర్షి క్షణం కూడా వృధా చేయలేదు. శివుడి దగ్గ రికి వెళ్ళి 'పరమేశా! ఎందుకీ విచారం? రాక్షసులకీ దేవతలకీ మధ్య యుద్ధం ఎప్పటినుంచో వున్నదేగా! అయితే జరా మరణాలను జయించాలని దేవదానవులు పాలకడలి నడుమ మంధరగిరిని కవ్వంగా వాసుకుని తాడుగా నిలిపి చేసిన సాగరమ ధనమే అన్నిట్లోకి అద్భుతమైనది. పాల

సముద్రంలో కాలుష్యాలు, విషవస్తువులు కదిలి హాలాహలమై విజృంభించినప్పుడు ఆ కాలకూట విషాన్ని నువు కంఠంలో ధరించడం చూస్తే నువ్వెంత పరోపకారివో తెలిసింది. ఆదికూర్మం ఒక్కటే భూభారాన్ని మోస్తోంది. ధ్రువుడొక్కడే గ్రహ చక్రాన్నంతా తిప్పుతున్నాడు. అలాగే నువ్వొక్కడివే దేవతలను కరుణించి విషాన్ని భరించావు. పరోపకార పరాయణులంటే మీరే.....' అన్నాడు.



ఆ మాటలకు శివుడు గాలికొట్టిన బంతిలా పొంగిపోయాడు. అది గమనించి నారదుడు వచ్చాడు. 'దేవతలందరూ నీకు శిరస్సు వంచి నమస్కరించాలి. నువ్వు హాలాహలం భరించావు కనుకనే ఆ తరవాత క్రమంగా పాలసముద్రంలో ఐరావతం, కామధేనువు, కల్పవృక్షం, చంద్రుడు, శ్రీ మహాలక్ష్మి, అమృతం లభించాయి. అమృతాన్ని అందరం పంచుకోవాలన్న ఒప్పందాన్ని త్రోసిపుచ్చి రాక్షసులు అమృతభాండాన్ని తీసుకు పారిపోయారు'

'అప్పుడు నే నెక్కడికి వెళ్ళాను?' శివుడు చిన్నపిల్లాడిలా అడిగాడు.

# ధరణి నుదయించె దివ్యప్రేమ!



ఆది దంపతుల వలన
అవని కరుదెంచిన
ఆనాటి యా యఘము
ఆవరించెను ఈ జగము
సృష్టి పితను వీడిన మానవుడు
సృష్టమును పూజిస్తూ
మంచిని మరచి
మమతను వీడి
స్వార్థానికి పట్టం కట్టి
అహంకార పాలన చేయ
సృష్టియంతయు పాపపంకిలమాయె
దీనుల ఆక్రందనలు పరముఁ జేర
సృష్టికర్త ఎద జాలితో నిండె!
తన సృష్టి చేసిన క్రూర కృత్యములకు
పరిహారమెవరు... తానే గాక...
అమ్మహేశ్వరుడు
ఆ మహా బలియాగము చేయ
తన కుమారునే పంపె నిలకు!
ఆత్మరూపుడు... అగ్నితేజుడు...
ఆకాశ మహాకాశములు పట్టజాలని

అమ్మహామహుడు
ప్రవచనములన్నియు యధార్థము కాగ
పవిత్ర కన్నియ గర్భమునందు
పసిబాలుడై యవతరించె!
పరుల పశులపాక
పుట్టినిల్లాయె...
పశుల తొట్టియాయె
తూగుటుయ్యల!

లోకమంత తనదైన లోకేశ్వరుడు
ఏమి లేని రిక్తుడుగ
ప్రభవించె నిద్ధరణి!

ఆశ్చర్యకరుడు... ఆలోచనకర్త
నిత్యుడగు తండ్రి ఆయన!
శాంతిదూత... కరుణామయుడు
దేవాదిదేవుడాయన!

తండ్రి కుమార శుద్ధాత్ముడు తానైన
త్రియేక దేవుడాయన...
ఆద్యంతరహితుడాయన!
ప్రేమను నేర్పిన ప్రేమామయుడు
పాపిని క్షమియించిన రక్షకుడు
మరణమును జయించిన
మృత్యుంజయుడు!
నాడు పుట్టినాడు
బేత్లెహేముపురమునందు
నేడె ఉద్భవించు
నీ హృదయ మందిరమందు
రేపు రానుండె మహిమతో
మేఘారూఢుడై...
నూతన రాజ్య సంస్థాపనార్థంబై!
సిద్ధపడుదము
స్వీకరించయా విభుని
వారసులము కాగ
పరమ రాజ్యమునకు!!

\- ఝాన్సీ కె.వి. కుమారి

'ఎక్కడి కెళ్తావు తండ్రీ! కాలకూట విషం పుక్కిటపట్టి మత్తుగా పడుకున్నావు'

'ఆ తరవాతేం జరిగింది?'

'వంచనకి ప్రతివంచనగా శ్రీమహావిష్ణువు జగన్మోహిని రూపం ధరించి రాక్షసులను సమ్మోహితుల్ని చేసింది. తన చేతుల్తో అమృతాన్ని పంచిపెడ్తానని ఆ తెలివిమాలినవాళ్ళని తీయతీయని మాటల్తో మోసగించి ఆ భాండం కాస్తా లాగేసుకుని దేవతలకిచ్చింది.'

'బాగుంది. వెర్రిబాగుల రాక్షసుల్ని మోహిని తన అందంతో పడగొట్టిందన్న మాట!'

నారదుడు నవ్వి 'నారాయణ! నారాయణ! చేసిన పాపం చెబితే పోతుందిగాని ఈశా! అస్ఖలిత బ్రహ్మచారికి నాకే చిత్తచాంచల్యం కలిగింది. అలాంటిది రాక్షసులు దాసోహులు కావడంలో వింతేముంది?' అన్నాడు.

అది విని భార్గవుడు పెద్దగా నవ్వాడు.

నారదుడు తన్మయత్వం నటిస్తూ 'మోహినిని చూసే అదృష్టం నీకు లేకపోయిందిగాని, ఎంత జగన్మోహనంగా వుందనుకున్నావు! వెన్నెల బొమ్మలావుంది. లతలాగ, పువ్వులాగ, వాగులాగ, నదిలాగ...... ఏమో దేనిలాగ వున్నదో, దేనిలాగలేదో చెప్పడం కష్టం. ఈ సృష్టిలో వున్న చక్కదనమంతా ఆమెలోనే చూశాను నేను. వక్షం విశాలం, కళ్ళు కమనీయం, చెంపలు పల్చన, చెవులు సుతారం, పెదిమలు లేత తమలపాకులు, సన్నగా, నాజుగ్గా సుతారంగా కటిభాగం, పట్టు పీతాంబరాల్లో పుత్తడిబొమ్మలా, ఆమె నవ్వితేచాలు ప్రాణమెగిరిపోయి ఆమె చరణ సరోజాల మ్రోల వాలిపోయేలా సౌందర్యనిధిలా, అందాలరాశిలా, సుమధుర సంగీతంలా, సుస్వరంలా, పండిన సంపెంగ పూరంగు ఆకాశంలా, అరవిచ్చిన మందారంలా, సుకుమారంగా సుఖంగా, మనోహరంగా, గంభీరంగా వుంది. ఆమె అడుగుతీసి అడుగు వేసినప్పుడల్లా

# బృహత్ పథకం

శబరిమల అయ్యప్పస్వామి వారి ఆలయ నిర్వహణాధికార బాధ్యత నిర్వహిస్తున్న తిరువాన్‌కూరు "దేవస్వం" బోర్డు ఏటా యీ దేవాలయం సందర్శించ వచ్చే లక్షలాది భక్త తీర్థ యాత్రీకులకు సౌకర్యాల కల్పన నిమిత్తం రు. 60 కోట్ల బృహత్ పథకాన్ని ఆమోదించింది.

తిరువనంతపురంలో కడసారి జరిగిన బోర్డు సమావేశంలో యీ బృహత్పథకం ఆమోదించారు. ఈ పథకం అమలుకు కావలసిన ఆర్థిక సహాయాన్ని అందించవలసినదిగా, ప్రపంచ బ్యాంక్‌ని, కేంద్ర ప్రభుత్వాన్ని విదేశాలలోని భారతీయులను అభ్యర్థించాలని బోర్డు నిర్ణయించినట్లు, పత్రికా ప్రతినిధులకు బోర్డు అధ్యక్షుడు శ్రీ టి. రామన్ భట్టాదిరిపాద్ తెలియజేశారు.

అభివృద్ధి కార్యకలాపాల కోసం పంబలోను సన్నిధానంలోనూ 200 హెక్టార్ల అడవి భూమిని కేటాయించబడేట్లు చేసుకొనే నిమిత్తం తాము, మరో ఇద్దరు బోర్డు సభ్యులూ త్వరలో కేంద్ర మంత్రులనూ, అధికార్లనూ కలుసుకొనుటకు ఢిల్లీ వెళ్ళగలమని ఆయన చెప్పారు.

ఆమె కాలకు వున్న అందెలు మధుర నాదం చేశాయి. ఆజన్మ బ్రహ్మచారిగా వుండిపోవాలని దృఢంగా సంకల్పించుకుని మమతానురాగాలపట్ల తీవ్రవైముఖ్యం పెంచుకుని, కామ సుఖాలపట్ల మనసును రవ్వంతకూడా మొగ్గనీయకుండా తపశ్శక్తితో నిగ్రహాన్ని పెంచుకున్న నాకే చుట్టూ వున్న జనాన్ని లెక్కచేయకుండా చటుక్కున ఆమెను చుట్టుకుని, గుండెలకు హత్తుకుని మొహమంతా ముద్దులతో నింపేయాలనిపించింది. స్వామీ! అదే నువ్వయితేనా....' అని ఒక్కక్షణం ఆగాడు.

అప్పటివరకు మహర్షి చెప్పేదంతా ఊపిరి బిగపట్టి విన్న శివుడు ఆనంద శృంగారసీమల్లో ఎక్కడో విహరిస్తున్నాడు. మధూన్మత్తుడవుతున్నాడు.

నారదుడు గ్రహించాడది. తన పథకం విజయవంత మవుతున్నందుకు తనను తనే అభినందించుకున్నాడు.

'శాంతించు స్వామీ! నీ కైలాసం లోకి నువు వచ్చేయ్. నాకు భయంగా వుంది. పార్వతీ వల్లభుడు జగన్మోహిని కోసం ఉన్మాది అయిపోలేదుగద' అన్నాడు కావాలనే.

## మణికంఠుడు

శివుడు మాట్లాడలేదు. తన లోకాల్లో తను తేలిపోతున్నాడు. 'మోహినీ! నా ప్రియమైన మోహినీ! నిన్ను బ్రతిమాలుకుంటాను. నీ సౌందర్యకాంతిలో నన్నొక్కసారి ముంచెత్తి నాకు ప్రేమాభిషేకం చెయ్. దేవతలను కూడా మంత్రముగ్ధుల్నిచేసే నీ సౌందర్యం గురించి విన్నప్పటి

> **ప్రత్యేక రైలు**
>
> శబరిమలై వెళ్ళే భక్తుల సౌకర్యార్థం దక్షిణమధ్య రైల్వే విజయవాడ డివిజన్‌వారు జనవరి 10వ తేదీన విజయవాడనుంచి ఒక ప్రత్యేక రైలును నడువుతారు. 18 బోగీలు వుండే ఈ రైలులో 612 బెర్తులుంటాయి. తిరుగు ప్రయాణానికి వీలుగా ఈ రైలు ఎర్నాకులంలో జనవరి 17న మళ్ళీ బయలుదేరుతుంది.

నుంచి నీ సమాగంకోసం పరితపిస్తున్నాను. నువ్వెక్కడున్నావో నన్ను పిలు. పిలు మోహినీ! పిలిచిందే తడవు రెక్కలుకట్టుకుని నీముందు వాల్తాను....'

'ఈశా! అయ్యో! పరమేశా! ఏమిటి యిలా అయిపోతున్నావు? జగన్మోహిని మాయలోపడి దగాపడ్డ దానవులతో సమానంగా హావ్వ! నువ్వా తయారయ్యావన్న మాట' అంటూ మాటలు దొరిలించేశాడు మహర్షి.

విపరీతమైన ఆవేశంతో పరమేశ్వరుడు 'నేను జగన్మోహినిని చూడాల్సిందే! చూసి తీరాల్సిందే' అని పెద్దగా అరుస్తున్నాడు.

మహర్షి నవ్వుతూ 'ఇంత చిన్న కోరికకు నువ్వు పిచ్చివాడవు కావడం దేనికి? విష్ణుమూర్తిని నువ్వు అర్థించాలేగాని నీ మాట ఆయన కాదంటాడా? ఆ అనుపమ లావణ్యాన్ని, ఆ జగన్మోహన విలాసినిని, ఆ అనిర్వచనీయ సౌందర్యాన్ని నిజంగా నువ్వు చూడాలనుకోవాలేగాని ఆ సర్వ కళా పరిపూర్ణుడికి రూపం మార్చడం ఒక లెక్కా! వెళ్ళు. వెళ్ళి శ్రీమహావిష్ణువును అడుగు' అని తరిమాడు.

*(ఇంకా వుంది)*

# వీక్లీ పోస్ట్

## ఎడిటోరియలు

నవంబర్ 30 నాటి సంపాదకీయం నేపాల్‌లో నూతన శకోదయం బాగానే ఉంది. కాని 'డెమోక్రటిక్' స్టేట్‌ను మీరు పరోక్షంగా సమర్థించినారు. మతాన్ని రాజకీయాల్లో, రాజ్యాంగంలో లేకుండా, అటు సెక్యులర్ అనే మాట కూడా లేకుండా ఉండి ఉంటే ఎంతో బాగుండేది. అలాగే పార్లమెంటరీ వ్యవస్థను మీరు సమర్థించారు. అమెరికాలోని ప్రెసిడెన్షియల్ సిస్టమ్ వచ్చి ఉంటే బాగుండేది. అందులో 'సెపరేషన్ పవర్స్', సెపరేషన్ ఆఫ్ ఎలక్షన్స్ ఎంతో హుందాగా ఉన్నాయి.

-డా. సిద్ధం కొండయ్య,
సికింద్రాబాద్.

## సీరియల్స్

రజని ముఖచిత్రంతో వెలువడిన పత్రిక మాకు చాలా నచ్చింది. శాతవాహనగారి నేత్ర ధనుస్సు చాలా బావుంది. కామెడీ సీరియల్స్ తగ్గించివేసారు. ఎక్కువగా వేయాలని కోరుతున్నాము. గల్ఫ్, గల్ఫ్ సీరియల్ ఎంతో నచ్చింది.

అల్లంశెట్టి ప్రభావతి,
నర్సాపూర్.

## నిన్న-నేడు

మీరు 16-11-90 వారపత్రికలో ప్రచురించిన "నిన్న-నేడు-రేపు" సంపాదకీయం నిష్కర్షగా, నిష్పాక్షికంగా నేటి రాజకీయ నాయకుల 'వంచన' మనస్తత్వాన్ని చక్కగా ప్రతిబింబచేసింది. ముఖ్యంగా "ప్రసార భారతి" అంటూ దాని ఎంత స్థాయివరకు దుర్వినియోగము చేసినారో ప్రతి భారతీయునికి అర్థమైంది.

తుదిగా మీరు సూచించిన "జీవన సరళి"కి ప్రతీకగా... అంటూ నోరు విప్పడం తెలియని సామాన్య భారతీయులలో నేను ఒకడిగా మిమ్మల్ని మరోసారి మనసారా అభినందిస్తున్నాను.

-ఎం.ఎన్.బి. శివకుమార్,
ప్రొద్దుటూరు.

## మధుర గాయకుడు

ఘంటసాల వెంకటేశ్వరరావుకి నేను కొడుకుగా పుట్టడమే నేను చేసుకున్న పాపం దౌర్భాగ్యమని ఘంటసాలగారి ప్రథమ పుత్రుడు ఘంటసాల విజయకుమార్ డిసెంబరు 3న చిక్కడపల్లి శ్రీ త్యాగరాయగాన సభ ఆడిటోరియంలో 'అభినందన' సాంస్కృతిక సంస్థ ఘంటసాల 68వ జయంతి ఉత్సవం జరిపిన సభలో అన్నారు.

నేను ఎక్కడకు వెళ్ళినా మధురగాయకుడు ఘంటసాల కుమారునిగానే గౌరవిస్తున్నారు గాని, నన్ను కూడా ఒక చక్కని గాయకుడిగా, విజయకుమార్‌గా గుర్తించడంలేదు. రేప్పొద్దున నేను ఘంటసాల కన్నా మధురంగా పాడినా, ఒరేయ్ ఘంటసాల కొడుకు ఎంత బాగా పాడాడో అంటారే తప్పా ఒక విజయకుమార్ మధురంగా పాడాడని అనరే ఈ ప్రజలంతా అని అంటూనే- ఆయన నేను రేపు మరణించినా ఘంటసాల కుమారుడు పోయాడు అని అంటారు తప్పా, విజయకుమార్ అనే ఒక గొప్ప గాయకుడు పోయాడని ఎవరూ అనరు కదా?

అందుచేత నేను సంగీత కచేరీలు ఎక్కువగా చేసే, మా తండ్రి గారైన ఘంటసాలను మరిపించడానికి కృషి చేస్తాను అని సభలో చెప్పగానే ఆ సభకు అధ్యక్షత వహించిన శ్రీ మల్లెమాల సుందరరామిరెడ్డిగారు ఈ విధంగా చెప్పారు - కృష్ణా, గోదావరి నదులు పూర్తిగా ఇంకి ఇకలేనప్పుడు మాత్రమే ఘంటసాలగారి పేరు మరుగున పడుతుంది తప్పా, ఆ నదులున్నంతకాలం ఆయన ఏడుకోట్ల తెలుగువారి హృదయాల్లో నిలచే ఉంటారనుటలో ఎట్టి సందేహం లేదని అన్నారు.

- న్యాయపతి రమేష్‌బాబు,
హైదరాబాద్.

## నాటి చిత్రాలు

నాటి సినిమాల గొప్పతనం సంగీతం, పాటలు, నటన ఇవన్నీ తలచుకుంటే

పాత సినిమాలు చూస్తుంటే ఇప్పటికీ మైమరిచిపోతాం కాని నేడు డిస్కో డాన్సులు, పాటలతో యువతరం ఆలోచనలు వేరుగా ఉంటున్నాయి. అలనాటి మేటి చిత్రాలు శీర్షికన మీరందిస్తున్న వివరాలు ప్రశంసనీయంగా ఉన్నాయి. కొన్ని శీర్షికలు మాయమై కొత్త శీర్షికలొచ్చాయి. సీరియల్స్, కథల విషయంలో పత్రిక 'గెటప్' విషయంలో జాగ్రత్త వహిస్తున్నందులకు సంతోషం. ఈ వారం నటి 'రజని' ముఖచిత్రం (7-12-90) అందంగానే ఉంది. కథల్లో విన్నకోట సుశీలాదేవిగారి 'రైలు వెళ్ళిపోయింది' వాస్తవానికి దగ్గరగా ఉండి, పల్లెటూర్లలో సత్తెమ్మలాంటి సత్తెకాలపు మనుషులు ఇప్పటికీ అక్కడక్కడ తారసపడుతూ ఉంటారు. థాంక్స్. జైదుబాషీగారి న్యూఢిల్లీలేఖ ప్రతివారం ఎన్నో విషయాలను అందిస్తూ పత్రికకే హైలెట్‌గా నిలుస్తుంది.

-పోలోజు వెంకటాచారి, బోడుప్పల్.

## తేనె మనసులు

ఆదుర్తి ఆనాటి హీరోల వత్తిడి తట్టుకోలేక 'తేనె మనసలు' చిత్రాన్ని అన్ని కొత్తముఖాలతో మధుర సంగీత పాటలతో ఒక విప్లవం తీసుకొచ్చారు. అందులో వచ్చిన కొత్తవాళ్లంతా మఖలో పుట్టి పుబ్బలో పోయారు. ఒక్క కృష్ణ మాత్రం సూపర్‌స్టార్.

-చల్లపల్లి వాసుదేవరావు,
అనపర్తి.

## పాఠకులకు మనవి

సకాలంలో అందని కారణంగా ఈ వారం "న్యూఢిల్లీ లేఖ" అందించలేకపోతున్నాము.

-ఎడిటర్.

# బీజింగ్‌లో ప్రేమ పక్షులు







బీజింగ్ ఆసియా క్రీడలలో మన క్రీడా యోధులు విఫలమయ్యారు. అందులో అథెలిటిక్స్‌లో ఆశించిన విజయాలు సాధించలేక పోయారు. పి. టి. ఉష, బహదూర్‌ప్రసాద్‌లు తప్పక స్వర్ణ పతకాలు గెలుస్తారు అని మన క్రీడా పండితులు చెప్పారు. కాని యిద్దరూ బంగారు పతకాలు కైవసం చేసుకోలేక పోయారు. బహదూర్‌ప్రసాద్ నేటి మన మేటి 'మిడిల్ డిస్టన్స్ రన్నర్'. 800 మీటర్సు, 1500 మీటర్సు, 5000 మీటర్స పరుగులో అతనినీ ఓడించగల ధీరుడు యిప్పుడు మనదేశంలో లేడు. పత్రికలు, క్రీడాధినేతలు కోచ్‌లు అతని ప్రతిభ గురించి గొప్పగా చెప్పారు

బీజింగ్‌లో 1500 మీటర్స పరుగులో బహదూర్‌ప్రసాద్ పరాజయం తర్వాత యిదివరకు కొనియాడిన వారే విమర్శించుచున్నారు ప్రసాద్ ప్రవర్తన, నిర్లక్ష్య వైఖరి వలన మనం బంగారు పతకం కోల్పోయాము అంటున్నారు బీజింగ్‌లో ఆసియా క్రీడల గ్రామములో బహదూర్‌ప్రసాద్, 800 మీటర్స మహిళా క్రీడాకారిణి సునీతాకుమారితో తిరుగుట, వారు యిద్దరు పోటీలలో గెలుపు సాధించాలనే పట్టుదల కన్న, ప్రేమ పక్షుల వలే తిరుగుట యిందుకు కారణం అంటున్నారు మన క్రీడావేత్తలు. ప్రతి అంతర్జాతీయ క్రీడా పోటీలో ఓటమి తర్వాత మన క్రీడాధినేతలు యిచ్చు సంజాయిషీ కన్న యీసారి మోదాదు ఎక్కువ అయినదని యీ విమర్శ వలన అనిపిస్తూంది.

గత 20 ఏళ్ళకు పైగా మార్పు లేకుండా యున్న మన జాతీయ 1500 మీటర్స పోటీలో బహదూరు ప్రసాద్ క్రిందటి ఏడు నూతన రికార్డు స్థాపించాడు. అంతే గాక బహదూర్‌ప్రసాద్ పాల్గొన్న ప్రముఖ అంతర్జాతీయ అథెలిటిక్ పోటీ బీజింగ్ ఏషియాడ్. ఆసియా క్రీడలకు ముందు ఢిల్లీ నెహ్రూ స్టేడియంలో జరిగిన 'పర్మిట్ మీట్' మినహా, ఆరు వారముల ముందు ఏ పోటీలో పాల్గొనలేదు. క్రీడాధినేతలు బహదూర్‌ప్రసాద్ వలన స్వర్ణ పతకం ఆశించారు. ఏ పతకము లభించక పోవుటతో నిస్పృహ చెందారు.

బహదూర్‌ప్రసాద్ బీజింగ్ ఆసియా సమయంలో సరియైన ఆహారము లభించలేదని బాధ వ్యక్తపరిచాడు. బీఫ్, పోర్క్ అతను తినడు. భారతీయ-క్రీడాకారులకై చైనాలో (బీజింగ్) గల మనదేశ రాయబార వర్గము వారు భోజనం ఏర్పాట్లు చేసారు. అక్కడ లభించిన ఆహారము అందరు క్రీడాకారులకు సరిపోలేదు సరి అయిన ఆదరణ లభించలేదు అంతేగాక మనజట్టుతో వెళ్ళిన 'కోచ్'లు, అధికారులు పోటీలకు ముందు క్రీడాకారులను ప్రోత్సహించుట, సదుపాయములు సమకూర్చుటలో అంతగా ఆసక్తి చూపలేదు సీనియర్ కోచ్ 'సయాని' కొంత వరకు బహదూర్‌ప్రసాద్ యందు ఆసక్తి చూపాడు ఖతార్, జపాన్, చైనా, పాకిస్తాన్ అథెలిటిక్స్ అన్ని సదుపాయములు అంతర్జాతీయ పోటీల అనుభవముతో వచ్చారు పోటీలలో ఆసియాలో 1500 మీ. పరుగులో రికార్డు నెలకొల్పిన జపాన్‌వాసి ఆరతే బీజింగ్ ఏషియాడ్‌లో ఆరవ స్థానము పొందాడు. పోటీలలో జయాపజయాలు, ముఖ్యముగా అథెలిటిక్ పోటీలలో పోటీ ముగియు వరకు చెప్పుట కష్టము అంటాడు బహదూర్‌ప్రసాద్.

ఇక తనకు, సునీతా కుమారికి బీజింగ్ వ్యవహారము గురించి తన తోటి అథెలిట్‌గా ఆమెతో ప్రవర్తించాను కాని ఎటువంటి సంబంధము లేదంటాడు. బీజింగ్ ఆసియా క్రీడలకు ముందు బెంగుళూరు, ఢిల్లీ శిక్షణ శిబిరములలో యిద్దరు కలసి పాల్గొన్నారు అంతకుముందు అనేక పోటీలలో శిక్షణ శిబిరములలో ఇద్దరు కలసి యున్నారు ఎప్పుడురాని అపవాదు యిప్పుడు వచ్చుటలో ముఖ్య కారణం అధినేతలు తమ అసమర్థత కప్పిపుచ్చు కొనుటకు యిటువంటి ప్రచారము చేస్తున్నారు అంటున్నాడు బహదూర్‌ప్రసాద్

ఏది ఏమైనా యిటు వంటి ప్రచారం క్రీడారంగ అధినేతలు చేయుట సరికాదు ఇది క్రీడారంగానికి జరుగు అపార నష్టము

–ముకరమ్

సీరియల్

# భారత మహాకవిత్రయం

## భాగవతుల సుబ్రహ్మణ్యం

**ఇంతవరకూ సాగినకథ-10 :** చాళుక్య ప్రభువు రాజ రాజ నరేంద్రుల కుల బ్రాహ్మణుడు నన్నయ భట్టారకుడు. మహామంత్రి వజ్జియ. నన్నయుల సలహాపై రాజరాజనరేంద్రుడు విజయాదిత్యుడిపై యుద్ధానికి సన్నద్ధమవుతాడు. బావగారైన రాజరాజ నరేంద్రుని శాంతింపజేసి రాజాధిరాజు, రాజేంద్ర దేవులు కదనరంగంలోకి దిగుతారు. యుద్ధంలో విజయాదిత్యుడు రాజాధిరాజు కాలు తెగకొడతాడు. సోమేశ్వరత్రైలోక్యమల్లుడు రాజ్యబహిష్కరణ చేసిన నారాయణ భట్టు నన్నయుద్వారా రాజాశ్రయంపొంది అగ్రహారాలు దానంగా పొందుతాడు. నన్నయ రచించే ఆంధ్ర మహాభారతం ఆచంద్ర తారార్కం నిలిచివుండాలంటూ అథర్వణాచార్యుడు నన్నయను ఆశీర్వదిస్తాడు.

(గత సంచిక తరువాయి)

స్నాన సంధ్యాద్యనుష్ఠానాలు ముగించుకొని రాచనగరుకు బయల్దేరాడు నన్నయ.

వారితో నన్నయ హృదిలో భావ సంఘర్షణ....

రాజరాజు నేడు ప్రత్యేకంగా తనను పిలువనంపిన కారణమేమి?

ఆదిపర్వం పూర్తయిందని. సభా పర్వంలో అప్పుడే ఆశ్వాసాలు అయ్యాయనీ తాను పంపిన సమాచారం విన్నాక కుతూహలం కలిగిన ప్రభువులు అయినంతవరకు వినవేడుకపడు తున్నారా?

మరొక ఊహ కూడా సాగింది...

ప్రభువుల వారు కృతి పతిత్వం కోరే ప్రస్తావన వస్తే...?

నిరభ్యంతరంగా తాను ప్రభువుకి అంకితం చెయ్యగలడు. కాని ప్రభువుకో ఆ ఊహ ఉన్నట్టు తోచడం లేదు.

కేవలం వ్యాస భారతాన్ని ఆంధ్రీకరించమని మాత్రమే కోరిన రాజరాజ నరేంద్రుల వారు స్వప్రయోజన రహితంగా, వైదిక మతోద్ధరణే పరమార్థమైన లక్ష్యంగా భారతాన్ని తెనిగించమని కదా ఆజ్ఞ నిచ్చింది. దీనిలో స్వార్థమేమైనా వుందా అంటే- అది కేవలం తమ వంశావతార మూలపురుషులైన పాండవుల చరిత్రను అందరికీ అందుబాటులోకి తేవాలన్న కుతూహలం మాత్రమే! అంతేకాని కృతి పతిత్వం కోరడేమో!

ఇంతవరకూ అడగకున్నా, ఒకవేళ ఇప్పుడు కోరితే ఏం చేయాలి?

అవతారికలో తాను కృతిపతి వంశ వర్ణన గాని, ప్రభువుల కభ్యుదయ పరం పరాభివృద్ధిగా కావ్యాన్ని ప్రారంభించినట్టు గాని ఎక్కడా ప్రస్తావించలేదు. కనుక షష్ఠ్యంతాల ప్రసక్తే లేదు. అయితే ఆశ్వాసాద్యంతాల్లో రాజరాజును శ్రోతను చేసినట్టు సూచ్యంగా రాసిన పద్యాలు ప్రభువులకు సంతసం కలిగించగలవు.

మరొక్క సందేహం నన్నయ మనస్సును పీడిస్తోంది.

తాను ప్రధాన కథతో అంతగా సంబంధం లేదనుకున్న విషయాల్నీ, అనౌచిత్యమయంగా కల్పించిన కథలూ- తత్త్వ విషయ బాహుళ్యమైన వృత్తాంతాల్నీ వదిలేశాడు.

సూతుడు భారత కథను సంగ్రహంగా చెప్తూ, 'యుద్ధంలో పాండవుల జయాన్ని దుర్యోధనుని దుశ్చర్యల్ని సంజయుడి ద్వారా విన్న ధృతరాష్ట్రుడు తనకు 'జయముపై ఆశపోయిందని చెప్పి విచారించిన 55 శ్లోకాల కథా భాగం మూలంలోని ప్రథమాధ్యాయంలోనే వున్నా తాను విడిచి పుచ్చాడు. అయితే దీన్ని సమర్థించుకొనే సాధన సామగ్రి తన వద్ద వుంది. ప్రభువును ఒప్పించవచ్చు!

ఆలోచనలో పడి అన్యమనస్కుడైన తాను రాచ నగరులో ప్రవేశించిన విషయాన్ని అప్రయత్నంగా గుర్తించాడు. గోష్ఠీ మందిరం దగ్గరే పల్లకీకి ఎదురేగిన రాజరాజు కేలూత ఇచ్చి, నన్నయని సంభావించి సకలోపచారాల


తో స్వాగతించాడు.

మందిరంలో సుఖాసీనుడైన తర్వాత "ప్రభూ! బారతాంధ్రీకరణకు నన్ను నియోగించి చతుష్షష్టి మాసాలు గడిచాయి సాగినంత మేర అరవై నాలుగు కళల్లో ఏ కళ ప్రస్తావన వచ్చినా రస సమ్మిశ్రితంగా రచిస్తూ వస్తున్నాను ప్రత్యేకించి ఈ విషయం పైనే నిరంతర లగ్న మానసుండనై వున్నందున తమను దర్శింపవచ్చే అంతరం ఎక్కువైంది ఏమి సెలవు?" అని ప్రశ్నించాడు నన్నయ

రాజరాజు చిరునవ్వుతో ఆ ప్రశ్నకు బదులివ్వకుండా "తమకు వేళకు అందవలసిన సమస్త సంభారాలు క్రమం తప్పక అందుతున్నాయా?" అని అడిగాడు

"ప్రభువుల ఆజ్ఞను శిరోధార్యంగా పాటించే భట వర్గం భృత్య వర్గం వుండగా దేనికి నాకు కొరత? ఎందులో నా కించుకైనా లోపం జరగడం లేదని మనవి చేయడానికి సంతోషిస్తున్నాను" అన్నాడు నన్నయ

"మంచిది మా అభిమతం కూడా అదే!నిత్యాధ్యాసైక భారత మనస్కులకు అన్య విషయ విచార ముందరాదు ఔచిత్యపోషణకది ఆటంక హేతువు. అదలా వుంచండి! మాకు సతతంబు అభీష్టమైన మా చంద్రవంశ



కీర్తిసుధానిధులు పాండవుల చరిత్ర ఎంత వరకు వచ్చిందో తమ కవన ధాటితో విన కుతూహల పడుతున్నాం! శ్రమగా భావించక విన్పించమని కవివతంసులకు మనవి" శ్రీగంట చూస్తూ అన్నాడు రాజరాజ నరేంద్రుడు.

"ప్రభువులు మనవి చేయడమా? ఆజ్ఞాపించాలి గాని.... అవశ్యం పఠిస్తాను" అని అక్కడే వున్న భటునికి కనుసైగ చేయగానే, పల్లకిలో వున్న తాళపత్ర సంచయం తెచ్చి నన్నయ ముందుం చాడు భటుడు.

ఆశీః పద్యాల అనంతరం–

"సత్యాశ్రయ కులశేఖర నిత్యోదయ
రాజరాజ నృప సు కవిజన స్తుత్యా
మహా గుణ విమలాదిత్యా గ్ర తనూజ
విమల ధీ రమణీయా" అని, విష్ణు వర్ధనాది చాళుక్య వంశ సంభవుడు విమలాదిత్యుని జ్యేష్ఠ కుమారుడైన రాజరాజ ప్రభువుని స్తుతించి,

"ఘన దురితాను బంధ కలికాలజ దోస తుషార సంహతిం
దన యుదయ ప్రభావమున దవ్వుగ జోపి జగజ్జనానురం
జన మగు రాజ్య సంతత వసంత నితాంత విభూతి నెంతయుం
దనరు జళుక్య మన్మథుడు ధర్మనిబద్ధ దయార్ద్ర బుద్ధియై"


తన విరచిత తెనుగు భారతాన్ని వింటున్న రీతిని ఆశువుగా చెప్పాడు నన్నయ.

"ప్రభూ! నా కవిత్వ పద్ధతిలో కర్ణాటానుసరణ వుందని తమరు అపోహ పడవద్దు. చంద్ర వంశజులైన తమ పూర్వీకులు దుష్యంతుడు, భరతుడు, జనమేజయుల వరసలో ని వారైన తమరికీ అన్వయించేలా ఇందులో కొన్ని పద్యాలు రచించాను. మీ ప్రతిరూపాన్ని ఒక్కొక్క భారత మహారాజు పాత్రకు ఆపాదించాను. అది దోషంగా ఎంచకుందురు గాక!" అని ముందుగానే మనవి చేశాడు.

"ఎంత మాట? దోషాలే ఎంచాలంటే విధాత సృష్టిలోనే ఎన్నో దోషాలున్నాయన్నది తమకు తెలీనిది కాదు గదా! నీచ కర్ములని, పాపుల్ని, మాత్సర్య గ్రస్తుల్ని, మదోన్మత్తుల్ని సృష్టించిన విధాతృ సృష్టి లోపభూయిష్ఠం కాదా? అయినా– అనుకరణ వేరు, అనుసరణ వేరు అని నేను గ్రహించగలను. కానివ్వండి" అన్నాడు రాజరాజ నరేంద్రుడు.

"పంపడు రాసిన భారతంలో కొన్ని మంచి సమాసాలు పడ్డాయి ప్రభూ!లౌల్యత కొద్దీ వాటిలో కొన్ని తెనుగున నేను చొప్పించాను. రేపెప్పుడైనా విమర్శకులు వాటిని ఎత్తి చూపి అపోహపడి, గోరంతలు కొండంతలుగా చేసి 'నన్నయ కృతమైన భారతమంతా పరానుకరణమే!' అని నింద వేయకుండా నా గుణదోషాలను నేనే తమకు ముందుగా నివేదిస్తున్నాను" అన్నాడు నన్నయ.

"అది చౌర్య లోలత ఎంత మాత్రం



# సన్నని దరహాసాల నిలయం
# నన్నయ హాస్యం

భారతాంధ్రీకృతిలో నన్నయ స్వతంత్రంగా పెంచిన భాగాలు నవరసపోషణా ధురీణతకు అద్దం పట్టేవిగా వున్నా, హాస్యరసం మాత్రం అంతంత మాత్రమే! పకపక నవ్వించే హాస్యం కాదు నన్నయ్యది. విరిసీ విరియని దరహాస చంద్రికలు పెదవులపై నర్తింపజేసే మృదు హాస్యం అది.

కౌరవ పాండవుల విద్యాభ్యాసం పూర్తయింది. గురుదక్షిణ కోరాడు ద్రోణుడు. ద్రుపదరాజును బంధించి తెమ్మన్నాడు. కౌరవులు ఓడిపోయి తిరిగి రాగా, పాండవులు బయలుదేరారు. భీమసేనుడు సేనాగ్రచరుండుగా, నకుల సహదేవులు రథ చక్ర రక్షకులుగా, రథారూఢుడైన కవ్వడి (అర్జునుడు) ద్రుపదరాజ సేనా వాహిని దరియజొచ్చాడు. అప్పుడు–

"అనిలజు డుగ్రుడై ద్రుపదు హస్తి ఘటా వళినశ్వసంగతి
ఘనరదకోటి భగ్నములుగా సమరంబునఁజేసి పేద దు
ర్మనుజుల చంపనేలయని మానుగ గోపుడు గోగణంబులన్
కొనకొని రొప్పునట్లు లధికుండెగిచెన్ వృధుదండహస్తుడై...."

అర్జునుడు ద్రుపదుని ఏన్గులను, రథాలను, నుగ్గు నుగ్గు చేస్తూ యుద్ధం చేశాట్ట. కాని పేదలు, బలహీనులైన మానవులను చంపడం ఎందుకని తలచి పెద్దకర్ర ఒకటి చేపట్టి పశువుల కాపరి గోవుల మందలను తోలినట్టుగా వెంటపెట్టి తరిమాడట!

ఈ దృశ్యం కళ్లముందు ఊహించుకుంటే, పెదవుల మీద చిరునవ్వు ముద్రలు తొణకవా మరి? ○

కాదు. గుణ గ్రహణ పారీణత. మంచి ఎక్కడున్నా అది అనుసరణీయమే!దానికి విపరీతార్థాలు కల్పించడమే దోసం''

"అది తమ సంస్కార విశేషం ఇంతకూ నేను ముచ్చట పడిన పంప భారతంలోని పద్యం ఇది'' అని

'శ్రీపతిగె యుద్ధ మల్లమ
హీ పతిగె నెగరి పుట్టిద నఖిల
క్ష్మా పాల మౌళి మణి కిర
ణా పాలిత నఖ మయూఖ రంజిత చరణం' అనే పద్యం చదివాడు దీనికి దరిదాపు తెలుపుసేతగా

"శ్రీవనితా వల్లభ! వే
గీ విషయా ధీశ! కావ్యగీత ప్రియ! నా
నావని నాథ కిరీట త
టీ విలసద్రత్న సంఘటిత పద కమలా''

అన్నాను వ్యాసభారత మూలంతో దీనికి సంబంధం లేదు అయినా అక్షర రమ్యత నన్ను ఈ పనికి పురికొల్పింది'' అన్నాడు నన్నయ

'సెబాసు ఆదికవి వతంసా భాషకు వన్నె తెచ్చే సమాసాలు ఘటించారు దీన్ని అనుసరణ అనడం కూడా సంశయాస్పదమే! బుద్ధిమతుల ఆలోచనారీతి సమాంతరంగా సాగుతుందనడానికి ఇదే. నిదర్శనం. లేనిపోని శంకలతో హృదిని అల్లకల్లోల పరచుకోక తర్వాత కథా భాగం కానివ్వండి'' అని ప్రభువు ఆనతివ్వడంతో ఏకధాటిగా అంతవరకు తాను రాసిన భారత గాథ పఠించి ప్రభువుకు వీనుల విందు చేశాడు నన్నయ భట్టారకుడు.

**ఘటికారావం రెండో జామును సూచిస్తోంది.**

కాలాన్నే కట్టి పడేసిన నన్నయ కవితను ఆస్వాదిస్తున్న రాజరాజు;ఘంటికాశబ్దం విని, చేసైగతో "మృదుమధుర రసభావ భాసుర నవార్థ రచనా విశారదా! ప్రాకట భూసురోత్తమా! కాలమే తెలియరానంత రచనా పరిపుష్టమైన తమ విరచిత భారతం ఎంత విన్నా తనివి తీరడంలేదు. అలాగని సమయా సమయ విచక్షణా రహితంగా ప్రవర్తించుట పాడిగాదు. ప్రస్తుతానికి...'' అని ప్రభువు ఇంకా అంటూండగానే నన్నయ అందుకొని "మరొక్క ఘట్టమే వుంది ప్రభూ! కేవలం కొద్ది లిప్తల కాలం మళ్లీ మరికొంత రచన సాగేవరకూ మనకీ రీతి సమావేశం లభించదుకదా!'' అన్నాడు చదివి వినిపించిన తాళపత్రాలను ఒక క్రమంలో పేర్చుతూ.

"నిజమే! తనకు రాచకార్య నిర్వహణలో మళ్లీ ఎప్పటికి తీరిక చిక్కునో'' అనుకొని, "కాని గాత్ర సౌలభ్యంకోసం ఇంచుక సేద తీరండి'' అని ఆనతిచ్చాడు రాజరాజు- అంతవరకూ సాగిన భారత కథా శ్రవణాన్ని మననం చేసుకుంటూ.

తమ పూర్వీకులైన భారత వంశజుల గురించి చెప్తూ, శంతన వంశోద్ధారకురాలైన సత్యవతిని గురించి చెప్పడానికి తత్కారణమైనదీ, భారత కథకే మొదటిదీ అయిన ఉపరిచర వసువు కథను ఎత్తుకోవడంలో నన్నయ చూపిన అపారమైన ప్రజ్ఞను మెచ్చుకోకుండా ఉండలేకపోతున్నాడు.

జనమేజయుడు కౌరవ వంశాన్ని గురించి అడ, వైశంపాయనుడు శంతనునితో ప్రారంభించి చెప్పదలచి, కౌరవ వంశోద్ధారకులైన సత్యవతీ జన్మ వృత్త మెరిగింపనెంచి దానికి కారకుడైన ఉపరిచరుని చరిత్రతో కథా బీజావాపన చెయ్యడం ఎంత రసవత్తరంగా వుంది?

సంస్కృత భారతం ఆదిపర్వంలోని పురువంశ సంకీర్తనంలో


"యం యం కరాభ్యాం స్పృశతి-
జీర్ణం స సుఖ మశ్నుతే
పునర్యువాచ భవతి-
తస్మాత్తం శాంతనుం విదుః''

అని వృద్ధుల్ని తన చేతుల్తో ఎవరు స్పృశించి యౌవనవంతుల్ని చేయగలరో వారే శంతనులు అష్ట వసువులకు జన్మనిచ్చిన గంగాదేవీ సమేతులు అని వర్ణించిన దానికి అక్షరాలా న్యాయం చేశారు తమ కుల బ్రాహ్మణులు నన్నయ భట్టారకులు

ఇన్ని ఉపాఖ్యాలు, బహు ధర్మార్థ విచారాలున్నాయి కనుకనే సర్వజన రంజకంగా భారతాన్ని తెనుగున తీర్చడానికి ఎందరో సందియమందారు.

"అమితాఖ్యానక శాఖలం బొలిచి
వేదార్థామల చ్ఛాయమై
సు మహా వర్గ చతుష్క పుష్ప
వితతిన్ శోభిల్లి కృష్ణార్జునో
త్తమ నానా గుణ కీర్తనార్థ
ఫలమై ద్వైపాయనోద్యాన జా
త మహా భారత పారిజాత మమరున్
ధాత్రీసుర ప్రార్థ్యమై''

## అనిల్‌కపూర్ రొమాన్స్



ఇటీవల వచ్చిన చిత్రాలన్నీ ఫ్లాప్ కావటంతో పాపం అనిల్‌కపూర్ నిరాశా, నిస్పృహలకు గురి అయ్యాడట అంతే కాదు అతని రేటు 25 లక్షల నుంచి 10 లక్షలకు పడిపోయింది. ఏ నిర్మాతా సాహసించి అనిల్‌కపూర్‌కు అవకాశం యివ్వటం లేదు చిత్రాల మాట ఎలావున్నా శిల్పాశిరోద్కర్‌తో రొమాన్సు వ్యవహారం కొనసాగుతోంది ఈ వ్యవహారం కొనసాగిస్తూనే శిల్ప చెల్లెలు నమ్రతను కూడా అనిల్ లైన్లో పెట్టేందుకు ప్రయత్నిస్తున్నాడట సినిమాల్లో అవకాశాలు రాకపోతే ఏదో ఒకటి చెయ్యాలిగా కాలక్షేపానికి! అందుకే ఈ రూట్‌లో పడివుంటాడు అనిల్. మరి యివన్నీ సక్సెస్ అవుతాయో? లేదో?!

నటువంటి ఈ భారతం నిజంగా నన్నయ భట్టారకులు చెప్పినట్టుగానే

"సాత్యవతేయ విష్ణుపద సంభవమై
విబుధేశ్వరాబ్ధి సంగత్యుప
శోభితంబయి జగద్విదితంబగు
భారతీయ భా
రత్య మరాపగౌఘము నిరంతర
పుణ్య సంప దు
న్నత్యభివృద్ధి సేయు వినినం
గొనియాడిన నెల్ల వారికిన్"

అని నిర్ధారించుకున్నాడు రాజరాజ నరేంద్రుడు

సభాపర్వంలోని వేదాగ్నిహోత్ర ఫలితాన్ని ప్రభువుకు నచ్చేలా

"అగ్నిహోత్ర ఫలా వేదా -
దత్తభుక్త ఫలం ధనమ్
రతి పుత్ర ఫలాదారాః
శీలవృత్త ఫలం శ్రుతమ్"

అని మూలంతో సరిపోలేలా యథా తథంగా రాసిన

"దార సంగ్రసంబు ధరణీశ!
రతి పుత్ర ఫలము. శీలవృత్త
ఫలము శ్రుతము
దత్త భుక్త ఫలము
ధనము, వేదము లగ్ని
హోత్ర పల ములనియు
నొగి నెఱుంగు"

అనే పద్యంతో ఆపాడు నన్నయ.

తరువాత వారి సంభాషణ వివిధ రాచ కార్యాలమీదకు మళ్ళింది.

## 33

## గోదావరీ తరంగిణే భక్తి స్రోతమై 'మహాభారత' మానస గోచర మవుతోంది.

స్నానార్థం మిత్రు లిద్దరూ గోదావరీ తీరానికి వేంచేశారు.

"ఆఁ!... ఆఁ!... నారాయణా! ఆగాగు... అక్కడ లోతు ఎక్కువ" నదిలోకి దిగుతున్న నారాయణభట్టును వారిస్తూ అన్నాడు నన్నయ.

"నువ్వు ఈదుతున్న భారత సాగరం కంటేనా?" నవ్వుతూ అడిగాడు నారాయణభట్టు.

"కాలకృత్యాల సమయంలోనూ కవిత్వ చర్చలేనా? ముందా ఉపసంవ్యాన (పై ఉత్తరీయం) తీసి గట్టున పెట్టు"

"ఆఁ!..." అని "నన్నీ! నీ ఆ ప్రపదీనం (ముంగాలి వరకు ధరించిన వస్త్రం) దాటని లోతు అక్కడవుందా?" అడిగాడు నారాయణభట్టు.

"ఈ రేవు నేను నిత్యం స్నానం చేసేదేగా!" అని నారాయణభట్టును తానున్నవైపు రమ్మని పిలిచాడు నన్నయ.

### మహాభారత సేనలు

కురుపాండవులకు మహాభారత సంగ్రామం జరిగింది. ఈ మహాసంగ్రామములో కురు పాండవుల తరఫున పాల్గొన్న సేనలు యిలా వున్నాయి.

పాండవుల తరఫున:

కాల్బలము- 7,65,450, అశ్వబలం- 4,59,270, రథాలు-1,53,090, గజబలం-1,55,090.

మరి కౌరవసేన వివరాలిలా వున్నాయి:

కాల్బలము- 13,12,200, అశ్వబలం- 7,87,320, రథాలు-2,62,440, గజబలం-2,62,440.

ఈ సంగ్రామము కేవలం 18రోజులు మాత్రమే జరిగినా, కౌరవ సేనా నాయకుడు భీష్ముడు 9రోజుల యుద్ధములో దాదాపు 90,000 శత్రువులను నిర్జించారు. అంటే రోజుకో 10 వేలు చొప్పున మరణించడం జరిగింది. 18రోజుల్లో దాదాపు పై నుదహరించిన సైన్యమంతా హతమైంది ఏ కొద్దిమందో తప్ప.

సేకరణ: వి. విజయలక్ష్మీరెడ్డి

"కవిత్వ చర్చ నాకు సతతం కుతూహల దాయకమే! అందులోనూ శబ్దశాస్త్ర చర్చ మరీనూ! 'ఏకః శబ్దః సమ్యక్జ్ఞాతః సుష్ఠు ప్రయుక్తః స్వర్గేలోకే కామధుక్ భవతి' (శబ్దం ఒకటి బాగా తెలుసుకుని ప్రయోగిస్తే స్వర్గలోకంలో మన పాలిట కామధేనువవుతుందట) అని కదా ఆర్యోక్తి" నన్నయ అన్నాడు.

"నిజం నన్నీ! 'అనౌచిత్యాదృతే నాన్యద్రస భంగస్య కారణమ్! ప్రసిద్ధౌచిత్య బంధస్తు రసస్యోపనిషత్పరా' అని అనౌచిత్యాన్ని తప్పనిసరిగా పరిహరించి శబ్ద ప్రయోగం చెయ్యాలని శబ్ద తత్త్వవేత్తలు నిర్వచించి వున్నారు కాబట్టి దానికి ఎక్కువ శ్రద్ధ తీసుకోవాలి"

"అదే నా అభిప్రాయం కూడా! అంగసౌష్ఠవంలేని స్త్రీ రూపవతి కానట్టే, ఔచితీ పోషణలేని కావ్యం ఏదీ కావ్యం అన్పించుకోదు. నా అదృష్టవశాత్తు నా జీవన వైఖరికీ- ప్రభు భావ వృత్తికీ సరిపోయినట్టుగానే తొలి మూడు పర్వాలూ నాకు లభ్యమైనాయి. భృగు వంశ భారతవంశాది సంకీర్తన, ప్రాచీన మహర్షుల మహాత్మ్య కథనం, ఋష్యాశ్రమ పుణ్యతీర్థ వర్ణనం, పాండవేయుల గుణగణ సంకీర్తనం, వైదిక ధర్మాలు, యజ్ఞ యాగాలవంటి వాటి పట్ల నాకున్న మక్కువా - సహజోత్సాహాలు వ్యక్తం చేసుకోడానికీ ఈ బాగం నాకెంతో అనువుగా లభించింది కానీ ఆంధ్రీకృతిలో అడుగడుగునా అడ్డు తగులుతున్నది వ్యాకరణమే!

"అదేమిటొయ్! నీ కావ్యశయ్య శబ్దాలంకార సమన్వితం వేద స్వరాల్లో నాదం వున్నట్టు నీ దిర్ఘతముడి వృత్తాంతం- వశిష్ఠ చరితంలో వేదనాద మధురిమ విన్పిస్తోంది నీ పద్యాల్లో ఈ మాధుర్యమే కదా ప్రాణం మనం గతంలో చర్చించుకున్నట్టు రసభావాలకు ప్రాధాన్యత ఇస్తున్నప్పుడు వ్యాకరణాన్ని లెక్కలోకి తీసుకోనక్కరలేదు."

సిఖ ముడి వేస్తూ "కానీ... వ్యాకరణ విరుద్ధమైన ప్రయోగాలు." అంటూ నన్నయ ఆగిపోయాడు- నారాయణభట్టు ముఖం చూసి

"నువ్వు శ్రీకారం చుట్టిన శ్రీ వాణీ గిరిజాశ్చిరాయ పద్యమే తీసుకో! అది సంస్కృతాంధ్ర భాషల సంకరీకరణ వున్న శార్దూల వృత్తం కదా! అంతెందుకూ? నీకో విషయం చెప్తాను విను మన పూర్వీకుల గ్రంథాలున్నాయి అవి ఇప్పటి వ్యాకరణానికి విరుద్ధాలు అవునా?కాదా?"

"నిజమే!"




SAY NO TO DRUGS

"... కనుక- ఆ ప్రాచీనుల్ని నేటి వ్యాకరణం కాదన్నంత మాత్రాన సరిపోతుందా? అప్పటికి లోకుల వాడుకలో వున్నట్టు వారు ప్రయోగించారు. తర్వాత పుట్టిన లక్షణ గ్రంథాలకు అవి అనింద్యాలయ్యాయి. అంచేత వ్యాకరణ విరోధం అని తెలిసీ కూడా, పూర్వ సంస్కృత సంప్రదాయ వేగంతో కలిసి, ఓ కొత్త తెలుగు సాంప్రదాయాన్ని అనుసరించి సంకీర్ణ రూపాలు ప్రయోగించవచ్చునని గ్రహించుకోవచ్చు!" భరోసా ఇచ్చాడు నారాయణభట్టు.

నన్నయ కింకా సంతృప్తి కలగలేదు.

"నామ ప్రత్యయ సాంకర్యం ప్రకారం- 'సంతోషపెట్టి, శోధించు, సంధిలు, సంభవిల్లె, నుతించె..." ఇలాంటివి సంస్కృతంలో సంకీర్ణాలు కాదా? ఇక మిశ్ర సమాసాలంటావా? .. చూడు!... 'వాడి మయూఖాలు, నాచు లతలు, మేటి మునిరాజు, కటిబంటి నెత్తురు కాలువలు'- ఇలాంటి వాటిని అనింద్యంగా లక్షణ గ్రంథాలు ఒప్పుకోవలసిందే!"

"అంటే మిశ్ర సమాసాల్లాగే, మిశ్ర సంధులూ లక్షణ గ్రంథాల చేత ఒప్పించవచ్చునా?"

"తెలుగు లక్షణ నిర్దేశానికి సైతం నువ్వే ఆద్యుడవై, నీ భారతాన్ని ప్రజారంజకం చెయ్యాలంటే మిశ్ర సంధిని సలక్షణంగా ఒప్పించాల్సిందే! నీ ఆదిపర్వం 3వ ఆశ్వాసంలో ఆ పని చెయ్యనే చేశావు. 'ఘనవల్లి యన్నిష్ట సఖినూది యున్న దాని'... అనే చోట అకారానికి ద్విత్వం సంస్కృత భాషా సంధి శాస్త్ర మర్యాద ననుసరించి సిద్ధించినా తెనుగు మర్యాద రీత్యా కాదు గదా! ఇక వ్యాసుని వర్ణనలో నువ్వు ప్రయోగించిన కపిలగడ్డము, కపిల జడలు, కపిల కన్నులు మిశ్ర సమాసాలే! కపిల సంస్కృత పదం మిగిలినవి తెలుగు పదాలు దానికేమంటావ్?"

"దేశ భాష రెండు వైపులా వాడి వున్న ఖడ్గంలాంటిది అంచేత మనో వాగ్వ్యాపారాలు మూడిట్నీ ఈ భాషలో విస్పష్టంగా స్ఫురింప జెయ్యగలగాలి.



అదే రసధ్వని. దానికి తగ్గ శబ్దాలు పదాలు వాడడమే నా లక్ష్యం"

"అది నీ లక్ష్యమే కాదు... నీ లక్షణం కూడా కావాలి. ఆ విధంగా నువ్వు లాక్షణికుడివి. ఔచిత్య పోషణ దానంతటదే సిద్ధిస్తుంది. ఆదిపర్వం ద్వితయాశ్వాసం మొదట్లో దాదాపు రెండు వందల పద్యాల 'నలోపాఖ్యానం' వుందా? అది మొత్తం కరుణరస ప్రధానం కదా! శార్దూల, మత్తేభ వృత్తాలు ఎక్కడా రాయకుండా జాగ్రత్త పడలేదూ!"

"భారతంలోని కొన్ని ఉపాఖ్యానాలు అసలు పూర్తిగా వైదికాలు.... కొన్ని రాజుల కథలు.. కొన్ని రుషి మహాత్మ్యాల్ని వివరిస్తాయి. అంచేత ఒక్కొక్కటి ఒక్కొక్క రీతిలో చెప్పాలి...."

ఇద్దరి స్నానం పూర్తయింది....

దూరాన ఓ ముగ్ధ మోహనాంగి నీటి కోసం నీలాటి రేవు వైపు కదిలి వెళ్తోంది. నారాయణభట్టుకు తన కూతురు స్ఫురణకొచ్చింది.

"నన్నీ! కుపమకు యుక్త వయసొచ్చింది. వేడుకగా ఇక ఆ వివాహం కాస్తా జరిపించేస్తే, నా బాధ్యత నెరవేర్చేసుకున్నట్టే" నారాయణభట్టు

## విధిబలీయం

మనసుపగిలిన
అద్దం అంటారు!
విరిగిన మనసు
అతకదంటారు!
గాజు పెంకులాంటి
దంటారు!
ఆ మనసు పరిపరి విధాలుగా
పయనిస్తుందంటారు!
అదుపు ఆజ్ఞ లేనిదంటారు!
ఆ మనసు కూడా విధి
ముందు బలీయం!
ప్రతివారు విధికి
అవుతారు అస్మదీయం!
తప్పించుకోలేరు
విధిబలీయం!

—కంకటి శంకర్‌రావు

తన తంత్రక (నూతన వస్త్రం) అందుకుంటూ అన్నాడు.

"అవును నారాయణా! నేనూ అదే అప్పుడప్పుడు అనుకుంటూ వుంటాను. చిన్న రాణీ రేవలదేవి కూతురు సోమలదేవికి వివాహం నిశ్చయమైనప్పటి నుంచి ఈ మాట నీతో ప్రస్తావించాలనుకుంటూనే వున్నాను..."

"ప్రస్తావించి ఊరుకుంటే ఎలాగోయ్! వరాన్వేషణ ఏమన్నా చేసి చెప్పాలి గాని... "

"సర్వవిధాలా మనతో తూగగల పండితుల ఇంట ఇస్తేనే సంబంధం దీటుగా వుంటుంది. నాకు తెలిసినంత వరకు మన పావులూరి మల్లన బంధువుల్లో ఓ పిల్లవాడున్నాడని వినికిడి...."

"కేవలం వినికిడితో కాదు. విషయం కదిపి అలికిడి అయ్యేలా చూడు. రాకుమార్తె సోమలదేవితో పాటే కుపమ వివాహం కూడా జరిగిపోతే స్నేహితులిద్దరూఒక్కసారే అత్త వారిళ్లకు వెళ్లిపోతారు".

"అవునవును... అసలే బాల్య స్నేహితురాళ్లాయె! ఒకర్నొకరు విడిచి ఉండలేనప్పుడు, ఇద్దరికీ విడి విడిగా తోడు దొరకాలి కదా!" నవ్వుతూ అన్నాడు నన్నయ.

"ఏదేమైనా నీ చేతి మీదుగానే ఆ శుభకార్య ప్రస్తావన జరగడం నాకిష్టం నన్నీ! వ్యవహారవేత్తవు. కుపమ మీద నీకున్న పుత్రికా వాత్సల్యం నేనెరుగనిది కాదు. అంచేత ఈ బాధ్యత నీ మీదనే పెట్టి నేను నిశ్చింతగా వుంటాను" ఆరాధనా పూర్వకంగా చూశాడు నారాయణభట్టు.

"నా భారతాంధ్రీకరణ సహకార భారం నేను నీ మీద పెట్టి నిశ్చింతగా వున్నట్టు... కదూ!" నవ్వుతూ అన్నాడు నన్నయ.

అనంతరం మిత్రులిద్దరూ భగవధ్యానానికి సమాయత్తమయ్యారు.

జగత్సాక్షికి అంజలి ఘటిస్తున్న నన్నయ వంక నిర్నిమేషంగా చూస్తుండిపోయాడు నారాయణ భట్టు.

★ ★ ★ ★ ★



మీ 'సందేహాలకు' రచయిత జవాబులు

# భారత మహాకవిత్రయం

విశేషాదరణ పొందుతున్న ఐతిహాసిక ధారావాహిక 'భారత మహాకవిత్రయం' సీరియల్ చదువుతున్న పాఠకులు తమ సందేహాలుంటే క్లుప్తంగా కార్డుమీద రాసి భా మ క సీరియల్ సందేహాలు, ఎడిటర్, ఆంధ్రపత్రిక (వీక్లీ), గాంధీనగరం, విజయవాడ–3కి పంపండి రచయిత శ్రీ భాగవతుల సుబ్రహ్మణ్యం సచిత్రవార పత్రికలో జవాబులు అందిస్తారు చొప్పదంటు ప్రశ్నలుగాక ధర్మ సందేహాలే అడగమని మనవి– యక్షప్రశ్నలు కూడా పంపవద్దు అని విజ్ఞప్తి. ప్రశ్న, మీ పూర్తి పేరు, చిరునామా కూడా కార్డు మీద రాసి పంపండి.

–ఎడిటర్

## 34

"చీదమార్య పండితుల వారికి పిచ్చెత్తినదట"

"పాపం! నిన్నటి వరకూ బాగానే వున్నాడు అదేమిటో . నిన్న మధ్యాహ్నం నుంచీ ఉన్నట్టుండి ఉన్మత్తంగా ప్రవర్తించసాగాట్ట!"

"ఎలాంటి బుద్ధులున్న వాళ్లకు అలాంటి వ్యాధులే సిద్ధి... భారత రచనకు అడ్డుపడ్డ రోజునే అనుకున్నాం- ఇలాంటిదేదో జరుగుతుందని. ఆ దేవుడు చూడకుండా వుంటాడా?" రాజమహేంద్రి అంతటా ఏ మారుమూల విన్నా ఇవే గుసగుసలు ..

కొందరు బాహాటంగానే అనుకున్న వారూ వున్నారు. కాని వారి సంఖ్య అత్యల్పం.

అయితే హఠాత్తుగా పిచ్చెత్తడానికి కారణం మాత్రం అందరికీ అనూహ్యంగానే వుంది.

రాజరాజనరేంద్రుల వారికీ వార్త వేగుల ద్వారా క్షణాల మీద తెలిసింది పరామర్శ లేఖతో పాటు వెంటనే తమ ఆస్థాన వైద్యులను పండితుల వారింటికి పంపి ప్రభువుగా తన ఔదార్యాన్ని ప్రకటించుకున్నాడు రాజరాజు.

కాని, ఆ సాయంత్రానికే చారులు ఒక విశేష వార్త మోసుకొచ్చారు. అదే-అధర్వణాచార్యులు శాపం ఇచ్చిన తీరు.

నన్నయ ఇంటి నుంచి సరాసరి బయలుదేరిన అధర్వణాచార్యులు చీదమార్యుడిని వేణుగోపాలస్వామి ఆలయం వద్ద నున్న రావిచెట్టు వేదిక చెంత కలుసుకున్నట్టు చెప్పి, వారి మధ్య జరిగిన సంభాషణ యథాతథంగా వివరించారు

ఓ వృద్ధ దౌవారికుడు అందుకు సాక్ష్యం.

అధర్వణాచార్యుల వారికి, చీదమార్యుణ్ని చూడగానే పట్టరాని ఆగ్రహం కలిగిందట! అయినా నిగ్రహించుకుంటూ "పండితుల వారూ! తమ పాచికలు పరమభట్టారకుల వద్ద పారవు .. కుట్రలు కులీనులకు తగునా? అయినా తమరు కులీనులైతే కద! కలుషిత మనస్కులు" వేళాకోళంగా అన్న అధర్వణాచార్యుల ధోరణి చీదమార్యునికి వెంటనే అనుమానం కలిగించింది.

తన కౌటిల్యం బయటపడిపోతుందన్న భయంతో చీదమార్యుడు, తనకు రాజాస్థానంలో వున్న పలుకుబడిని ఉపయోగించడమే ఉపాయంగా భావించాడా క్షణంలో .

వెంటనే పహరా భటుల్ని చప్పట్లు [illegible] పిలిచి "ఈ పిచ్చి పండితుడ్ని అహహ! కాదు! కాదు!... పండిత వేషధారిని తక్షణం బంధించండి" అన్నాడు.

దాంతో రెట్టించిన ఆగ్రహంతో అధర్వణుడు "ఓయీ మాయావీ! పయోముఖ విషకుంభమా! నువ్వా నన్ను బందీని చేయించగలిగేది? పండిత వేషధారివీవే! మద మాత్సర్య పిశాచ గ్రస్తమైన నీ మనస్సే ఓ కుతంత్రాల పుట్ట. నువ్వా నన్ను పరిహసించేది! నిన్నిక ఉపేక్షించరాదు" అని, వెంట వున్న శిష్యుడు చేతరాగుడి చేతిలోంచి జలాన్ని తీసుకొని చీదమార్యుడిపై విసిరికొట్టాడు.

తన 'భారత' విధ్వంసానికి నన్నయను కారణభూతుడుగా చిత్రించి, అకారణంగా అతడ్ని శాపానికి గురి చేసిన అధముడు- అసలు కారకుడు అయిన చీదమార్యుణ్ని ఉద్దేశించి, అదే శాపంలోని మూడు అక్షరాలు మార్చి చీదమార్యుడికే తగిలేలా "చీదమార్యుడు మిన్నయౌ ఉన్మత్తుడవును గాక!" అని శాపం తిప్పేశాడు అధర్వణాచార్యుడు.

"సోదరార్యుడు నన్నయౌ ఉన్మత్తుడవును గాక" అని కదా గత శాపాక్షరాలు.

వాటిలో 'సో' అనే అక్షరానికి బదులు 'చీ' అనే అక్షరాన్ని, 'రా' అనే అక్షరానికి 'మా' అనే అక్షరాన్ని వెయ్యడంతో అది చీదమార్యుడ్ని ఉద్దేశించినట్టయింది. ఇక 'న' అనే అక్షరం మార్చి 'మి' అనే అక్షరం ప్రయోగించడంతో 'ఎక్కువ' అనే అర్థం వచ్చి, తక్షణం చీదమార్యుడిని పెనుపిచ్చి ఆవహించింది.

వశ్య వాక్కులైన వారు, సద్వర్తనులు ఆగ్రహించి పలికిన ఏ పలుకులైనా శాపం [illegible] తీరుతుందనడానికింతకంటె నిదర్శనం ఏం కావాలి?... అని ఆశ్చర్యపోయాడు వృద్ధ దౌవారికుడు.

అధర్వణాచార్యుని నోటి వెంట చివరి అక్షరం వెలువడడమే తడవు. అది మనోవేగాన చీదమార్యుణ్ని తాకి తన ప్రభావాన్ని చూపించింది.

తక్షణమే పిచ్చెత్తిన చీదమార్యుడు, చేతిలో వున్న తాటాకు గ్రంథాన్ని పై ఉత్తరీయానికి కట్టి గాల్లో తిప్పుతూ "అహహ్హాహహ్హా! ఓహో హ్హాహహ్హా! రాజుగారి సన్మానం నాకు... నేను చేసే సన్మానం మీకు" అంటూ అక్కడే వున్న దౌవారికుడి దవడ మీద ఒక ముష్టి ఘాతాన్నిచ్చుకున్నాడు. ఆ హఠాత్ప్రహారానికి అసలే వృద్ధుడైన దౌవారికుడు స్పృహ కోల్పోయి, సాయంత్రానికి గాని కోలుకోలేక పోయాడు.

కాస్త తెప్పరిల్లాక, సంధ్యవేళ గుసగుసలు తన చెవిన పడడంతో, అసలు కారణం వివరించడానికీ- చీదమార్యుడి పైన ఫిర్యాదు చేయడానికి బయలుదేరుతున్న దౌవారికుడిని గూఢ చారులే రాజాస్థానానికి తీసుకొచ్చారు. అధర్వుణుడిని బంధించమన్న చీదమార్యుడి ఆజ్ఞ పాటించబోయిన భటులే గూఢచారులకు ఈ సమాచారమంతా

## భారత మహాకవిత్రయం

అందించారు.

అధర్వణాచార్యుల వారి ఆగ్రహ కారణం కూడా తెలుసుకున్నాడు రాజరాజ నరేంద్రుడు.

అజాతశత్రువు, అసాధారణ మేధావి, తన కవిత్వమేదో- తానేదో తప్ప అన్య మెరుగని వాడు అయిన అధర్వణాచార్యుడిని నిష్కారణంగా కవ్వించి, తన గొయ్యి తానే తవ్వుకున్న చీదమార్య పండితుని పట్ల ప్రభువుకు ఆగ్రహం కంటే అనుకంపయే ఎక్కువగా కలిగింది. కోరుమిల్లి అగ్రహార దాన శాసన సందర్భంగా తాను చీదమార్యుడిని ప్రశంసించినట్టు అతడు గీత వేదార్థ తత్త్వవేత్త నిజంగా అయితే ఈ మాత్సర్యమేమిటో మరి!.... ప్రభువుకు ఎంత ఆలోచించినా అంతుపట్టలేదు. విజ్ఞులైన వారందరూ మనో బలహీనతలకు అతీతులు కావాలని ఎక్కడుంది? చీదమ అటువంటి వాడేనేమో!...

అధర్వణ పండితుడి రాజవైముఖ్యం విని వున్న వాడవడం వల్ల, తానే వారిని సందర్శించబూని తన రాక విషయం ఆయన ఆశ్రమానికి ఎరిగింపజేశాడు రాజరాజనరేంద్రుడు. అప్పటికే ఈ లౌకిక విషయాల పట్ల విముఖుడై, విసిగిపోయి వున్న అధర్వణాచార్యుడు వీతరాగుడికి ఆశ్రమ నిర్వహణ అప్పజెప్పి, అదే రోజు మధ్యాహ్నం సంపూర్ణ ఉత్తరదేశ యాత్రార్థం బయలుదేరి వెళ్ళిపోయాడని తెలుసుకొని రాజరాజు కించిత్ బాధపడ్డాడు.

ఏదేమైనా నన్నయను తాను ఒకనాడు భారత రచనకు నియోగించడంలో పొరపాటు పడలేదని- ఆ మహాకావ్యకరణం అతనికే సాధ్యమని రాజరాజనరేంద్రుడు ఈ ఘటనలతో పరిపూర్ణంగా విశ్వసించాడు. తన నమ్మకం పరిపరి విధాల రుజువవుతున్నందుకు అతడికెంతో ఆనందంగా వుంది.

(ఇంకా వుంది)

సంక్రాంతి శుభాకాంక్షలు

# గోదావరి డి.ఏ.పి.






## పైరుకు బలం రైతుకు వరం

పైరుబాగా పెరగడానికి, అధిక దిగుబడిని ఇవ్వడానికి నత్రజని,భాస్వరం పోషకాలు చాలా అవసరం **గోదావరి డి ఏ పి** లో అధికంగా **భాస్వరం** అంటే **46శాతం** మరియు **నత్రజని 18శాతం** వున్నాయి పెరిగే పైర్లకు కావలసిన పూర్తిపోషకాలను సరియైన సమయంలో గోదావరి డి ఏ పి అందిస్తుంది పూర్తిగా **నీటిలో** కరిగే రూపంలో ఉన్న భాస్వరం అధిక శాతంలో ఉండటం వలన వేళ్ళు త్వరగాను బలంగాను వృద్ధిచెంది **కాయలను గింజలను** అధికంగా **ఉత్పత్తి చేస్తాయి** అమ్మోనియారూపంలో ఉన్న నత్రజని నీటిలో కొట్టుకొని పోకుండా **మట్టికణాలకు అతుక్కొని మొక్కలను ఏపుగా పచ్చగా ఎదిగేలా చేస్తుంది**

**46 శాతం భాస్వరం, 18 శాతం** నత్రజని **అంటే మొత్తం 64 శాతం పోషకాలుగల కాంప్లెక్స్** ఎరువు గోదావరి డి ఏ పి దీనిలో ఉన్నన్ని అత్యధిక పోషకాలు మరేఇతర కాంప్లెక్స్ ఎరువుల్లోను లేవు అందుకే పైరు వేసే సమయంలో వాడేందుకు **అనువైన అత్యుత్తమ కాంప్లెక్స్ ఎరువు గోదావరి డి ఏ పి**

ఎరువు విలువను బస్తాబరువును బట్టికాని దానిధరనుబట్టికాని నిర్ణయించలేము ఉదా ప్రతి 50కిలోల 20 20 కాంప్లెక్స్ ఎరువుబస్తాలో 10 కిలోల భాస్వరం 10 కిలోల నత్రజని అంటే 20 కిలోల పోషకాలు ఉంటాయి కాని ప్రతి 40 కిలోల **గోదావరి డి ఏ పి ఎరువు బస్తాలో 18 4 కిలోల భాస్వరం, 7 2 కిలోల నత్రజని అంటే మొత్తం 25 6 కిలోల** పోషకాలు ఉంటాయి అంటే ఇంచుమించు ఒకేధరకు 20 20 కాంప్లెక్స్ ఎరువుబస్తాలో కన్నా అదనంగా 5 6 కిలోల **పోషకాలు** గోదావరి డి ఏ పి ఎరువుబస్తాలో లభిస్తాయి కాబట్టి బస్తాబరువుకాదు దానిలో పుష్టి పోషకవిలువను గమనించడం ముఖ్యం

**భారత దేశంలో** కెల్లా సరికొత్త కర్మాగారంలో **అత్యాధునిక** పరిజ్ఞానంతో మన ఆంధ్రప్రదేశ్ లో తయారయ్యే మొదటి డి ఏ పి గోదావరి డి ఏ పి




## పైరుదిగుబడికి - రైతురాబడికి వాడండి గోదావరి డి.ఏ.పి.